# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

మే
2024

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 5

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: **సాయినాథ్, రమేష్**

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| విశిష్టగుణ సంపన్నుడు హనుమంతుడు | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దివ్య... | 9 |
| పరమం పవిత్రం వైశాఖమాస వైశిష్ట్యమ్ | 18 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 22 |
| రామాయణ రత్నాకరం | 29 |
| నైమిశారణ్యం | 33 |
| తిరుప్పన్ ఆళ్వార్ | 36 |
| ముకుందమాల | 38 |
| నర్మదా తీరంలో పుణ్యపురాశి బేధాఘాట్ | 43 |
| శ్రీకృష్ణ తత్త్వం | 45 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 47 |
| పీఠికాపుర క్షేత్ర వైభవం | 51 |
| అక్షయలక్ష్మీ పూజ | 54 |
| ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు | 56 |
| పంచ ప్రయాగలు | 58 |
| భీష్ముడు | 60 |
| విష్ణు సహస్రనామం | 62 |
| ఆచారము అంటే ఏమిటి? | 62 |
| కోటి దీవెనల గుప్పెడు గోవిందుడు | 63 |
| మీ ప్రశ్న మా సమాధానం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# భక్తుల ఉద్ధరణ

భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా భగవంతుడు రకరకాల లీలలను జరుపుతుంటాడు. కొందరు భక్తులను ఎన్నుకొని వారిద్వారా లోకోపకారం కోసం ఎన్నో మహత్తరమైన లీలలను జరిపి తిరిగి ఆ కీర్తి ప్రతిష్ఠలను ఆ భక్తులకే వదలి, వారిని చూచి ఆయన ఆనందిస్తుంటాడు. ఇది భగవంతుడైన శ్రీవేంకటేశ్వరుని ఒకానొక గుణము. ఈ కలియుగములో వేదాలను చదివి వాటి సారాన్ని అర్థము చేసుకొని ఆచరించువారు బహు తక్కువ. అందుకే క్రీ.శ. 1500 శతాబ్దిలో అన్నమాచార్యులు అనే మహా భక్తుణ్ణి ఎన్నుకొని వారిచే వేదసారాన్ని కొన్నివేల సంకీర్తనల ద్వారా ఈ లోకానికి అందించారు. ఈనాటి మానవుడు కేవలం అన్నమయ్య సంకీర్తలను వింటే వారికి మన వేదాల సారము దాదాపు పూర్తిగా అవగతమవగలదు.

తాళ్ళపాక అన్నమాచార్యులు శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషముచే జన్మించి 32 వేల సంకీర్తనలను వ్రాశారు. ప్రతి సంకీర్తన ఒక ఆణిముత్యం. భగవంతుని తత్త్వాన్ని అందమైన పాటల రూపకంగా అందించారు. భగవంతుడైన శ్రీమన్నారాయణుడు ప్రస్తుతం శ్రీవేంకటేశ్వరునిగ తిరుమల కొండపై కొలువై ఉన్నాడన్నారు. బ్రహ్మాది దేవతలు ప్రతిరోజు స్వామివారిని కొలుచుటకు తిరుమల కొండకు వస్తారని చెప్పారు. ప్రతి మానవుడు స్వామివారిని కొలిచి ధన్యుడు కావలెనని చెప్పాడు. ఈ సృష్టిలో పరబ్రహ్మము ఒక్కటే అని అదే శ్రీవేంకటేశ్వరుడు అని చెప్పారు. కొందరు ఆయనను శివుడని, శక్తి అని, మరికొందరు నారాయణుడని ఎవరికి తోచిన పేర్లతో వారు పిలుస్తారని చెప్పాడు. పిండి కొలది రొట్టె అన్నట్లు జీవుని స్థాయిని బట్టి భగవంతుడు లభించునని చెప్పాడు. సృష్టిలోని సర్వమూర్తులకు ఈయనే ఆధారమని అన్నారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అని ఘంటాపథంగా చెప్పాడు. ఒక్క శ్రీవేంకటేశ్వరుని సేవిస్తే సమస్త దేవీ దేవతలను సేవించిన ఫలము కలుగుతుందని చెప్పాడు. ఈ సృష్టిలో ప్రతి జీవి పట్ల దేవదేవుని కృప ఒకేరకంగా ఉందునని, పాలకుడైనా, పామరుడైనా స్వామివారికి ఒకటేనన్నాడు. శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా శ్రీకృష్ణుడని చెప్పుచు ఎన్నో విధాలుగా వర్ణించాడు. స్వామివారిని చిన్నికృష్ణునిగా చేసి తన మురిపాలను తీర్చుకున్నాడు. ఆడుకున్నాడు. మరోసారి ఆయనను శ్రీరామునిగా, నారసింహునిగా చిత్రిస్తూ రకరకాలుగా వర్ణించాడు. ఈయనే త్రివిక్రముడని, ఈయనను మించిన దైవము సృష్టిలో మరొకటి లేదని ఢంకా బజాయించి చెప్పాడు. ఈయన కరుణాతరంగుడని, భక్తుల పాలిట కొంగుబంగారమని చెప్పాడు. ఈయన కృపకు అవధులు లేవని కూడా చెప్పాడు. స్మరించినంతనే ఆదుకునే దైవమన్నాడు. ఈయనను కొలుచుటకు నలు దిక్కుల నుండి జనాలు కష్టాలను ఎదుర్కొంటూ వచ్చి వారి కోర్కెలు తీర్చుకుంటారని చెప్తూ మీరూ వచ్చి కొలవండని చెప్పారు. త్రికరణశుద్ధిగా అర్చించిన భక్తుణ్ణి తనంతటివాణ్ణిగా చేస్తాడని అన్నాడు. ఇలా శ్రీవేంకటేశ్వరుని గుణ గణాల గురించి ఎన్నో విషయాలను చెప్పాడు. భక్తులను ఉద్ధరించుటకు ఒక్క సంకీర్తన చాలునని, కాని తనచే 32 వేల సంకీర్తనలు వ్రాయించాడని అన్నాడు. నిజానికి తాను శక్తిహీనుడనని, ప్రతి సంకీర్తన స్వామివారి శక్తిచే మాత్రమే వ్రాశానని కూడా చెప్పాడు. పైగా ఈ సంకీర్తనల కీర్తి ప్రతిష్ఠలను తనకు ఆపాదించి లోకము తనను గౌరవించేటట్లు చేశాడని కూడా చెప్పాడు.

ఇలా శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులను ఎన్నుకొని వేదసారాన్ని ఈ లోకములోని పామరులకు అందునట్లు చేశాడు. తరిగొండ వెంగమాంబ, హాథీరాంజీ లాంటి భక్తులను ఎన్నుకొని ఈ కలియుగములో కూడా సాధన చేస్తే భగవంతుడు లభించగలడనే సందేశమును ఇచ్చాడు. శ్రీమాన్ అనంతాళ్వార్ లాంటి మరికొందరు భక్తులతో ఆటలాడి ప్రస్తుతం స్వామివారు తిరుమల కొండపై స్వయంగా ఉన్నారనే నమ్మకాన్ని దృఢపరుస్తున్నారు. కాబట్టి మనం కూడా శ్రీవేంకటేశ్వరుని కొలిచి ధన్యులమవుదాము.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో ॥ సూర్యేందు భౌమ బుధ వాక్పతి కావ్యశౌరి
స్వర్భాను కేతు దివిషత్ పరిషత్ ప్రధానాః ।
త్వద్దాస దాస చరమావధి దాస దాసాః
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – వేంకటేశా! దేవతలలో ముఖ్యులగు సూర్యాది నవగ్రహములు నీ సేవకులకు సేవకులై చివరి హద్దులో నున్న దాసులకు కూడా దాసులై ఉన్నారు. వేంకటేశా! నీకు సుప్రభాతమగు గాక!


శ్లో ॥ మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే!
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ ।
త్వద్భృత్య భృత్య పరిచారిక భృత్య భృత్య
భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ! ॥

తాత్పర్యం – మధుకైటభులను సంహరించినవాడా! లోకనాథా! నా కోర్కెను తీర్చుము. నన్ను అనుగ్రహింపుము. నీ భృత్య భృత్య పరిచారిక భృత్య దాసునికి దాసునిగా తలంచుము. అట్లు నీ సేవకుల పరంపరలో ఒకనిగా నన్ను తలంచుటయే నా జన్మకు ఫలము అని వెల్లడించాడు. భగవంతునికి దాసులమై యుండుట కంటె భగవంతుని దాసులకు దాసులమై యుండుట కోరదగినది. అదే మన జన్మకు ఫలమని కులశేఖరాళ్వారు అభిప్రాయము. నవవిధ భక్తుల్లో దాస్యభక్తి ఒకటి. భగవంతుని భక్తులను సేవించుటయే, వారి అనుగ్రహమును పొందుటయే జీవితమునకు సాఫల్యమని సారాంశము. శ్రీరాముని కంటె హనుమంతుని పూజించే భక్తులు అధికముగా ఉన్నారు. హనుమంతుడు దాస్యభక్తికి పరమోదాహరణము.

– డా॥ కె.వి. రాఘవాచార్యులు



# ముక్తిమార్గము



## ముఖారి

ఆకటివేళల – నలపైన వేళలను
తేఁకువ హరినామమే – దిక్కు మఱి లేదు || పల్లవి ||

1. కొఱమాలియున్న వేళ – కులము చెడిన వేళ
చెఱవడి యొరులచేఁ – జిక్కిన వేళ,
ఒఱపైన హరినామ – మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన – మఱి లేదు తెఱఁగు ||ఆఁక ||

2. ఆపద వచ్చినవేళ – ఆఱడిఁ బడినవేళ
పాపపు వేళల – భయపడిన వేళ
ఓపినంత హరినామ – మొక్కటే గతిగాక
మాపు దాఁకాఁ బొరలిన – మఱిలేదు తెఱఁగు ||ఆఁక ||

3. సంకెళఁ బెట్టినవేళ – చంపఁ బిలిచినవేళ
అంకిలిగా నప్పుల వా – రాఁగినవేళ
వెంకటేశు నామమే – విడిపించ గతిగాక
మంకు బుద్ధిఁ బొరలిన – మఱి లేదు తెఱఁగు ||ఆఁక ||

భావము – ఆకలి గలిగినప్పుడు, శ్రమకు లోనైనప్పుడు, ధైర్యము చేకూర్చి రక్షించునది శ్రీహరి నామమొక్కటే. అది తప్ప మరొక దిక్కు లేదు.

తాను ఎందుకూ కొఱగాని దుస్థితి ఏర్పడినప్పుడు, కులము చెడినప్పుడు, ఇతరులచే చెఱలో బంధింపబడి కృశించునప్పుడు, ప్రకాశమానమైన (దృఢమైన) హరినామ మొక్కటే గతి. దానిని మరచినచో మఱొక గతి లేదు.

ఆపద గలిగినప్పుడు, నిందకు లోనైనప్పుడు, పాపము పైకొన్నప్పుడు, భయపడినప్పుడు చాలినంతగా స్మరింపబడిన హరినామ మొక్కటే గతి. దానిని విడిచి కడవరకు ప్రయత్నించినను ఆ దుర్దశల నుండి కాపాడుటకు మరొక మార్గము లేదు.

శత్రువులు సంకెళ్ళతో బంధించినప్పుడు, చంపుటకు పిలిచినప్పుడు, అప్పులవారు అడ్డగించి నిలదీసినప్పుడు విడిపించుటకు శ్రీవేంకటేశ్వరుని నామమొక్కటే ఉపాయము. దానిని వదలి మూర్ఖత్వముతో ఎంత ప్రయత్నించినను మరొకదారి లేనే లేదు.



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



# విశిష్టగుణ సంపన్నుడు హనుమంతుడు

: చిల్లర సీతారామారావు

పవిత్రమైన పుణ్యప్రదాయకమైన వైశాఖమాసము నందు అతులిత బలధాముడు, విశిష్టసర్వగుణ సంపన్నుడు హనుమంతుడు జన్మించాడు. వైశాఖమాస వైశిష్ట్యమును స్కాందపురాణము ఇలా పేర్కొన్నది.

శ్లో॥ "న మాధవ సమో మాసోన
కృతేన యుగం సమమ్
నచ వేదం సమం శాస్త్రం
న తీర్థం గంగాయా సమమ్"

వృక్షములలో కల్పవృక్షము వలె, ఆవులలో కామధేనువు వలె, సర్పములలో ఆదిశేషువు వలె, పక్షులలో గరుత్మంతుడి వలె, విద్యలలో వేదవిద్య వలె, మంత్రములలో ప్రణవము వలె, దేవతలలో విష్ణువు వలె, చాతుర్వర్ణములలో బ్రాహ్మణుల వలె, నదులలో గంగానది వలె, తేజములో భానుడి వలె, ధాతువులలో సువర్ణము వలె, రత్నములలో కౌస్తుభము వలె అత్యున్నతమైనదని ఎన్నో ఉపమానాలతో శ్లాఘించబడినది వైశాఖ మాసము.

శ్లో ॥ "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

సత్పురుషులను సంరక్షించుట కొరకు, దుర్మార్గులను నాశనము గావించుట కొరకును యుగ యుగములో అవతరిస్తాను అని విష్ణు భగవానుడు చెప్పియున్నాడు. త్రేతాయుగమున రాక్షసుల దాడి అధికమయింది. రావణుడు అను రాక్షసుడు లంకకు అధిపతి. అతడు దేవతలను సమూలముగా నాశనము చేయాలని శివుడి గురించి తపమాచరించి అమోఘమైన వరములను పొందాడు. ఆ వర గర్వబలము చేత దేవతలను, మహర్షులను బాధలు పెట్టసాగాడు. మహర్షుల యాగ కుండములను ధ్వంసము చేయసాగాడు. రావణాసురుడి వేధింపులు అధికము గావడంతో ఆ బాధల నుండి విముక్తులను గావించువాడు విష్ణుభగవానుడొక్కడే యని భావించి విష్ణుభగవానుడి దగ్గరకు వెళ్ళి ప్రార్థించారు. వారి ప్రార్థనలను మన్నించి దేవతలారా! మహర్షులారా! బాధపడకండి. నేను రామావతారము ధరించి రావణాసురుడిని సంహరించి మీ బాధలను తీరుస్తాను అని అభయమిచ్చి విష్ణువు వారిని పంపించివేస్తాడు. పిదప బ్రహ్మ దేవతలతో – విన్నారు గదా! భగవంతుడు రాముడిగా అవతరించబోతున్నాడు. ఆయన సహాయార్థము మీరంతా భల్లూకములుగా, వానరులుగా జన్మించండి అని పలికాడు. బ్రహ్మ ఆజ్ఞానుసారం దేవతలు భల్లూకములుగా, వానరులుగా జన్మించారు. శివుడు రామకార్యములో సహాయపడుదామని అంజనాదేవి, కేసరి దంపతుల తనయుడిగా, వాయుదేవుడి వర ప్రసాదముతో హనుమంతుడిగా అవతరించాడు.

శ్లో ॥ "దుష్టానాం శిక్షణార్థాయ శిష్టానాం రక్షణాయ చ
రామకార్యార్థ సిద్ధ్యర్థం జాతః శ్రీహనుమాన్ శివః"

దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి అవతరించిన శ్రీరాముడికి సేవ చేయు నిమిత్తము శివుడు హనుమంతుడిగా జన్మించాడు అని పైన పేర్కొనబడిన శ్లోకము ద్వారా తెలియుచున్నది.

హనుమంతుడు తన జన్మ వృత్తాంతమును సీతమ్మకు తెలియజేసినట్లు సుందరకాండ యందు ఉన్నది.

శ్లో ॥ "వైశాఖమాసి కృష్ణాయం దశమీ మందసంయుతా
పూర్వ ప్రోక్త పదాయుక్తా తథావైధృతి సంహితా
తస్యామ్ మధ్యాహ్నవేళాయామంజనా జనరంజనా
వాయు భక్తిరతా సాధ్వీజనయామాస వైసుతమ్"

వైశాఖమాసం కృష్ణపక్ష దశమి తిథి శనివారం నాడు పూర్వాభాద్ర నక్షత్రం ప్రథమ పాదంతో కౌండిన్యస గోత్రజుడై మధ్యాహ్నవేళ, కర్కాటక లగ్నములో తాను జన్మించినట్లు సీతమ్మతో స్వయముగా హనుమంతుడు చెప్పుకున్నాడు. హనుమంతుడు జన్మించిన రోజున హనుమజ్జయంతిగా భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

హనుమజ్జయంతి నాడు వేకువజామునే లేచి స్నానాదికములు పూర్తి చేసుకోవాలి. పూజకు కావల్సిన వస్తువులను సమకూర్చుకోవాలి. వాకిలిముందు గోమయంతో అలికి ముగ్గులు పెట్టాలి. గుమ్మాలకు తోరణాలు కట్టాలి. గడపలకు పసుపురాసి కుంకుమ బొట్లు పెట్టాలి. పూజామందిరంలో ఒక గద్దెను ఏర్పాటు చేసుకుని దానిమీద బియ్యమును పోయాలి. ఆ బియ్యముపైన ఒక కలశమునుంచాలి. కలశం చుట్టూ, కలశం లోపల తమలపాకులుంచాలి. కలశం మీద కొబ్బరికాయను ఉంచాలి. ఒక రవికగుడ్డను మడిచిపెట్టాలి. పసుపు, కుంకుమ, సిందూరములతో కలశమును అలంకరించాలి. కలశం వెనుక భాగమున హనుమంతుడి విగ్రహమును ప్రతిష్ఠించాలి. దశమినాడు శక్త్యానుసారం పంచామృతములతో హనుమంతుడి విగ్రహమును అభిషేకించాలి. మన్యు సూక్తమును చదువుతూ శుద్ధమైన జలముతో అభిషేకించాలి. పిదప విగ్రహమును శుభ్రముగా తుడవాలి. నువ్వులనూనెను విగ్రహమునకు రాసి సిందూరమును లేపనముగా రాయాలి. పిదప నొక పళ్ళెములో విగ్రహము నుంచి అష్టోత్తర శతనామములు చదువుతూ తమలపాకులతో హనుమంతుడిని పూజించాలి. బెల్లమును గాని, అరటిపండును గాని నైవేద్యముగా పెట్టాలి. కలశము నందు తోరముల నుంచాలి. తోరములకు ఎన్ని ముడులు వేస్తామో అన్ని సంవత్సరములు హనుమద్వ్రతమును జరుపుకోవాలి. హారతి, మంత్రపుష్పం అయిన తరువాత హనుమంతుడికి సంబంధించిన గాథలను వినాలి. అనంతరం హనుమంతుడికి ధూపమునిచ్చి గోధువరవ్వ పంచదారతో చేసిన ప్రసాదమును నివేదించాలి. బ్రహ్మచారులను పూజించాలి. అప్పాలు నైవేద్యము పెట్టి వాయనములు ఇవ్వాలి. బంధు మిత్రులతో కలిసి భోజనములు చేయాలి. రాత్రి సమయమునందు దీపం వెలిగించి భజన, కీర్తనలతో జాగరణ చేయాలి. భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతిని, హనుమద్వ్రతమును జరుపుకొనడం వలన సమస్త సుఖాలు ప్రాప్తిస్తాయి. లౌకిక సుఖాలు కావాలని అభిలషిస్తే మోక్షము ప్రాప్తించదు. మోక్షము కావాలనుకుంటే సుఖభోగాలు దూరమవుతాయి. కాని హనుమంతుడిని భక్తి శ్రద్ధలతో సేవించినవారికి మాత్రం భోగం, మోక్షం రెండూ అతి సులభంగా ప్రాప్తిస్తాయి అని శౌనక సంహితలో చెప్పబడింది.

హనుమంతుడి చిన్నతనములో అంజనాదేవి తనయుడిని గుహలోనుంచి ఫలములను తీసుకురావడానికి వెళ్ళింది. హనుమంతుడు గుహలో నుండి బయటికి వచ్చాడు. ఆకాశం వైపు చూచాడు. సూర్యుడి అరుణ బింబము కన్పించింది. ఆ అరుణ బింబమును ఫలముగా భావించాడు. దాన్ని తీసుకోవడానికి పైకి ఎగిరాడు. సూర్యుడిని గ్రహించడానికి పయనిస్తున్న రాహువు హనుమంతుడికి అడ్డముగా వచ్చాడు. హనుమంతుడు రాహువును ఒక తోపు తోశాడు. ఆ తోపుకి రాహువు వెళ్ళి ఇంద్రుడి దగ్గర పడ్డాడు. జరిగినదంతా వినిన ఇంద్రుడికి ఆగ్రహం కలిగింది. అతడు తన వజ్రాయుధమును హనుమంతుడి వైపు విసిరాడు. వజ్రాయుధము హనుమంతుడి ఎడమ దవడకు తగిలి మూర్ఛిల్లాడు. ఈ సంగతి వాయుదేవుడికి తెలిసి ఆగ్రహముతో వాయు ప్రసరణమును స్తంభింపచేశాడు. వాయువు స్తంభించడంతో లోకాలన్నీ విలవిలలాడినాయి. దేవతలందరూ వాయుదేవుని దగ్గరకు వచ్చారు. దేవతల తరపున బ్రహ్మ వాయుదేవుడితో — వాయుదేవా! నీ తనయుడి కొరకు బాధపడవలసిన అవసరము లేదు. మేమందరము నీ కుమారునకు అనన్య దుర్లభమైన వరములను ప్రసాదించెదము. నీవు ఆగ్రహమును వీడి వాయు ప్రసరణమును కొనసాగింపుము అని ప్రార్థించాడు. వాయుదేవుడు శాంతించి వాయు ప్రసరణమును కొనసాగించాడు. ఇంద్రుడు అంబుజ మాలికను ఇచ్చి వజ్రాయుధము వలన మరణము సంభవించదు అని వరమిచ్చాడు. సూర్యుడు తన తేజమున నూరవ భాగమునిచ్చి విద్యాభ్యాస కాలము రాగానే వాక్పటిమను ప్రసాదించు శాస్త్రమును నేర్పునట్లు వరమిచ్చాడు. వరుణుడు తన పాశము వలన నీటివలన పది లక్షల సంవత్సరముల వరకు మరణము నొందనట్లు వరమునిచ్చాడు. యముడు తన కాలదండము వలన మరణము నొందకుండా ఉండునట్లు వరమిచ్చాడు. విశ్వకర్మ తనచే నిర్మితమైన అస్త్ర శస్త్రాదుల వలన చావు లేకుండుటయే కాక దీర్ఘాయువు కలుగునని వరమును ప్రసాదించాడు. చిరాయువు, దుర్జయత్వము, కామచరత్వము, కామరూపము, శక్తి, అమిత బలము మున్నగు వరములను ప్రసాదించాడు బ్రహ్మ. వజ్రాయుధము హనుమకు తగలడము చేత ఆరోజునుండి హనుమంతుడు అను నామముతో వ్యవహరింపబడుతున్నాడు. ఇతడు ఆంజనేయుడు, కేసరినందనుడు, వాయునందనుడు, రుద్రకుమారుడు, కపిశ్రేష్ఠుడు, జానకీశోక వినాశకుడు, వజ్రాంగుడు, రామభక్తుడు, రామదూత మున్నగు నామములతో పిలువబడుతూ భక్తుల చేత ఆరాధింపబడుతున్నాడు.

ఋష్యమూక పర్వతం దగ్గరకు వచ్చిన రామ లక్ష్మణులను చూచి వారెవ్వరో కనుగొని రమ్మని సుగ్రీవుడు హనుమంతుడిని పంపిస్తాడు. హనుమంతుడు సన్యాసి వేషమును ధరించి రామ లక్ష్మణులను కలిసి సంభాషించసాగాడు. హనుమంతుడి సంభాషణలోని ప్రత్యేకత రాముడికి అర్థమైంది. విషయమును



నా దగ్గర ఏమియును లేదు. ప్రత్యుపకృతిగా కౌగిలింతను మాత్రం ఇవ్వగలను అని పలికి శ్రీరాముడు హనుమంతుడికి కౌగిలినిచ్చాడు. శ్రీరాముడి కౌగిలి హనుమంతుడికి దక్కడం పుణ్యవిశేషం.

పట్టాభిషేక సమయమున సీత హనుమంతుడికి ముత్యాల హారమును ఇచ్చింది. రామభక్తుడైన హనుమంతుడు ఆ ముత్యములలో రామనామ రుచి లభిస్తుందన్న ఆశతో హారములోని ఒక్కొక్క ముత్యమును తెంపి రుచి చూచి ఉమ్మివేయసాగాడు. సీత ఇదేమిపని అని ప్రశ్నించింది. హనుమంతుడు తల్లీ! ఈ ముత్యాలలో రామనామము గాని, రాముడు గాని దొరుకుతాయేమోనని చూచాను. ఫలితం లేకపోయింది. అందుకే ఇలా చేశాను అని బదులిచ్చాడు. ఈ ముత్యాలహారంలో లేని రాముడు నీలో ఉన్నాడా అని అడిగింది. వెంటనే హనుమంతుడు తన వక్షస్థలమును గోరులతో చీల్చి తన హృదయమున సీతారాములను చూపించాడు. ఇది హనుమంతుడి భక్తిభావనను స్పష్టపరుస్తున్నది.

ప్రతిపాదించునప్పుడు శబ్దార్థమును, ఆ అర్థమునకు తగిన తాత్పర్య నిర్ణయము భిన్నము లేకుండుట, ఉచ్చరించు ఉచ్చారణ యందు భావనిర్ణయము సుస్పష్టమై వినువారికి వ్యక్తమగుచుండుట, శబ్దోచ్చారణకు అనుగుణముగా అంగాభినయముండుట మున్నగునవి వక్తకు ఉండవలసిన ముఖ్య లక్షణములు. ఈ లక్షణములు వేద శాస్త్రాధ్యయనముల వలన ప్రాప్తించును. వ్యాకరణము చేత శబ్ద వ్యుత్పత్తి, తర్కముచే పదార్థ జ్ఞానము, మీమాంసచే వాక్యాన్వయ జ్ఞానము కలుగుతాయి. హనుమంతుడియందు ఇవన్నీ పరిపూర్ణములై యుండటాన్ని రాముడు గ్రహించాడు. అందువలన తాము సీతాన్వేషణ గావిస్తూ అక్కడికి వచ్చామని, దానికి సుగ్రీవుని సహాయము అవసరము అని తెలియజేశాడు. హనుమంతుడు రామలక్ష్మణులను సుగ్రీవుని దగ్గరకు తీసుకొనిపోయి అగ్నిసాక్షిగా వారిమధ్య స్నేహబంధమును నెలకొల్పాడు. రాముడు వాలిని వధించి సుగ్రీవునికి సహాయము చేయగా, సుగ్రీవుడు సీతాన్వేషణలో రాముడికి తోడ్పడ్డాడు.

జాంబవంతుడి ప్రేరణతో తన బలమును తెలుసుకున్న హనుమంతుడు సముద్రమును దాటి లంకకు చేరుకున్నాడు. సీతమ్మను కలుసుకున్నాడు. తిరిగి వచ్చి రాముడికి ఆమె కుశల వార్తను తెలియజేశాడు. శ్రీరాముడు ఆనందముతో హనుమంతుడితో ''హనుమా! సీత జాడ మాకు తెలిపి మాకు ఆనందమును కలిగించడమే కాకుండా ఆత్మహత్యా దోషముల నుండి రక్షించావు. ఇంతటి ఉపకారం చేసిన నీకు ఇవ్వడానికి

ఒకసారి శ్రీరాముడు రాజసభలో హనుమంతుడిని – ఏదైనా ఒక వరము కోరుకో. నీవు కోరిన వరమును ప్రసాదించడం నాకెంతో ఆనందాన్ని కలగజేస్తుంది అని పలికాడు. హనుమంతుడు – శ్రీరామా! మీరంటే నాకు ఎంతో ప్రీతి. మిక్కిలి భక్తి. నా మనస్సు మీయందు తప్ప మరియొక స్థలమునందు ప్రవేశింపదు. రామకథ భూలోకమున నుండువరకు, నా కంఠములో ప్రాణములు ఉండేటట్లు అనుగ్రహించండి అని శ్రీరాముడిని వేడుకున్నాడు. శ్రీరాముడు హనుమంతుడితో హనుమంతా! నీ అభీష్టము తప్పక నెరవేరగలదు. సమస్త లోకములందు నా చరిత్ర నుండువరకు నీవు జీవించి యుండగలవు అని పలికాడు. విశిష్ట గుణములను కలిగిన హనుమంతుడిని సర్వదా స్మరించుకుందాం. ఆరాధించుకుంటూ ముక్తిని పొందుదాము.

**శ్లో ॥ "యత్ర యత్ర రఘునాథ కీర్తనం**
**తత్ర త త్ర కృతమస్తకాంజలిమ్**
**బాష్పవారి పరిపూర్ణ లోచనం,**
**మారుతం నమత రాక్షసాంతకమ్"**

ఎక్కడ శ్రీరామ నామ సంకీర్తనము జరుగునో అక్కడ తలపై రెండు చేతులు చేర్చి అంజలి ఘటించి యుండువాడు, ఆనందాశ్రువులతో నిండిన కన్నులతో దర్శనము నిచ్చువాడు, రాక్షస సంహారకుడు వాయు పుత్రునకు ప్రణమామము.




14వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్ధేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**– గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**



దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 14 వ భాగపు లీలల ప్రచురణ. (డిసెంబర్–2004–ఫిబ్రవరి 2005)

ఈ భాగములో స్వామివారు నా సర్వదాస్తిని హరించెదనని, వ్యాపారము కూడ ఎక్కువ చేయకూడదని సూచనలిచ్చారు. అయినప్పటికీ చింతించక స్వామివారు చెప్పినట్లు మాత్రమే నడుచుకొమ్మన్నారు. కాని ఆ రోజుల్లో నేను దీనిని అర్థం చేసుకోలేదు. మరియు అద్భుతమైన కొంత జ్ఞానాన్ని కూడ ప్రసాదించారు.

## స్వామివారు చెప్పినట్లు నడుచుకొమ్మనుట

శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన దారిలోకి తెచ్చుకొనుటకు సామ దాన భేద దండోపాయాలను వాడేవాడు. అందులో భాగంగా నా శారీరక రుగ్మతలను కూడా వాడుకున్నాడు. అస్వస్థతకు గురిచేసి నా మనస్సు మారే విధంగా చేసేవాడు. ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. నాకు ఆగస్టు 1999 నుండి డయాబెటిక్ ఉంది. మంచి కంట్రోల్ లో ఉండేది. కాని 2004 సంవత్సరంలో జరిగే రెండవ జప సమర్పణ వరకు 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేయగలమో లేదో అనే చింతతో మరియు నా మియాపూర్ ఆస్తి గొడవల సమస్యతో టెన్షన్ పడి నా షుగర్ చాలా పెరిగింది. భయపడిపోయాను, మా డాక్టర్ చెప్పినట్లు మందుల డోసేజ్ పెంచినప్పటికీ తగ్గలేదు. చివరికి శ్రీవేంకటేశ్వరుని శరణు వేడాను. మీకు మించిన డాక్టర్ లేడు, నేను మీ భక్తుడను తగ్గించుమన్నాను. వెంటనే స్వామివారు ఈ క్రింది లీలను చూపారు.

**11-12-04 కల :** ఈ కలలో నేను నా డయాబెటిక్ డాక్టర్ వద్దకు భయపడుచు వెళ్ళాను. నాకు షుగర్ ఎక్కువున్నది తగ్గించమన్నాను. ఆయన నన్ను పరీక్షించారు. మామూలుగానే ఉన్నది, ఇబ్బంది లేదన్నారు. మరియు డాక్టర్ చెప్పినట్లు వింటే

ఏ సమస్య ఉండదు. మీ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే సమస్య ఉంటుందన్నారు. ఇంతే కల.

దీనర్థం ఆ సమయంలో నాకర్థం కాలేదు. నేను ఎంతో కష్టపడి నమో వేంకటేశాయ రథమును అనుకున్న సమయానికి సిద్ధం చేశాను. 2వ జప సమర్పణను కూడా స్వామివారు మెచ్చేవిధంగా చేశాను. ఏ లోపం చేయలేదనుకున్నాను. కాని గతంలో ఒక మాస పత్రికను స్థాపించుమనే స్వామి ఆజ్ఞను మరచిపోయానని గుర్తించలేదు. బహుశా దీనిని గుర్తు తెచ్చుటకు నాకు అనారోగ్యాన్ని కల్పించి ఈ లీలను చూపారు. ఇది పత్రిక విషయమై స్వామి చూపిన 4వ లీల. కాని దీని అర్థమును అప్పుడు నేను గుర్తించలేదు.

## జప పుస్తకములను ఉచితంగా పంచ నిర్ణయము

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కార్తీక ఏకాదశి తేది 15-11-2002 నుండి 7 కోట్ల జప సమర్పణ నిమిత్తమని జప పుస్తకములను ఉచితంగా పంచుట ప్రారంభించాము. మరియు తేది 08-02-2003 నాడు మొత్తం 16 సంవత్సరముల వరకు, ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమునకు సంబంధించి ప్రతి సంవత్సరం 70 వేల జప పుస్తకములను భక్తులకు పంచవలెనని నిర్ణయించాము. ప్రథమ పర్యాయంగా మొత్తం జప పుస్తకములను ఉచితంగా పంచాము. కాని రెండవ పర్యాయం నుండి మొత్తం 70 వేల జప పుస్తకాలలో 35 వేల జప పుస్తకాలను ఉచితంగా, మరో 35 వేల జప పుస్తకాలను ఒక్కొక్కటి రు.5/- చొప్పున అమ్మాలని నిర్ణయించాము. ఈవిధంగా డబ్బులు పెట్టేసరికి భక్తుల స్పందన తగ్గింది. చాలామంది మేము తరువాత డబ్బులు ఇచ్చేదమని పుస్తకాలు తీసుకెళ్ళేవారు. ఎలాగైనా ప్రతి సంవత్సరం 70 వేల జప పుస్తకాలు పంచాలి కాబట్టి డబ్బులు తరువాత ఇస్తామన్నా ఇచ్చేవాణ్ణి. భక్తులకు పుస్తకము ఇవ్వకుండా తిరిగి పంపుట బాధ కలిగేది. ఎలాగో 2వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగింది. 3వ పర్యాయంగా కూడా ఇదే పద్ధతిని అనుసరించాము. ఫలితంగా తేది 01-01-05 వరకు చాలా తక్కువ మొత్తంలో జప పుస్తకాలను పంచాము. మొత్తం 70 వేల పుస్తకాలను ఏవిధంగా పంచాలి? అనే సందేహం కలిగింది. మరోప్రక్క జప పుస్తకమునకు డబ్బులు తీసుకుంటే తృప్తి చెందేవాణ్ణి కాదు. కావున నా సంకల్పం నెరవేరుటకు మరియు అధిక తృప్తిని పొందుకు ఈరోజు నుండి మొత్తం సంకల్పం సిద్ధించేవరకు, అంటే 2018 వరకు ప్రతి సంవత్సరం మొత్తం జప పుస్తకాలను ఉచితంగా పంచుచు నా స్వామి సేవ చేయాలని, అధిక తృప్తిని పొందాలని నిర్ణయించుకున్నాను. కావలసిన శక్తిని ప్రసాదించమని స్వామివారిని తేది 01-01-2005 నాడు వేడుకున్నాను. స్వామివారు ఈవిధంగా కరుణించారు.

**02-01-05 కల :** ఈ రాత్రి ఒక చక్కటి కల కన్నాను. ఈ కలలో నేను ఒక భవిష్యవాణి చెప్పేవారి ఇంటికి వెళ్ళాను. ఈ ఇంటిలో ఇద్దరు మగవారు తెల్లరంగు చొక్కా, ధోవతి ధరించి ఉన్నారు. వారు హస్తసాముద్రికము చూచేవారట. నేను వెళ్ళగానే వారు నా గురించి చెప్పారు. ఇదీ – అదీ – ఏదో విషయములు చెప్పారు. ఇంతలో వారు కాషాయ వస్త్రములు ధరించిన వారివలె మారిపోయారు. ఈరోజు నాలో ఒక దైవ శక్తి ఆవహించిందని నాతో చెప్పారు. నీకు కొన్ని శక్తులు ఉంటవి. ఈరోజు ఉదయం నీలో ఆ శక్తులు ప్రవేశించాయి అని అన్నారు. మరియు చాలా నిష్ఠగా వీలైనంతవరకు బ్రహ్మచర్యం పాటించాలని చెప్పారు. కల చెదిరింది.

స్వామి సేవను అత్యంత నిష్ఠతో, నియమాలతో చేయమని సూచించారు.

## స్వామివారు నా ఇంటికి వచ్చి భోజనము చేస్తానని సూచించుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా జీవితంలో కొన్ని ఆణిముత్యాలను ప్రసాదించాడు. ఈ లీల కూడా ఒక ఆణిముత్యం. అత్యంత విశ్లేషణాత్మకంగా ప్రసాదించాడు. ఈ లీలలో స్వామివారి సంపూర్ణ లక్ష్యం ఇమిడి ఉంది. ఏ లక్ష్యం కోసం నాకు ఈ సేవాభాగ్యాన్ని ప్రసాదించి యోగ్యత సాధించుకొమ్మన్నారో, ఆ ఫలం సిద్ధించునట్లు చూపెట్టారు. కాని ఆ రోజుల్లో నేను దీనిని అర్థం చేసుకోలేదు. ఆ లీల ఈ విధంగా ఉంది.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా ప్రార్థనపైన హబ్సిగూడ కాకతీయనగర్ లో మాకొక ఇంటిస్థలమును ప్రసాదించారు. ఆ ఇల్లు కన్ స్ట్రక్షన్ జరుగుచున్నది, మానసికంగా ఆ ఇల్లు శ్రీవేంకటేశ్వరునిదని, నేను ఒక అద్దెవానిగా ఆ ఇంటిలో నివసించుదుననే భావం నా మనస్సులో బలంగా ఉన్నది. మరియు ఈ ఇంటి గృహప్రవేశానికి తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆహ్వానించాలని, ఆయనకు ఆ ఇంటిలో పాదాలు కడిగి, పాదపూజ చేసి భోజనం పెట్టాలనే కోరిక బలంగా ఏర్పడ్డది. మా ఇంటి గృహ ప్రవేశానికి (స్వప్న దర్శనం కాకుండా) ప్రత్యక్షంగ రమ్మని, మా ఆతిథ్యాన్ని స్వీకరించమని ప్రార్థించాను. స్వామివారు ఈవిధంగా అనుగ్రహించారు.

**06-01-05 కల:** ఈ మధ్యన చాలా కలలు వచ్చాయి. కాని నేను ఆస్తి గొడవలలో చిక్కుకున్నందున వీటిని మరచాను. ఈ నాడు రెండు కలలను చూచాను. మొదటి దానిలో నేను కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారిని దర్శించాను. మరో యువకుడైన నూతన స్వామిని కూడా దర్శించాను. వీరు ఇప్పుడే సన్యాసం పుచ్చుకున్నారట. (ఆ సమయాన శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు జైలులో ఉన్నారు.) ఈ కల అర్థం తెలియదు.

**రెండవ కల:** ఈ లీలలో అనంత శ్రీ విభూషిత శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు, వారి




శిష్య బృందంతో తెలిసిన వారింటిలో బస చేశారట. ఆ ఇంటి యజమాని నాకు సన్నిహితుడు. అయితే మా ఇంటి గృహప్రవేశ సందర్భంలో భోజనానికి పిలవాలని, శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారిని ఆహ్వానించుటకు స్వామివారి దగ్గరకు వెళ్ళుచున్నాను. జీయర్ స్వామి వద్దకు వెళ్ళునప్పుడు కొన్ని నియమాలను పాటించవలసి ఉంటుంది. ఒక పూలమాల వేయాలి, ప్రణామాలు చేయాలి, చాలా మర్యాదపూర్వకంగా ఉండాలని చెప్పుచు పోవుచున్నాను. అప్పుడు ఉదయం 10.30 గంటలు అవుచున్నది. స్వామివారిని భోజనానికని ఏ టైములో పిలవాలి, పిలుచుటకు ఎప్పుడు రావాలి అనే ప్రశ్నలు అడిగి తెలుసుకుందామనుకున్నాను. నేను స్వామివద్దకు పోయినప్పుడు వారు పూజలో ఉన్నారు. వారు ముందు ఉన్న హాలులో ఒకప్రక్క పూజ చేస్తున్నారు. నేను వెళ్ళగానే నన్ను వారు చూచారు. నేను కూడా వారి ముఖమును చూచాను. తరువాత ఆయన నాకు కనబడకుండా పూజ కొనసాగిస్తున్నారు. మిగిలిన శిష్యులు మాత్రం వారి వారి అభ్యాసములను చేసుకొంటున్నారు. వీరందరు చక్కని తిరునామం ధరించి ఉన్నారు. శిష్యులు నన్ను చూచి స్వామివారికి నేను వచ్చానని చెప్పారు. ఇంతలో స్వామివారు (శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ స్వామివారి గొంతుతో) ‘‘ఏమి! ఇంత తొందరగా భోజనానికి వచ్చెదమా? పూజ జరుగుచున్నదా?’’ అని అన్నారు. ఆ మాటలు విని, లేదు లేదు స్వామీ, మిమ్మల్ని ఎప్పుడు పిలుచుటకు రావాలో తెలుసుకుందామని వచ్చానన్నాను. స్వామివారు వస్తున్నారు కాబట్టి స్వామివారి ఆంతరంగికుడొకరు ఏర్పాట్లు చూచుటకు నాతో పాటు మా ఇంటికి వస్తానన్నారు. మేము మా ఇంటికి వెళ్ళాము. చిత్రమేమిటంటే ఇప్పుడు ఆ ఇల్లు హైదరాబాద్ లో నేను కట్టుచున్న ఇల్లు కాదు, అప్పనపల్లి గ్రామములో నేను జన్మించిన మా చిన్నమామ ఇల్లు. మా ఊరు నుండి మరో 7 కిలోమీటర్ల దూరములో దుబ్బాక దగ్గర ఉన్నది. ఆ ఇంట్లోకి నేను మరియు ఆంతరంగికుడు కలిసి నేరుగా వంటింట్లోకి వెళ్ళాము. అక్కడ భోజనాలు చేసే స్థలములో లక్ష్మీదేవి మరియు శ్రీవేంకటేశ్వరుని పెద్దసైజు ఫొటోలు (18" X 30" సైజు కలవి) పెట్టబడి ఉన్నవి. ఆ ఫొటోల ముందు పీటలు ఏర్పాటు చేయబడ్డవి. ఒక్కొక్క ఫొటో స్థలములో ఒక్కొక్కరు కూర్చుండి భుజిస్తారట. దీనర్థం లక్ష్మీ ఫొటో ముందు, లక్ష్మీ అమ్మవారు, శ్రీవేంకటేశ్వరుని ఫొటోముందు శ్రీవేంకటేశ్వరుడు కూర్చుండునని ఏర్పాట్లు చేయబడ్డవి. ఇలా మొత్తం ఏర్పాట్లు చూచుకున్నాము. సమయమైంది. ఇంతలో ఒక వేరే కొత్త జీయర్ స్వామివారు భోజనానికని వచ్చారు. ఈయన శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారితో సమానమైన వారట. వారికి బదులు వీరు వచ్చారు. వీరిని చూడగానే మేము వంటగది నుండి బయటకు భవంతి లోనికి వచ్చి వారి మెడలో పూలమాల వేశాము. ఆ పూలమాలలు మా ఆఫీసులో తయారు చేసినవేనట. తరువాత వారిని వంటశాలకు ఆహ్వానించి కూర్చోమన్నాము. వారు నేరుగా వంటశాలలో ఉన్న చేదబావి వద్దకు వెళ్ళారు. కాళ్ళు చేతులు కడుక్కున్నారు. తరువాత వారు ముందు లక్ష్మీదేవి స్థానములో కూర్చోబోయారు. కాని తిరిగి శ్రీవేంకటేశ్వరుని స్థానములో కూర్చున్నారు. మేము ఆనందముగా భోజనం వడ్డించుటకు సిద్ధమవుచున్నాము. కలలో ఇది మొదటి సన్నివేశం.

తరువాత కలలో సీను మారిపోయింది. నేను మరికొందరితో పాటు ఒక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే ఫంక్షన్ హాల్ లాంటి దానిలో కూర్చున్నాము. పండితులు మాట్లాడుచున్నారు. తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు చేయుటకు పిల్లలు సిద్ధంగా ఉన్నారు. కొంతమంది బ్రాహ్మణ పిల్లలు కూడా ఉన్నారు. కల చెదిరింది.

ఆ సమయాన నేను దీనిని ఇలా అర్థం చేసుకున్నాను. నేను నా స్వామివారిని భోజనానికి పిలిచాను. కాని వారు రాకుండా వారి స్థానములో శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారిని పంపుచున్నారని భావించాను. కాని నిజమైన అర్థం ఏదంటే – నేను నా ఊరిలో హరినామ క్షేత్రం ప్రక్కన ఇల్లు కట్టినపుడు తప్పక వచ్చెదనని చెప్పారు. ఇది స్వామి సంకల్పం నెరవేరునని సూచించే లీల. అద్భుతమైన లీల. నా జీవిత ధ్యేయం నెరవేరబోవుచున్నదని తెలిపే లీల. మరియు ఈ గృహ ప్రవేశంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా జరుగునని సూచించారు.

ఈ కలను ఈ క్రింది విధంగా మరింత విశ్లేషించాను. నేను శ్రీవేంకటేశ్వరుడే మూలమని నమ్మి ఏకమూర్తి ఆరాధన చేసేవాడిని. మరియు ఈ సృష్టిలోని ప్రతి దేవీ దేవతలు ఆయన అంశలేనని బలంగా నమ్మేవాడిని. ఒక్క శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తే సమస్త దేవీ దేవతలను స్మరించిన పుణ్యం వస్తుందని బలంగా విశ్వసించేవాడిని. అందుకే ఏకమూర్తి ఆరాధన చేసేవాడిని. కాని కొందరు ఈ భావనను వ్యతిరేకిస్తారు. లక్ష్మీదేవితో కూడిన శ్రీమన్నారాయణుడిని ఆరాధిస్తేనే ఫలమని లేకుంటే లేదని వారి వాదన. ఈ వాదనతో నేను ఏకీభవించను. శ్రీమన్నారాయణుడు లేదా శ్రీవేంకటేశ్వరుడు పూర్ణుడు, సర్వశక్తిమంతుడు. లీలా విలాసము కొరకు తన అంశను వివిధ రూపాలుగా రూపాంతరము చెందాడే కాని, మూలంలో ఒకటే

రూపము. అదే శ్రీమన్నారాయణుడు. ఒకవేళ ఈ సృష్టిలో రెండు శక్తులున్నవనుకుంటే 'ఏకో నారాయణ' అనే వేదవాక్కు అర్థం లేనిదవుతుందని నా భావన. మనిషికి భావన ముఖ్యం తప్ప ఎన్ని విగ్రహాలను పెట్టుకుని పూజిస్తున్నామనేది ముఖ్యం కాదు. ముఖ్యంగా సాధకుడికి కేవలం ఏకమూర్తి భావనే అత్యంత ముఖ్యమైనది. ఆ మూర్తి సర్వశక్తివంతమైనదని, ఈ సృష్టిలోని సమస్త రూపాలు ఆ రూపమునుండే ఉద్భవించాయనే బలమైన జ్ఞానమును కలిగి సాధన చేయుట అత్యవసరము.

ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు కూడా నా ఏకమూర్తి భావాన్ని దృఢపరిచాడు. నేను అనుసరించు విధానము సరైనదని తెలిపాడు. ఈ కలలో నేను ఒక్కరినే ఆహ్వానించినప్పటికీ ఏర్పాట్లు మాత్రం శ్రీమహాలక్ష్మి మరియు శ్రీవేంకటేశ్వరుడు ఇద్దరికీ చేశాను. స్వామివారు కూడా ఒక్కరే వచ్చి, ముందు శ్రీమహాలక్ష్మికి కేటాయించిన స్థలములో కూర్చోబోయారు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరునికి కేటాయించిన స్థలములో కూర్చున్నారు. దీనర్థం : పూర్ణుడైన శ్రీవేంకటేశ్వరుడు, శ్రీమహాలక్ష్మితో కూడిన శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వచ్చునని, మా ఆతిథ్యమును స్వీకరించునని భావం.

ఈ భాగంలోని ఒక లీలలో శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా పూర్ణుడనని, సమస్త శక్తులకు మూలమని స్పష్టంగా తెలిపాడు.

ఇంతవరకు నేను వ్రాసిన ఆరు పుస్తకాలలో మొదటి అనుభూతుల పుస్తకము పూర్తైంది. మొత్తం 105 స్వప్న అనుభూతులతో పాటు ఎన్నో హృదయాంతర అనుభూతులను తెలిపాను. ఇప్పటినుండి రెండవ పుస్తకము లోనివి తెలుపుతున్నాను. ఈ పుస్తకము కూడా నీటిలో నానిపోయింది. కొన్ని చదువుటకు సాధ్యపడలేదు. చదువదగినవి అర్థం చేసుకున్నంతవరకు తెలుపుచున్నాను.

## మా తండ్రి అసహ్యించుకొనుట



శ్రీవేంకటేశ్వరుడు నన్ను మార్చుటకు అన్ని మార్గాలను ఉపయోగించాడు. చివరికి 1990లో చనిపోయిన మా తండ్రి గారిని కూడా వాడుకున్నాడు. నా మనస్సు చింతగా ఉన్నప్పుడు, లేదా మా తండ్రిగారిని చూడాలనే కోరిక కలిగినప్పుడు స్వామివారిని ప్రార్థించగానే మా తండ్రిని చూపెట్టేవాడు. ప్రతిసారి మా తండ్రి చనిపోవుటకు 20 సంవత్సరాల ముందటి రూపముతో చూపెట్టేవారు. ఇలా ఒకసారి జనవరి 2005 లో కూడా ప్రార్థించాను. స్వామివారు మా తండ్రిని నా వద్దకు పంపారు. ఇక్కడ మరో ముఖ్యవిషయం తెలుపుచున్నాను. నా మనస్సులో స్వామివారి పట్ల భావాన్ని అనుసరించి మా తండ్రి ప్రవర్తన ఉంటుండేది. మొదట్లో తెలిసేది కాదు. కాని 2020 సంవత్సరంలో స్వామి ఆజ్ఞతో నా పూర్తి అనుభూతులను చదివినప్పుడు అర్థం చేసుకున్నాను. ఇప్పుడు కూడా మా తండ్రికి నాపై కోపమున్నట్లు ఈ క్రింది విధంగా ప్రవర్తించాడు.

**జనవరి 05 కల :** ఈ లీల నానిపోయి సరిగా కనిపించుట లేదు. కాని భావం ఈవిధంగా ఉంది. మా తండ్రిని చూచి చాలా రోజులైంది కాబట్టి ప్రార్థించాను. నన్ను చూచుటకు మా తండ్రిగారు తెల్ల వస్త్రములు ధరించి చనిపోవుటకు 20 సంవత్సరముల ముందటి రూపముతో వచ్చారు. కాని ఈయన దూరమునుండి నన్ను ఓరకంట చూచుచు, బెదురుచున్నట్లు ప్రక్కకు ప్రక్కకు నడుచుకుంటూ వెళ్ళిపోయారు. ఇంతే కల. మా తండ్రి ఏదో బాధతో ఉన్నారు. నా ముఖమును చూచుటకు ఇష్టపడలేదు అనే విధంగా ఉంది. మా తండ్రి ఆ సమయాన ఎందుకు అలా చింతతో, నాపై కోపంతో ఉన్నాడో అర్థం చేసుకోలేదు. నన్ను చూచుటకు వచ్చినవాడు ఎందుకు ప్రక్క ప్రక్కకు పోవుచున్నాడనుకుని ఊరుకున్నాను. కాని దీని నిజమైన అర్థం. ఆ సమయాన 1) నేను నా ఆస్తి గొడవల విషయమై స్వామివారు రక్షించుట లేదని స్వామివారిపై కోపముతో ఉన్నాను. 2) స్వామివారు ఒక మాస పత్రికను ప్రారంభించమని చెప్పినప్పటికీ, ప్రారంభించనందుకు కూడా మా తండ్రి గారికి నాపై కోపమొచ్చింది. అందుకే కోపముతో ఉన్నారు.

## శ్రీవేంకటేశ్వరుడు మూలంలో శ్రీమన్నారాయణుడని చెప్పుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఎప్పుడు ఏ లీల ప్రసరించుదురో ఆయనకాయనే సాటి. కాని ఏమి చెప్పదలచుకున్నాడో ఆ రకమైన భావాలు ఆ సమయాన నాకు కలిగి నేను ఆ విధంగా ప్రార్థించేలా చేసేవారు. సాధారణంగా ఆనాటి నా పరిస్థితులు ఆ భావాలకు అనుకూలంగా ఉంటుండేవి. కొన్ని ద్వంద్వార్థాలను ఉపయోగించి హితబోధ చేసేవారు. మరికొన్ని ఆయన అనుగ్రహించదలచి చేసేవారు.

నాకు గురువు లేదు, తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ప్రభావము వలననే నేను ఆధ్యాత్మిక రంగములోనికి ప్రవేశించాను. నాకు గురువు, దైవం, యజమాని ఆయనే. నిజానికి నేను శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రమే సృష్టికి మూలమని భావించేవాడిని. శ్రీరాముడికి, శ్రీకృష్ణుడికి, లక్ష్మీదేవికి, చివరికి శ్రీమన్నారాయణునికి సహితము ఈయనే మూలం అని భావించేవాడిని. చాలామంది శ్రీమన్నారాయణుడే ఈ సృష్టికి మూలమని భావిస్తారు. కాని నేను మాత్రము దీనిని నమ్మేవాడిని కాదు. అంతటి దృఢ విశ్వాసం నా శ్రీవేంకటేశ్వరునిలో ఉండేది. ఈనాడు ఈ కలలో శ్రీవేంకటేశ్వరుడు తాను మూలంలో

ఎవర్ననే విషయాన్ని తెలిపారు. తాను శ్రీమన్నారాయణుడనని, బ్రహ్మ మొదలగు వారికి జన్మనిచ్చి, వారికి రోజువారి శక్తిని తానే అందించుచున్నాననే జ్ఞానాన్ని ప్రసాదించారు. ప్రస్తుతం శ్రీవేంకటేశ్వరుడనే తొడుగు ధరించి ఉన్నానని కూడా చెప్పాడు. ఆ లీల ఈవిధంగా ఉంది.

నేను తేది 05-07-2002, నా మొదటి పుట్టిన రోజు పండుగ నుండి స్వామివారికి ప్రతి శుక్రవారము మా ఇంటిలో అభిషేకము చేస్తున్నాను. ఒక సందర్భములో నేనే శివుడిని, నీవు పూజించు అని స్వయముగా స్వామివారే చెప్పారు కాబట్టి గత కొన్నిరోజుల నుండి శ్రీవేంకటేశ్వరునికి అభిషేకించిన తరువాత శివుడికి కూడా అభిషేకించుటను అలవాటు చేసుకున్నాను. ఇలా ప్రతి శుక్రవారం మరియు సోమవారం ఈ అభిషేకక్రియ జరుగుచున్నది. ఈ అభిషేకించు సమయాన నేను స్వయంగా నా స్వామివారిని ముట్టుకుని అభిషేకించుచునట్లు అనుభూతి చెందేవాణ్ణి. మహదానందాన్ని అనుభవించేవాణ్ణి. చాలాసార్లు నా శరీరం రోమాంచితమై ఆనందబాష్పాలు రాల్చిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. ఇంతటి ఆనందాన్నిస్తుంది కాబట్టి ఈ అభిషేక క్రియను ఎట్టి పరిస్థితులలో వదులుకునేవాడిని కాదు. నీరు, పాలు, తేనె, గంధము మొదలగు వాటితో స్వామివారిని నా తనివి తీర అభిషేకించేది. ఆ తరువాత మంచి పుష్పాలు సమర్పించి నమస్కరించేవాడిని, తేనె నైవేద్యం పెట్టేవాడిని.

మా తండ్రిగారు కీ.శే. పుల్లగూర్ల వెంకటరెడ్డి తేది 22-12-1990, పుష్యమాసము శుద్ధ పంచమి నాడు చనిపోయారు. ఆయనకు ఆ తెలుగు తిథి ప్రకారం ప్రతి సంవత్సరం శ్రాద్ధము ఇవ్వడము, అది కూడా మా సొంత గ్రామము చిన్నగుండవెల్లిలో ఇవ్వడము అలవాటు చేసుకున్నాను. ఈ సంవత్సరం ఈ తిథి 14-01-05 శుక్రవారం వచ్చింది. కావున నేను ఒకరోజు ముందు 13-01-05 నాడు మా తండ్రి సంవత్సరీకం గురించి చిన్నగుండవెల్లి వెళ్ళాను. అయితే మా తండ్రి గారి తిథి శుక్రవారము కావున నేను ఆ రోజు మా ఊరిలో ఉండడం జరుగును. అక్కడ సరైన వసతులు లేని కారణంగా స్వామివారిని అభిషేకించుట వీలుపడదు. కాబట్టి 14-01-05 నాడు అభిషేకము చేయలేదు. కాని ఆ స్వామిని మరీ మరీ వేడుకున్నాను. ''ప్రభూ పరిస్థితుల ప్రభావము వలన నేను మీకు అభిషేకమును చేయలేకపోయాను, ఆ ఆనందమును కూడా పొందలేకపోయాను. కావున నన్ను క్షమించమని ప్రార్థించాను. మరియు మీరు క్షమించినట్లైతే, నాకు ఆనందమును ఇవ్వాలనుకుంటే వచ్చే 7 రోజులలో నా కలలో, మీ తొడుగులను తీసి అభిషేకించుచున్నట్లు కలను ప్రసాదించి ఆనందించే భాగ్యమును ప్రసాదించుమని వేడుకున్నాను. స్వామివారి తొడుగులు తీసిన తరువాత ఉండే రూపము నాకు ఎంతో ఆనందాన్నిస్తుంది కాబట్టి అలా ప్రార్థించాను.

నా ప్రభు ఈ ప్రార్థనను పూసగుచ్చినట్లు విన్నాడు. మరియు నాపై గల దయతో నాకు తేది 21-01-2005 నాటి కలలో తన అభిషేకమును మరియు ద్వంద్వార్థాన్ని ఉపయోగించి కొంత జ్ఞానాన్ని ప్రసాదించాడు.

అప్పుడు మా ఆఫీసు వి.ఎస్.టి రోడ్డు విద్యానగర్ లో ఉండేది. ఆర్టీసి క్రాస్ రోడ్డు వద్ద శ్రీ శృంగేరి శంకరమఠం వారి శ్రీ పంచముఖ హనుమాన్ ఆలయం ఒకటుంది. అందులో 2-3 సంవత్సరాల క్రితం శ్రీవేంకటేశ్వరస్వామి వారిని కూడా ప్రతిష్ఠించారు. అందుబాటులో ఉంది కావున చాలాసార్లు ఈ ఆలయానికి వెళ్ళేవాడిని. ఆలయ పూజారి శ్రీమాన్ గోపాల కృష్ణమాచార్యులతో మంచి పరిచయమేర్పడ్డది.

**21-01-05 కల :** నేను ఏదో పనిపై హైదరాబాదులోని ఇందిరాపార్కు నుండి ఆర్టీసి క్రాస్ రోడ్డుకు వస్తున్నాను. దారిలో శ్రీ శృంగేరి శంకరమంఠం వారి శ్రీ పంచముఖ హనుమాన్ ఆలయం కనబడ్డది. ఆరోజు ఏదో ఒక పవిత్రమైన రోజు కావటం వలన ఆలయానికి చక్కని అలంకరణ చేశారు. పూలదండలు, మామిడి తోరణాలు, అరటి చెట్లు కట్టారు. వీటిని చూచాను. మరియు ఈరోజు చాలా మంచిరోజు స్వామివారిని దర్శించుకోవాలని నిర్ణయించుకొని ఆలయం లోనికి వెళ్ళాను. నిజానికి ఆలయ ముఖద్వారం నుండి లోనికి వెళ్ళగానే శ్రీవేంకటేశ్వరుని మందిరం, అందులో నాలుగు అడుగుల ఎత్తుతో స్వామివారు ఎదురుగా కనిపిస్తారు. కాని ఇప్పుడు ఈ కలలోని స్వామివారు ఈ ఆలయం లోని స్వామివారు కాదు. నేను సాక్షాత్ తిరుమలలోని స్వామివారినే చూచాను. అత్యంత గంభీరంగా, ఆరున్నర అడుగుల ఎత్తుతో ఉన్నారు. మంచి వస్త్రాలతో, తెల్లని ముత్యాలతో, రకరకాల ఆభరణాలతో అలంకరించబడి ఉన్నారు. శరీరం మొత్తం అలంకరణనే, కేవలం ముఖము, చెంపలు మాత్రమే కనబడుచున్నవి. ఈ స్వామివారిని చూడగానే ఒక్కసారి తన్మయత్వం చెందాను. రెండు చేతులతో నమస్కరించాను. స్వామివారి ఎదురుగా ఈ ఆలయ పూజారి శ్రీ గోపాలకృష్ణమాచార్యులు గారే ఉన్నారు. వారు నన్ను చిరునవ్వుతో ఆహ్వానించారు. మరో విషయమేమిటంటే లోపల స్వామివారు ఉన్నగది కూడా ఈ ఆలయంది కాదు. స్వామివారి గర్భాలయమునకు ఉన్న చౌకట్, గడప (కులశేఖర పడి) మాత్రము తిరుమల లోనిదే! లోన గర్భగుడి మాత్రము వేరేది. చాల పెద్దగ ఉంది. ఈ గర్భగుడి లోనికి పూజారులు ప్రవేశించుటకు వీలుగా లోనుండి మరో ద్వారము ఉన్నది. ఇంతలో కల దృశ్యము మారింది. ఈ పూజారి గారు అభిషేక నిమిత్తమని స్వామినుండి ముత్యాల హారాలను, బంగారు నగలను, వస్త్రాలను తీసి ప్రక్కన పెట్టారు. ఇంతలో ఒక చిత్రం జరిగింది. చివరికి ఈ పూజారిగారు స్వామి నుండి పై తొడుగును తీసి ప్రక్కన పెట్టారు. ఈ తొడుగు శ్రీవేంకటేశ్వరుని ఆకారంతో తయారు చేసిన గట్టి ప్లాస్టిక్ లాగా ఉన్నది. ఒక రకంగా తన రెండు చేతులతో మొత్తం ఈ






శ్రీవేంకటేశ్వరుణ్ణే తీసి ప్రక్కన పెట్టారు. ఈ తొడుగు దాదాపు ఆరున్నర అడుగుల ఎత్తు ఉంది. ఈ తొడుగు క్రింద కేవల రెండు నుండి రెండున్నర అడుగుల ఎత్తుగల మూర్తి కనబడ్డాడు. నిజానికి ఈయనే ఒరిజినల్ మూర్తి. ఆయన కొంచెము వెనుకకు వంగి ఏటవాలుగా ఉన్నారు. శంఖు చక్రాలు ధరించి ఉన్నాడు. ఆయన నాభినుండి నాలుగించుల వరకు తామర కాడ బయటికి వచ్చి ఉన్నది. దీని నాలుగించుల తర్వాత భాగము తొడుగు ధరించుటకు వీలుగా కత్తిరించినట్లుగా ఉన్నది. ఈ తామర కాడ మధ్యలో చిన్న రంధ్రము కూడా ఉన్నది. ఈ లోని మూర్తి మరియు పైనుండి తీసిన ప్లాస్టిక్ కవర్ రెండూ అత్యంత నల్లని రంగులో ఉన్నాయి. వెంటనే నాకు ఒక హృదయాంతర భావం కలిగింది. ‘‘నేను మూలంలో శ్రీమన్నారాయణుడిని, కాని ప్రస్తుతం శ్రీవేంకటేశ్వరుడననే తొడుగును ధరించి ఉన్నాను. నాభినుండి వెలువడిన తామర కాడ బ్రహ్మాది దేవతలకు మూలం. ఈ కాడకు కల రంధ్రం నుండి బ్రహ్మాది దేవతలకు కావలసిన రోజువారీ శక్తిని అందించుదును’’ అనే భావం కలిగింది.

ఇంతలో స్వామివారు ఉండే గర్భగుడిలోని ప్రత్యేక ద్వారము గుండా 5-6 మంది బ్రాహ్మణులు లోనికి ప్రవేశించారు. స్వామి అభిషేకానికి కావలసిన సామానులను వెండి పళ్ళెరములలో పెట్టుకుని వచ్చారు. వీరు పూలు, పెరుగు, తేనె, గంధము, జలము, చక్కెర ఇంకా కొన్ని వస్తువులు తెచ్చారు. ఇంతలో ఈ అభిషేకమును చూచుటకని వచ్చిన భక్తులు ఎక్కువైనారు. ఒకరి మీద ఒకరు పడుచూ చూడసాగారు. చివరికి స్వామివారికి అభిషేకము చేశారట. నేను సరిగా చూడలేదు. ఇప్పుడు మరో చిత్రము జరిగింది. స్వామివారి స్థానములో మూడడుగుల వ్యాసము కలిగి రెండడగుల ఎత్తు కలిగిన నల్లని శివలింగము ప్రత్యక్షమైంది. దీనిని కూడా జలము, తేనె, పెరుగు, చక్కెరతో అభిషేకించారు. భక్తులు శివలింగాన్ని ముట్టుకున్నారు. నేను వద్దన్నాను. కాని వారు ఏమీ కాదన్నారు. అప్పుడు నేను తిరుపతిలో ముట్టుకోనివ్వరన్నాను. నీరు, పాలు, తేనె, గంధం చివరికి చక్కెర వేసి చేతులతో రాస్తూ అభిషేకించారు. నేను శివుడి అభిషేకానికి చక్కెరను మొదటిసారి చూచి ఆశ్చర్యపోయాను. శ్రీవేంకటేశ్వరునికి అభిషేకం చేసింది ఆలయం లోపల నుండి ప్రత్యేకంగా వచ్చిన బ్రాహ్మణులు. శివుడికి అభిషేకం చేసింది మాత్రం భక్తులు మరియు బ్రాహ్మణులు కలిసి చేశారు. నేను చూస్తూ ఉండిపోయాను. కల చెదిరింది.

ఈ విధంగా స్వామివారు, శ్రీవేంకటేశ్వరునికి మరియు ఆయన మరో రూపమైన శివునికి నేను కోరినట్లు అభిషేకమును చూపెట్టి నన్ను ఆనందపరచారు. ముఖ్యంగా ఈ లీలలో నాకు జ్ఞానోదయము చేశారు. తాను శ్రీవేంకటేశ్వరుడనే తొడుగును తీసివేయగ, శ్రీమన్నారాయణుడని, ఆయన నాభినుండి బ్రహ్మ ఉద్భవించాడని మరియు ఆ రంధ్రం నుండి ప్రతిరోజు వారికి జీవించుటకు శక్తిని ఇతడే ఇచ్చుచున్నాడనే అర్థం నా మనస్సులో కలిగించారు. అంటే శ్రీవేంకటేశ్వరుడు మూలంలో శ్రీమన్నారాయణుడని అర్థం. ఇంతటి జ్ఞానాన్ని స్వామివారు కలిగించినప్పటికి, శ్రీవేంకటేశ్వరుడే మూలమనే నా అభిప్రాయమును మార్చుకోలేదు. ఇతర రూపాలలో నేను ఆనందం పొందలేను. స్వామివారిని ప్రార్థించి నేను ఇదే భావంతో ప్రార్థిస్తానని చెప్పాను.

ఈ లీలను కూడా ఈ విధంగా విశ్లేషించాను. శ్రీవేంకటేశ్వరుడు మూలములో పూర్ణుడైన, సమస్త శక్తులకు మూలమైన శ్రీమన్నారాయణుడు. ఈ సృష్టిలో, శ్రీమహాలక్ష్మితో

కలిపి సమస్త దేవీ దేవతలు ఆయన అంశనుండే పుట్టారు. కాబట్టి పూర్ణుడైన ఒక్క శ్రీమన్నారాయణుడిని స్మరిస్తే సమస్త రూపాలను స్మరించిన పుణ్యం వస్తుంది. బహురూప ఆరాధన అవసరము లేదు. ఇది సాధకునికి ఎంతో లాభిస్తుంది. పూర్వం ధృవుడు, మార్కండేయుడు, ఆంజనేయుడు, ప్రహ్లాదుడు, పాండవులు, హాథీరాం బావాజీ, తరిగొండ వేంగమాంబ ఏకరూపాన్ని ఆరాధించి విజయం సాధించిన భక్తులు.

తిరుమలలో భక్తులు 3 రోజులు క్యూలో నిలబడి స్వామివారిని దర్శించి, తృప్తి చెందుచు వారి కోర్కెలను తీర్చుకొనుచున్నారు. తిరుమల మూర్తి ఏకమూర్తి అని గుర్తించాలి.

## ఇంటి గుమ్మానికి తిరునామం పెట్టమని సూచించుట

ఇంటి గురించి : హబ్సీగూడలోని కాకతీయనగర్ లో మా ఇంటి పనులు జరుగుచున్నవి. ముఖ ద్వారానికి పైన వినాయకునికి బదులు శంఖు చక్రాలు, నామము పెట్టాలనే ఆలోచన వచ్చింది. నా మనస్సులో భావమును స్వామివారితో పంచుకున్నాను. ఆజ్ఞ ఇవ్వమన్నాను. ఈ క్రింది లీల చూపించారు.

**25-01-05 కల:** ఈ కలలో నాకు ఒక ద్వారము కనబడ్డది. దానిపై సజ్జ లాగా, ఆ సజ్జపై శ్రీకృష్ణుడు కనబడ్డాడు. ఆయన నిలబడి తన కాలు ఒకదానిపై మరొకటి (పాదము) పెట్టి పిల్లనగ్రోవి ఊదుచున్నట్లు కనబడ్డాడు. సిమెంటుతో చేసిన జాలీలో ఈయన మధ్యలో ఉన్నాడు. ఇరుప్రక్కల జాలి ఉంది. ఇది చాలా పురాతనమైన చిత్రము. శ్రీకృష్ణునికి నీలము, పసుపు, ఎరుపు రంగులు మిళితమై ఉన్నవి. ఇంతే కల. ఇది చూడగానే స్వామివారు నా మనస్సులోని కోరికను అనుమతించారని భావించాను. మా ఇంటి ముఖ గుమ్మానికి మధ్యలో నామం పెట్టి ఇరుప్రక్కలకు శంఖు చక్రాలను పెట్టాను.

స్వామివారి అన్ని లీలలు అర్థం అయ్యేవి కావు. ఈ క్రింద తెలిపిన లీల అర్థం కాలేదు.

**08-02-05 కల :** ఈరోజు మంగళవారం. అమావాస్య మరియు శ్రవణా నక్షత్రం. నేను ఒక అడవిలో, బహుశా మా ఇంటి వెనుక, ఉస్మానియా యూనివర్సిటీ మధ్యలో ఉన్నాను ఒక పాడుబడిన ఇల్లు కనబడ్డది. ఆ ఇంట్లో ఎవ్వరూ నివసించుట లేదు. కావున అది పాడుబడిన లేక వదిలిపెట్టిన దానిలా ఉంది. దాని కిటికీలను మరియు డోర్ ఫ్రేములను దొంగలెత్తుకుపోయారు. ఆ ఇల్లు మూడు నాలుగు గదులు కలిగి ముస్లిం జెండాలు కట్టబడి ఉన్నాయి. నేను ఆ ఇంటిలోని ఒక రూము లోనికి పోయాను. కొంచెం ముందుకు జరిగి కిటికీ ఫ్రేమ్ లేని ద్వారం గుండా బయటికి చూస్తూ పైకి చూచాను. అప్పుడు ఆకాశములో ఎర్రని, నిగనిగలాడుచున్న చంద్రుడు చాలా స్పష్టంగా క్లోజప్ లో కనబడ్డాడు. ఇంతలో నా దృష్టి ఇంకా కొంచెము పైకి పోబడ్డది.




ఇంతలో ఇంకో చంద్రుడు స్పష్టంగా క్లోజప్ లో ఇదేవిధంగా కనబడ్డాడు. ఇలా రెండు చంద్రుళ్ళు ఒకేసారి ఆకాశంలో నిగనిగ మెరుస్తూ కనబడ్డారు. ఇది శుభసూచకమా లేక అశుభసూచకమా అని కలలోనే అనుకున్నాను. కల చెదిరింది. వెంటనే నాకు నా స్వామివారే రక్ష అని భావించి శ్రీవేంకటేశ్వరుణ్ణి మనసారా ధ్యానించుకున్నాను. దీని అర్థం నాకు తెలియలేదు. పాఠకులు ఎవ్వరైనా తెలిసినచో చెప్పగలరు.

## భగవంతుడు ప్రసాదించింది తియ్యగా ఉంటుంది

వ్యాపారం గురించి : నేను శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ప్రారంభించిన నాటినుండి రోజు రోజుకు నా ఆర్థిక స్థితి దిగజారింది. నేను చేసే వ్యాపారములో నష్టాలు వచ్చాయి. కట్టిన ఇళ్ళు అమ్ముడు పోలేదు. చాలారోజులు వేచి చూడవలసి వచ్చేది. స్వామివారిని తీవ్రంగా ప్రార్థించిన తరువాత ఆయన దయ కలిగినప్పుడు అమ్ముడు పోయేవి. మొత్తం మీద నా వ్యాపారము దిగజారింది. ఆ కష్టాల నుండి బయట పడుటకని స్వామి స్మరణ ఎక్కువవుతున్నది. ఈ స్థితి పీఠం పెట్టినప్పటి నుండి రోజు రోజుకు పెరిగింది. నా తరువాత ఈ వ్యాపారానికి వచ్చినవారు రాణించారు. నేను మాత్రం మంచి తెలివి తేటలు ఉన్నప్పటికీ వెనుకకు పోయాను. ఈ భావం నా మనస్సులో ముద్రించుకుంది. అధిగమించుటకు తీవ్రంగా ప్రయత్నించాను. నా ఈ ప్రయత్నం చూచి స్వామివారు ఒక చక్కని విశ్లేషణాత్మక లీలను ప్రసాదించారు. కాని అప్పుడు నేను దీనిని తెలుసుకోలేకపోయాను.

**10-02-05 కల :** ఈ కలలో నేను ఒక పుణ్యస్నానాలు చేసేటువంటి సముద్రము లాంటి స్థలమునకు పోయాను. కొందరు భక్తులు స్నానము చేస్తున్నారు, మరికొందరు స్నానం ముగించుకొని వెళ్ళిపోవుచున్నారు. నేను ఆ సముద్రంలో దూకి ఈత కొడుచున్నాను. నేను ఆ నీటిని సముద్రపు నీటివలె ఉప్పుగా గాంచలేదు. అవి తీయగా ఉన్నవి. ఏమిటి ఇది, సముద్రము

కదా, నోటిలోని నీరు ఉప్పుగా లేదేమిటని మరికొంత నీటిని నోటిలో పోసుకున్నాను. ఇవి మటుకు సముద్రపు జలం లాగా ఉప్పుగా ఉన్నవి. మరో విషయం. అంతమంది భక్తులు స్నానం చేయుచున్నప్పటికీ అక్కడి నీరు ఏమాత్రం మురికిగా లేవు, స్వచ్ఛంగా తెల్లగా ఉన్నవి. ఈ స్నానము తరువాత దైవదర్శనానికి వెళ్ళాలనే కోరిక నా మనస్సులో ఉండిది. కల చెదిరింది.

ఈ కల అర్థం అప్పుడు తెలియలేదు. కాని ఈరోజు దీనర్థాన్ని ఇలా గ్రహించాను. భగవంతుడు ప్రసాదించింది తియ్యగా ఉంటుంది. మనము కావలెనని ఉద్రూతలూగుచు తీసుకున్నది చేదుగా / ఉప్పగా ఉంటుందనే అర్థం అనుకున్నాను. ఆ రోజు భగవంతుడు ప్రసాదించిన కొద్దిపాటి వ్యాపారానికి తృప్తి చెందలేదు. మరింత ఎదగాలని చూచాను. అది చేదుగా ఉంటుందని ఈ లీల ద్వారా తెలిపారు.

## స్వామివారికి అన్నీ తెలుసు

**సేవ గురించి :** వరుసగా పది రోజులు స్వామి లీలలను చూడకుండా ఉండేవాడిని కాదు. ప్రతిరోజు ప్రతి క్షణం ఏదో విధమైన కోరికతో ఆయనను అడిగి దాని జవాబుకి వేచి చూచేవాణ్ణి. జవాబు ఆలస్యమైతే స్వామివారు నన్ను మరచారని బాధపడేవాణ్ణి. మళ్ళీ రకరకాల ప్రయత్నాలు చేసేవాడిని. ఆ సమయాన 3వ పర్యాయంగా 7 కోట్ల జపమును వ్రాయిస్తున్నాము. ఈ రాబోవు జప సమర్పణకు ఎవ్వరిని పిలవాలి? స్వామివారి నుండి ఆజ్ఞ రాలేదని ఎదురు చూడసాగాను. స్వామివారు నన్ను మరచారని బాధపడసాగాను. కాని స్వామివారు ఈ క్రింది లీలను చూపించి నా కన్నులు తెరిపించారు.

**04-02-05 కల:** ఒక క్రొత్త విధమైన కల కన్నాను. అరుదైన, అద్భుతమైన సంఘటన. నేను ఈ కలలో శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామివారిని మరియు టిటిడి ఈవో శ్రీ అజయ్ కళ్ళాం గారిని చూచాను. శ్రీ అజయ్ కళ్ళాం గారు, తన చేతిలో ఏవో కొన్ని ఫైల్స్ ను పట్టుకొని ఉన్నారు. నేను మరియు కొంతమంది భక్తులతో కలిసి ఏవో మెట్లు ఎక్కుతున్నట్లుగా కల కన్నాను. కలలో ఇది మొదటి సన్నివేశం. (నేడు అజయ్ కళ్ళాం గారు తన ఈవో బాధ్యతలను శ్రీ ఎ.పి.వి.ఎన్ శర్మ గారికి అప్పజెప్పారు).

రెండవ సన్నివేశంలో చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో ఒక ఉత్సవం జరుగుతోంది. చాలామంది భక్తులు ఉన్నారు. శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారు భాషణ ఇస్తున్నారు. అందులో స్వామివారు మా జప సమర్పణ గురించి, మా కార్యక్రమము గురించి భక్తులకు చెబుతారని ఎంతో కుతూహలముతో ఎదురు చూచాను. కాని ఆయన మొత్తం భాషణంలో ఈ విషయమై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. భాషణ ముగించి ఆయన కుటీరమునకు పోవుచున్నారు. ఆ మధ్యలో నేను ఆయన వద్దకు వెళ్ళాను. స్వామివారికి తృతీయ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ చేస్తున్నాను. జప పుస్తకములను భక్తులకు పంచుచున్నానని చెప్పాను. ఇంతలో జీయర్ గారు "నాకు అంతా తెలుసు. నీవు చేస్తున్న ప్రతి విషయము నాకు తెలుసు. నీవు ప్రస్తుతము తృతీయ పర్యాయముగా 7 కోట్ల జపమును సమర్పించబోవుచున్నావని" తెలుసని అన్నారు. అప్పుడు నేను జీయరు గారు కావాలనే సభలో నా గురించి చెప్పలేదు అని కలలోనే అనుకున్నాను. కల చెదిరింది.

దీనర్థం నా స్వామివారు నాకు సరైన సమయమున జవాబు ఇవ్వనంత మాత్రాన నన్ను మరువలేదని మరియు ప్రతి విషయం ప్రతి క్షణం నా గురించి తెలుసని గ్రహించాను.

## శివుడు తిరునామాలతో దర్శనమిచ్చుట


నేను ఒక సాధారణ మానవుణ్ణి. కాని శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత ఆయన అనుగ్రహం లభించింది. ఈ అనుగ్రహాన్ని ఆసరాగా తీసుకుని స్వామివారిని ఎన్నో రకాలుగా వాడుకున్నాను. ఏ కోణంలో ఎక్కువ ఆనందం లభించేదో ఆ కోణంలో వాడుకున్నాను. బహుశా ఈ సృష్టిలో నాకు తెలిసి భగవంతుణ్ణి ఇంతగా వాడుకున్నవాడు నేనొక్కడినే అని భావిస్తున్నాను. ఆయన కూడా నా కోరికను తీర్చేవాడు. ఇక్కడ పరమశివుణ్ణి చూడాలనే కోరిక పుట్టింది. వెంటనే ప్రభూ మీరు తిరునామం ధరించి లింగరూపం కాకుండా మానవుడిగా దర్శనమివ్వమని ప్రార్థించాను. స్వామివారు కరుణించారు. ఆ లీల ఇలా ఉంది. ఇది నా జీవితములో మరో ఆణిముత్యం.

తేది 11-02-05 శుక్రవారం ఉదయం 11.45 గంటలకు తిరుమలగిరి లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి గుడికి వెళ్ళాను. మనస్సు కలత చెందినప్పుడు, ప్రశాంతత కోసం అందుబాటులో ఉంది కాబట్టి ఈ ఆలయానికి వెళ్ళేవాడిని. ఈరోజు ఆలయానికి వెళ్ళి శ్రీ ఆంజనేయ స్వామివారిని ప్రార్థించాను. మరియు వెనుకనే ఉన్న పరమశివుడికి కూడా ఐదు ప్రదక్షిణలు చేసి ఈశ్వరుణ్ణి ధ్యానించాను. పైకి పరమశివుడిని ప్రార్థించుచున్నాననే కాని లోన శ్రీవేంకటేశ్వరుణ్ణే ధ్యానించేది. శివరూపాయ శ్రీవేంకటేశ్వరాయ నమో నమః అని ప్రార్థిస్తేనే ఆనందం కలిగేది. ప్రార్థన తరువాత ఎందుకో గాని ఈరోజు పరమ శివుణ్ణి చూడాలనే బలమైన కోరిక నా హృదయం నుండి పుట్టుకొచ్చింది. ఈ కోరిక ఉబికి ఉబికి వచ్చింది. కాని స్వామివారిని ఇంతకుముందు ఎన్నోసార్లు లింగాకారంలో చూచాను. ఇప్పుడు మానవరూపంతో చూడాలని కోరిక పుట్టింది. ఈ కోరికతో ఒళ్ళు పులకరించింది. కళ్ళ నుండి ఆనందబాష్పాలు రాలాయి. వెనువెంటనే ఈ కోరికను నా స్వామివారు కూడా మన్నించినట్లు నమ్మకం ఏర్పడ్డది. ఇదే ఆనందస్థితిలో అక్కడ ఐదు నిమిషాలు ఉన్నాను. ఇంతలో నా మనస్సులో మెరుపులాంటి మరో ఆలోచన కల్గింది. నేను నా ప్రభువైన శివుణ్ణి

కేవలం నా ఆనందం కోసమే చూడాలనుకుంటున్నాను. కాని ఈ పొందగోరే ఆనందం రెట్టింపైతే బాగుండుననిపించింది. వెంటనే ఇలా ప్రార్థించాను. హే ప్రభూ! మిమ్మల్ని చూడాలన్న కోరిక బలంగా ఉన్నది. మిమ్మల్ని నా సంతోషం కోసమే చూడాలనుకుంటున్నాను. నా సంతోషం రెట్టింపగునట్లు మీరు తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుడు ధరించినట్లు, అంత సైజు గల తిరునామం ధరించి దర్శనమివ్వుమని వేడుకున్నాను. అంటే పరమశివుణ్ణి తిరునామం ధరించి దర్శనమివ్వమన్నాను.

కాని మరునాడు దర్శనమివ్వలేదు. బాధపడ్డాను. తిరిగి ప్రార్థించాను. ఈరోజైనా దర్శనమివ్వుమని వేడుకున్నాను. స్వామి కరుణించాడు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**13-02-05 కల :** తిరుపతిలో కపిలేశ్వరము అనే ఒక శైవ క్షేత్రమున్నది. ఇందులో శివుడు ఆరాధ్యుడు. ఈ క్షేత్రం చాలా ప్రసిద్ధమైంది. మనము ఆలయ ముఖద్వారం నుండి వెళ్ళగానే ఎడమ ప్రక్క శ్రీలక్ష్మీనారాయణుడు దర్శనమిస్తాడు. వీరు శేషునిపై కూర్చుండి తన తొడపై లక్ష్మీదేవిని కూర్చుండపెట్టుకొని ఉంటాడు. వీరు శ్రీవేంకటేశ్వరుని మాదిరిగానే పెద్దదైన తిరునామమును ధరించి ఉంటారు. ఈయన ఈ ఆలయానికి క్షేత్రపాలకుడని అంటారు. నాకు కలలో ఇదే విధమైన రూపము కనబడ్డది. నారాయణుడు తన తొడపై లక్ష్మి అమ్మవారిని కూర్చుండబెట్టుకున్నాడు. మరియు తెల్లని మిరుమిట్లు గొలిపే ఆభరణాలు కల్గి ఉన్నాడు. మంచి తిరునామం ముక్కునుండి తలవరకు, కళ్ళపైనుండి ధరించాడు. ఆయనను చూడగానే శ్రీలక్ష్మీనారాయణుడి వలె ఉన్నాడని కలలోనే అనుకున్నాను. ఆ తరువాత కేవలం ఆయన తిరునామం మాత్రమే క్లోజప్ లో కనబడ్డది. ఈ నామం స్వామినుండి పెద్దదగుచు పెద్దదగుచు నా వరకు వచ్చింది. ఆ తరువాత చిన్నదగుచు చిన్నదగుచు స్వామివరకు వెళ్ళి ఆయన ముఖముపై వాలింది. ఉదా : సినిమాలో ఒక దొంగ ఒకరిని చంపుటకు ఒక కత్తిని తీసుకుని పోవుచున్నప్పుడు, మనకు ముందు ఆ దొంగను చూపుతారు. ఆ తరువాత అతడు తీసుకెళుతున్న కత్తిని ప్రేక్షకులు దానిని స్పష్టంగా చూడాలని క్లోజప్ లో చూపిస్తారు. ఇదేవిధంగా నాకు ముందు శ్రీమన్నారాయణుడు కనబడ్డాడు. తరువాత తాను ధరించిన తిరునామం మాత్రమే క్లోజప్ లో కనబడ్డది. దీని ఉద్దేశ్యం తాను తిరునామమును (ఊర్ధ్వ పుండ్రాలను) ధరించినాడన్న విషయమును స్పష్టం చేశాడు. తరువాత శ్రీలక్ష్మీనారాయణుడు మళ్ళీ కనబడ్డాడు. వీరిని చూడగానే కపిల తీర్థంలోని లక్ష్మీనారాయణులని కలలోనే భావించాను.




ఈ సన్నివేశం తరువాత నేను ఒక శ్రీవేంకటేశ్వర ఆలయానికి వెళ్ళాను. అక్కడ ఉత్సవములు జరుగుట వలన సందడిగా ఉన్నది. బ్రాహ్మణులు చాలామంది ఉన్నారు. రథోత్సవమునకు సిద్ధం చేస్తున్నారు. నన్ను చూడగానే ఈ అయ్యవారలు పిలిచి స్వామివారి గుడిలో పూజ చేయించారు. ఆ తరువాత నేను వీధుల లోనికి వచ్చాను. అక్కడి జనం ఈ మార్గాన స్వామివారి రథం వస్తుంది ప్రక్కకు జరగమనే విధంగా చూస్తున్నారు. ఆ ఆలయంలో నల్లగా ఉన్న చిన్న చిన్న విగ్రహాలు చాలా ఉన్నాయి. కల చెదిరింది.

ఈ విధంగా నా కోరిక ప్రకారం శివుడు తిరునామముతో దర్శనమిచ్చాడు. వీరు తిరునామం ధరిస్తే నారాయణుడుగా మారుతాడని అర్థం. అంటే శ్రీవేంకటేశ్వరుడు శ్రీమన్నారాయణుడే మరియు పరమశివుడు కూడా శ్రీమన్నారాయణుడే. వీరిరువురు మూలంలో శ్రీమన్నారాయణుడనే విషయమును మరోసారి తెలియజేశారు. ఇంతటి జ్ఞానాన్ని ప్రసాదించుచు, నా కోరికను తీర్చిన స్వామివారికి శతకోటి ప్రణామాలను అర్పించుకున్నాను. నా జీవితంలో ఈ లీల మరో ఆణిముత్యం.

**నా దశ:** స్వామి చెప్పినట్లు వినమన్నాడు. జీవితాంతం జప పుస్తకములను ఉచితంగ పంచ నిర్ణయించుకున్నాను. స్వామివారు నా ఇంటికి వచ్చి ఆతిథ్యము స్వీకరించి, భోజనము చేస్తానన్నారు. స్వామిని కష్టపెట్టకుమని మా తండ్రి చెప్పాడు. శ్రీవేంకటేశ్వరుడు మూలంలో శ్రీమన్నారాయణుడని తెలిపారు. అధిక వ్యయ ప్రయాసలు మాని భగవంతుడు ప్రసాదించినంతలో తృప్తి చెందమన్నారు. శివుడు కూడ శ్రీమన్నారాయణుడనే విషయమును తెలిపారు.

**భాగవత ఆశీర్వాదము:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన. **(సశేషం)**


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్.

ఫోన్: 040-27175050. Visit: www.srivenkatesham.org

# పరమం పవిత్రం వైశాఖమాస వైశిష్ట్యమ్

– చింతలపాటి శివశంకరశాస్త్రి

శ్లో ॥ "పంకజాసన శక్ర శంకర పూజితాంఘ్రి సరోరుహమ్
దేవదానవ సిద్ధ సాధ్య నరాది భావిత వైభవమ్
సంకటోత్తరణోజ్జ్వల ద్రుచితోషితాఖిల సేవకమ్
వేంకటేశ్వర పాద పంకజ మాశ్రయే నిఖిలాశ్రయమ్"

విశాఖ నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం వైశాఖమాసం. 'ధాత' అనే పేరుతో సూర్యుడు లోకాన్ని ప్రకాశింపచేసే కాలం వైశాఖం. ఈ మాసం మాధవ మాసమని ప్రతీతి.

"న మాధవ సమో మాసో న కృతేన యుగం సమమ్
నచ వేద సమం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్"

కృతయుగంతో సమానమైన యుగం, వేదంతో సమానమైన శాస్త్రం, గంగతో సాటి యగు తీర్థం లేనట్లే వైశాఖమాసంతో సాటివచ్చే మాసం లేదని శాస్త్ర వాక్యం. ఈ మాసమునకు ఇంద్రుడు, అగ్ని అధిపతులు. వసంత ఋతువులో మొదటి మాసంగా వచ్చే చైత్ర మాసానికి మధుమాసం అని, వైశాఖమాసానికి మాధవమాసమని పేరు.

యుగాలు నాలుగు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో యజ్ఞయాగాలు, ద్వాపరయుగంలో హరిహర పూజలు, కలియుగంలో స్నానవ్రతాలు ముఖ్యమైనవి. స్నానవ్రతాదులు కామధేనువు వంటివి. అవి కోరిన కోరికలను నెరవేరుస్తాయి. అందువల్లనే ఈ మాసంలో దేవతలు తమ తేజస్సును జలంలో ఉంచుతారు. ఈ నెలలో ముప్పయి ఒక్క రోజులు నియమ నిష్ఠలతో భగవంతుని ఆరాధించే వాళ్ళకు పుణ్యం ప్రాప్తిస్తుంది. ఈ మాసంలో బ్రాహ్మీ ముహూర్తంలో లేచి స్నానం చేసిన వారికి ఆయురారోగ్యాలు కలుగుతాయి. జలాశయాలలో నీటిలో మెడవరకు మునిగి ఉండి స్నానం చేయడం వలన ఉదర సంబంధ వ్యాధులు నయమవుతాయి.

వైశాఖమాసంలో ప్రయత్నపూర్వకంగా మహానదుల యందు, సరస్సులలో, పుష్కరిణులలో లేదా ఏదో ఒక జలాశయమందు కానీ, దిగుడుబావుల యందు, నూతులయందు, చెరువులందు – ఎక్కడైనా సరే నియమంగా హరిని స్మరిస్తూ, సంకల్పంలో ఆయా నదుల పేర్లు చెప్పి స్నానం చేయాలి. స్నానమాచరించే తీర్థం (జలాశయం) పేరు తెలియనప్పుడు 'విష్ణుతీర్థం' అని సంకల్పం చెప్పుకోవాలి. ఎందుకంటే అన్ని తీర్థములకు దేవత విష్ణువు కావడం చెప్పుకోతగిన విశేష పరిణామం. నదుల స్నానానికి అవకాశం లేనప్పుడు ఈ క్రింది శ్లోకాన్ని పఠించి, ఏ జలాశయం నందైనా, గృహము నందైనా స్నానమాచరించవచ్చు.

శ్లో ॥ "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"

వైశాఖమాసంలో ఉదయాన్నే నియమంగా స్నానం చేసి రావిచెట్టు మొదలులో ఎక్కువగా నీటితో తడిపి, సకల దేవతామయమైన ఆ చెట్టుకు ప్రదక్షిణం చేయాలి. తరువాత పితృ, దేవ, మనుష్య తర్పణాలు వదలాలి. చెట్టు చుట్టూ కూడా నీరు పోసి, దైవ రూపమైన ఆ వృక్షాన్ని పూజించాలి. ఇలా చేసినవారి వేలకొలది తరముల వారు తరించుతారనడంలో సందేహం లేదు.

మాసమంతా విధివిధానంగా నియమ పూర్వకంగా స్నానవ్రతం చెయ్యలేనివారు కనీసం శుక్ల పక్ష త్రయోదశి, చతుర్దశి పూర్ణిమలందైనా నియమంతో స్నానం చేస్తే అన్ని విధాలుగా పాపముల నుండి బయటపడతారనడంలో ఎటువంటి సందేహానికి తావు లేదు. స్నానమాచరించే ముందు విష్ణువును స్మరించి "స్వామీ వైశాఖమాస స్నానం చేయబోతున్నాను. ఆటంకాలు లేకుండా కాపాడు స్వామీ!" అని ప్రార్థించి, దోసిలితో నీరు తీసుకుని మూడుసార్లు వదిలి, గంగాదేవిని ప్రార్థించి, అర్ఘ్యం ఇచ్చి తరువాత స్నానమాచరించాలి. ఇలా మాసమంతా చేయడంతో పాటు వైశాఖపూర్ణిమ నాడు సముద్ర స్నానం చేయాలి. ఈవిధంగా స్నానం చేయడం వల్ల అనంతమైన అశ్వమేధ యాగాలు చేసిన ఫలం లభిస్తుందని శాస్త్ర వచనం.

స్నానానంతరము నిత్యానుష్ఠానాలు, పూజలు చేయడంతో పాటు, షోడశ ఉపచారాలతో, అష్టోత్తరాలతో, సహస్ర నామాలతో శ్రీమహావిష్ణువును పూజించాలి.

శ్లో ॥ "కండూయ పృష్ఠతో గాంతు స్నాత్వా పిప్పల తర్పణం
కృత్వా గోవింద మభ్యర్చ్య న దుర్గతి మవాప్నుయాత్"

ఆవును వెనక భాగంలో చేతితో రాసి, గోకి, పిప్పల తర్పణం చేసి గోవిందుని పూజించినవారు దుర్గతులను పొందరు. ఈ మాసంలో ఒంటిపూట భోజనం, నక్తవ్రతం చేసేవారికి అన్ని కోరికలు నారాయణుని అనుగ్రహం వల్ల తీరుతాయి. తులసీదళాలతో పూజించడం అత్యంత ఫలదాయకం. శ్రీమహావిష్ణువుతో పాటు ఇతర దేవతలను కూడా పూజించాలి. తరువాత రావిచెట్టుకు కూడా శాస్త్రోక్తంగా పూజ చేయాలి. ఈ నెలలో ప్రధానమైన కర్తవ్యంగా దానాలు చెప్పబడ్డాయి. పాదుకలు, విసనకర్రలు, గొడుగులు, పట్టువస్త్రములు, చందనము, జలపాత్రలు మొదలైనవి వారి వారి శక్త్యానుసారము దానం చేయాలి. వేసవి కాలం కావున ఎండలు తీవ్రంగా

ఉంటాయి కాబట్టి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. అనేక రకాల పానకాలు, ద్రాక్ష, అరటి మొదలైన పండ్లరసాలు ఇవ్వాలి.

వైశాఖ శుద్ధ విదియనాడు గంగా నది పుష్కరాలు ప్రారంభమవుతాయి. భగీరథుని తపస్సుకు మెచ్చి ఆకాశగంగ నేలకు అవతరించిన శుభదినం పరమపావన దినం. ఈనాడు కాశీక్షేత్రంలో ఉన్న దశాశ్వమేధ ఘట్టంలో గంగా స్నానం చేయాలి. దశాశ్వమేధ ఘట్టంలోని శివలింగాన్ని గంగాస్నానం చేసి దర్శిస్తే పది జన్మల్లో చేసిన పాపం నిస్సందేహంగా నశించిపోతుంది. స్నానవేళ –

"నందినీ నళినీ సీతా మాలినీచ మహాపగాః
విష్ణు పాదాబ్జ సంభూతా
గంగా త్రిపథగామినీ, భాగీరథీ భోగవతీ జాహ్నవీ త్రిదవేశ్వరీ"

అనే గంగాదేవి పన్నెండు నామాలను పఠించాలి.

మహాశక్తి స్వరూపమైన రేణుకాదేవికి నారాయణుని అంశావతారంగా దుష్టశిక్షణకు వచ్చిన పరశురాముని తదియనాడు అర్చించాలి. "రేణుకా హృదయానన్దం భృగు వంశ తపస్వినమ్ క్షత్రియాణామన్తకం పూర్ణం జామదగ్న్యం నమామ్యహమ్" అని ప్రార్థించాలి. ఈనాడే అక్షయ తృతీయ అనే పర్వమును కూడా జరుపుకుంటుంటారు. క్షయం కానిది అక్షయం. ఈరోజు చేసే స్నాన, దాన, జప, హోమ, అర్చనాదులన్నీ అక్షయ ఫలితాలను ఇస్తాయి కనుక ఇది అక్షయ తృతీయ. ఈరోజున సంపద్గౌరీ వ్రతం ఆచరించడం వలన స్త్రీలకు సౌభాగ్యాది సంపదలు లభిస్తాయి. అత్యంత పరమ పవిత్రమైన ఈనాడే సింహాచల క్షేత్ర చందనోత్సవమును నిర్వహిస్తారు. నారాయణుని దయావతారంగా వరాహ, నృసింహ అవతారములు ఒక్కటిగా కలిగి సింహాచలములో వెలసిన శ్రీ వరాహలక్ష్మీ నృసింహునికి చందనోత్సవం జరిపి స్వామివారి నిజరూప దర్శన భాగ్యమును కలిగిస్తారు.

వైశాఖ శుద్ధ పంచమి అనేక అవైదిక మతాలతో అధర్మం వ్యాపించిన సమయంలో సనాతన వేద సంస్కృతే భారతీయ మతమని అందరిచే సమ్మతింపజేసి, జగద్గురువులుగా జగతిని అనుగ్రహించడానికి సాక్షాత్తు శివుడే శ్రీ ఆదిశంకరులుగా అవతరించిన రోజు. ఈనాడు వారిని షోడశోపచారాలతోను, అష్టోత్తర శతనామాలతో అర్చించడం జ్ఞాన ప్రదాయకం. ఈనాడే వైష్ణవ సంప్రదాయాన్ని విస్తృతపరచిన అవతార పురుషులైన శ్రీ రామానుజుల వారి జయంతి. సమాజంలోని అసమానతలను తొలగించడానికి కృషి చేసిన సంఘ సంస్కర్త శ్రీరామానుజులు. అస్పృశ్యులుగా ముద్ర పడిన వారికి దైవదర్శనం కల్పించిన మహనీయుడాయన. భగవంతుని చేరుకోవాలంటే శరణాగతి కీలకమని ఆయన ప్రబోధించారు. తన జీవితం ద్వారా రామానుజాచార్యుడు మానవాళికి ఇచ్చిన సందేశాలు ఇప్పటికీ, ఎప్పటికీ ఆచరణీయాలు.

ఆదిశంకరాచార్యుల తరువాత తిరిగి ధర్మప్రతిష్ఠాపన చేసిన శివాంశ సంభూతులు శ్రీ విద్యారణ్య స్వామివారు. "విద్యాః విద్యా వివేకేన సారం సంసార వారిధేః ప్రాపయత్య నిశం భక్తాన్ తం విద్యారణ్య ముపాస్మహే" అని స్మరించుకోవడం ప్రతి భారతీయుని కర్తవ్యం.

జగన్మాత ఆదిపరాశక్తిని అపరాజితా దేవిగా పూజిస్తారు. లోక కంటకులైన రాక్షసులను తునుమాడి పరాజయము లేని శక్తిగా అవతరించిన సుదినం. "హారేణతు విచిత్రేణ భాస్వత్ కనకమేఖలా అపరాజితా భద్రరతా కరోతు విజయం మమ" అనే శ్లోకంతో స్తుతించి శరణు వేడటం ఉత్తమ ఫలితాన్నిస్తుంది. ఈ రోజున చండీ పారాయణం కూడా ఉత్తమ ఫలితాన్నిస్తుంది.

వైశాఖ శుక్లపక్ష చతుర్దశి నృసింహ జయంతి. "వైశాఖే శుక్లపక్షేతు చతుర్దశ్యాం సమాదరేత్, మజ్జన్మసంభవం వ్రతం పాప ప్రణాశనమ్" అని నరసింహ జయంతి వ్రతాన్ని ఆచరిస్తారో వారి పాపములన్నీ నశింపబడి నృసింహానుగ్రహ పాత్రులౌతారు. ఈరోజున నువ్వులు, ఉసిరికపిండిని ఉపయోగించి స్నానం చేసి "ఉపోష్యేహం నరసింహ భుక్తి ముక్తి ఫలప్రద, శరణంత్వాం ప్రపన్నోస్మి భక్తిం మే నృహరేదిశ" అని సంకల్పం చెప్పుకొని పూజించాలి. ఈనాడు ఉపవాసం, ప్రదోషకాలంలో నృసింహస్వామి పూజ చేయాలి. స్వామివారికి వడపప్పు, అప్పాలను నైవేద్యాలుగా అర్పించాలి.

"దేవతాకార్య సిద్ధ్యర్థం సభా స్తంభ సముద్భవమ్
శ్రీ నృసింహ మహావీరం నమామి ఋణ విముక్తమ్"

అంటూ స్వామికి ఋణ విమోచనా స్తోత్రాన్ని పఠించాలి. అలాగే అపమృత్యు నివారణకు –

"ఉగ్రం వీరం మహావిష్ణుం – జ్వలంతం సర్వతోముఖమ్
నారసింహం భీషణం భద్రం మృత్యోర్మృత్యుం నమామ్యహమ్"

అనే మంత్రాన్ని 22 సార్లు చదవడం శ్రేయస్కరం.

వైశాఖ శుద్ధ పూర్ణిమను 'మహావైశాఖి' అని పిలుస్తారు. వైశాఖ మాసము యొక్క సంపూర్ణ శక్తి ఈ పూర్ణిమలో దాగడం వల్ల ఈరోజు చేసే సత్యనారాయణవ్రతం, విష్ణుపూజ మొదలైనవి పూర్ణ ఫలితాలను ఇస్తాయి. వైశాఖ పూర్ణిమ బుద్ధుడి జీవితంలోని ప్రతి ముఖ్య ఘట్టం ఈరోజుతో ముడిపడి ఉంది. ఆయన జన్మించిందీ, బోధివృక్షం కింద జ్ఞానసిద్ధిని పొంది బుద్ధుడిగా మారింది, విశ్వమానవాళికి శాంతి, ప్రేమ, కరుణ బోధించి మహానిర్యాణం చెందిందీ ఈ పర్వదినాన్నే కావడం విశేషం. నెలరాజులా ప్రకాశించి, అజ్ఞాన తిమిరాంధకారాన్ని పటాపంచలు చేసి, వైశాఖ వెన్నెల కాంతిలోనే విలీనమైపోయాడు తథాగతుడు. ఆయన బోధ విశ్వవిదితం, ఆచంద్ర తారార్కం.

శివుని అష్టమూర్తులలో ఒకడైన వాయుదేవుని అనుగ్రహం ద్వారా కేసరి, అంజనాదేవికి తపః ఫలంగా రుద్రతేజంతో హనుమ జన్మించాడు. కార్యదీక్షకు, సాధక లక్షణాలకు ప్రతీక

హనుమ. పరమ వైష్ణవ భక్తశిఖామణి ఆంజనేయుడు. గొప్ప విష్ణు (రామ) భక్తుడు. ''విజయద్విష్ణు పదం వ్యోమ్ని'' అని అమరం చెబుతోంది. 'విష్ణుపదం' అంటే ఆకాశమని అర్థం. విష్ణువు ఉండే చోటు కూడా స్వాతి, శ్రవణా నక్షత్రాల మధ్య ఉంటుంది. శ్రవణా నక్షత్రమంటే గరుత్మంతుడు. ''సుపర్ణో గరుత్మాన్'' అని ఋగ్వేదం చెబుతోంది. విష్ణువు గరుత్మంతునికి, హనుమకు మధ్యనే ఉంటాడు. అందుకే ఆయన్ను ప్రాంజలి రాంజనేయ మనిశం అని స్తుతిస్తారు. హనుమ మంచి వాక్పటిమ గలవాడు, మరియు దౌత్యవేత్త. రామ కార్యార్థము లంకకు వెళ్ళి సీతను అన్వేషించి, రామలక్ష్మణులకు ఊపిరులూదినవాడు. లంకా నగరంలో రావణునికి చేసిన హితబోధలో ఆతని వాక్పటిమ కనిపిస్తుంది.

అదేవిధంగా రామలక్ష్మణులు సీతాన్వేషణ గావిస్తూ కిష్కింధకు వచ్చినప్పుడు హనుమ సుగ్రీవుని ఆజ్ఞతో వెళ్ళి రామునితో సంభాషించిన తీరు ఆతని వాక్పటిత్వమునకు చక్కని నిదర్శనము. ఆతని వాక్పటిమను గాంచి శ్రీరాముడు హనుమను ఎంతో శ్లాఘించాడు.

మాధవ మాసంగా వినుతికెక్కిన వైశాఖ మాస వైశిష్ట్యము ఎనలేనిది. ఎంతో విశిష్టమైనది. ఈ మాసంలో శక్త్యానుసారం దానధర్మాలొనరించి, స్నానమాచరించి (వైశాఖ) మాధవుని అర్చించి, భగవంతుని అనుగ్రహాన్ని పొందుదాము. మన జీవితాలను ధన్యం చేసుకుందాం.

**"నారాయణ – నారాయణ జయ గోవిందహరే**
**నారాయణ – నారాయణ జయ గోపాలహరే**
**కరుణా పారావార వరుణాలయ గంభీర నారాయణ**
**ఘన నారద సంకాశకృత కలి కల్మష నారాయణ"**

# గజేంద్ర మోక్షంలో అంతరార్థం

ముక్తి మరణానంతరం వచ్చేది కాదు. బ్రతికుండగానే సాధించాల్సిన స్థితి. దీనిని తెలియచెప్పే కథనమే 'గజేంద్ర మోక్షం'.

పూర్వజన్మల వల్ల, కర్మల వల్ల ప్రోగుచేసుకున్న వాసనల వల్ల ఏర్పడిన బంధాలతో ఇంద్రియ భోగ లాలసత్వములతో కూడిన 'అహం' (నేను అన్న దేహాత్మ భావన) మొసలి కాగా దానిచే పట్టుబడ్డ మానవుడే గజేంద్రుడు. జనన మరణ చక్రంలో అనేకసార్లు పడి పరిభ్రమిస్తున్న మానవుడు ముక్తి పొందాలంటే అందుకు తన శక్తి మాత్రమే చాలదు. పరమాత్మ అనుగ్రహశక్తి పరిపూర్ణంగా కావాలి. ఆ అనుగ్రహానికై ఈ సంసార బంధాల నుండి ఇంద్రియ భోగలాలస నుండి విముక్తి కలిగించమని ఆ పరమాత్మనే ప్రార్థించాలి. ఈ భవసాగరంలో పడిన నన్ను రక్షించమని పరితపిస్తూ రక్షించేంతవరకు వేడుకోవాలి. పరమాత్మ పలికేంతవరకు ప్రార్థన ఆపకూడదు అచ్చంగా గజేంద్రుడిలా. తన పరివారంతో మోహంతో కూడి ఒక పెద్ద కొలనులో జలక్రీడలు సాగిస్తున్న గజేంద్రుడు, సంసార సాగరంలో ప్రాపంచిక పరివారంతో మనస్సుతో కూడి కదలాడుతున్న మానవునికి దర్పణం. గజేంద్రుడు మకరేంద్రుడి బారిన పడిన భవసాగరంలో క్రీడిస్తున్న మానవుడు అంతర్యామినే మరచి 'అహం' అనెడి మకరం నోటిలో చిక్కుకొని దుఃఖితుడవుతున్నాడు. గజేంద్రుడు తనని తాను రక్షించుకోవడానికి ప్రయత్నం ప్రారంభించినట్లుగానే మానవుడు కూడా అహం భావం నుండి బయటపడటానికి సాధన అన్న ప్రయత్నం చేయాలి. జలమునందు మొసలికి బలం ఎక్కువ. ప్రాపంచిక సంసారంలో ఇంద్రియ భోగలాలసత్వమును అలవర్చుకున్న 'అహం'కు కూడా పట్టు ఎక్కువే. ఈ అహం నుండి విడిన తన సాధనాబలంతో పాటు ఈశ్వర అనుగ్రహం కూడా కావాలని గజేంద్రునిలాగా గ్రహించి త్రికరణశుద్ధిగా ఆ అనంతుణ్ణి అర్థించాలి.

గజేంద్ర మోక్ష ఘట్టంలో మొదట గజేంద్రుడు తన శత్రువైన మొసలిని తానుగా జయించడం కష్టమని తెలుసుకుని అందుకు పరమాత్మ మాత్రమే సహాయపడగలడని గ్రహించి పరమేశ్వరుని అనుగ్రహమునకై ప్రార్థించి అటుపిమ్మట పలు నిందాస్తుతిని చేసి, అంతలోనే పరమభక్తితో వివేక విశ్వాసాలతో నీవు తప్ప ఎవరూ లేరని తనను తాను శరణాగతి చేసుకోగానే ఆ అనంతుడు సుదర్శన చక్రమును ప్రయోగించి మకర సంహారం చేసి దర్శనమిచ్చాడు. అలాగే మానవుడు తనకు తానుగా ఈ ప్రారబ్ధ వాసనలను అద్దుకున్న 'అహం' భావనను జయించడం కష్టమని గ్రహించి పరమాత్ముని భక్తి విశ్వాసాలతో ప్రార్థించి, ఈ జన్మల పరంపరలో పడి అలసిపోతున్నాను. ఈ భవసాగరంలో ఈదలేను, ఈ జనన మరణ చక్రభ్రమణం నుండి నన్ను రక్షింపుము. ఈ వాసనా బంధాలను తీసేయమని, వీటన్నింటి యందు విముక్తి కలిగించమని (సమస్త ప్రపంచ దృశ్య సంసార భావనా పరిత్యాగమే విముక్తి) వేడుకుంటూ క్రమేణా కోరిక, కర్మ, అహం సమర్పణా శరణాగతికి వస్తే – అప్పుడు సుదర్శన చక్రమనే జ్ఞానముతో అజ్ఞాన అహంభావనను సంహరించిన పిదప ఆత్మసాక్షాత్కారం అవుతుంది.


జన్మ పరంపరల నుండి విముక్తి పొందటమే ముక్తి.

'తస్మాత్ భావో భావా పరిత్యజ పరమాత్మ ధ్యానేన ముక్తో భవతి' సమస్తమును త్యజించగా చివరకు ఆత్మ ఒక్కటే మిగిలి వుంటుంది. అదియే ముక్తి. అదియే మోక్షం.

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## జమదగ్ని – ముంగిస

సూత మహర్షి వేదిక వద్దకు వస్తుండటం చూసిన మునులందరూ లేచి భక్తితో నమస్కరించారు. అందరినీ ఆత్మీయంగా చూస్తూ వేదికనలంకరించాడు. ఆయన ఆశీస్సుల నందుకొన్న మునులలో ఒక ముని లేచి ''గురూత్తమా! నిన్న మీరు చెప్పిన సక్తుప్రస్థుని కథ వింటున్నప్పుడు నాకొక సందేహం కలిగింది'' అని అనగానే –

''చెప్పు నాయనా!'' అని అడిగాడు సూతుడు. వెంటనే ఆ ముని –

**"అనఘ! నకుల రూపంబున నట్లు దోచి**
**బ్రాహ్మణులతోడ మానవ భాషణముల**
**నెవ్వడేనియు నొక్క యహీన బోధ**
**ఘనుడు సల్లాపమొనరించె నని తలంచి"**

**–273 ప – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

మహాత్మా! ముగింస రూపంలో వచ్చి, ఆ విప్రవరులతో, దానగ్రహీతలతో మానవభాషలో ధర్మనిరూపణ చేసింది ఒక మహాతపస్సంపన్నుడైన జ్ఞాని అయి ఉంటాడు. లేకపోతే, ధర్మం గురించి చెప్పడం సామాన్యులకు చేతనవుతుందా? నా అనుమానం తీరే విధంగా ఆ వచ్చిన ముంగిస – స్వామీ! నిజంగా ముంగిసేనా? లేక ఏ మహానుభావుడైనానా? ముంగిస రూపంలో వచ్చాడా? చెప్పండి'' అని సూతునివైపు చూశాడు. అతని ప్రశ్నకు సమాధానంగా చెప్పసాగాడు సూతమహర్షి.

''నాయనా! నీ ప్రశ్న చాలా సముచితంగా ఉంది. ఆ ముంగిస ఎవరో కాదు, శాపవశాత్తు ముంగిస రూపం ధరించిన జమదగ్ని మహర్షి. భృగువంశ సంజాతుడు, పరశురాముని జనకుడు, అఖండ తపోనిధి అయిన జమదగ్ని. ఆయన అత్యంత నియమ నిష్ఠలతో పితృకార్యం (శ్రాద్ధకర్మను) చేయాలని సంకల్పించాడు. అందుకుగాను నిగ్రహమనస్కుడై, స్వయంగా హోమధేనువు పాలను క్రొత్త కుండలోకి పిండి జాగ్రత్తగా మంచి ప్రదేశంలో భద్రపరిచాడు. క్రోధదైవం జమదగ్ని సహనాన్ని, శక్తిని, మనస్సును పరీక్షించాలని పూనుకుంది. వెంటనే మానవాకారం ధరించి వచ్చి, ఎవరూ ఏమీ అపరాధం చేశాడని అనుకోనివిధంగా, పొరపాటున చేయి తగిలించుకొనేటట్లు ఆ పాల కుండను


పడిపోయేటట్లు త్రోశాడు. క్రోధుడు పుణ్యకార్యానికి పెట్టి ఉంచిన పాలకుండను పడతోసినా పుణ్యపురుషుడైన జమదగ్ని క్రోధుని పట్ల కోపం వహించలేదు. జమదగ్ని సహనశక్తికి క్రోధుడు సంతోషించాడు. మనసులో ఎంతగానో మెచ్చుకున్నాడు. తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

మహర్షిసత్తమా!

**"భృగువులు క్రోధను లనగా**
**జగతి పరగు వాదమది మృషా పరికలితం**
**బగుట తెలిసె; నోడితి నీ**
**కగణితమగు నీ తపమునకలిగెద ననఘా!**

**–277 – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

"పాపరహితుడవైన జమదగ్ని మహర్షీ! భృగుమహర్షి సంతతి (వంశం వారందరూ) కోపిష్ఠులన్నది లోక విదితం. నీ ప్రవర్తన అది అసత్యమని ఋజువు చేస్తోంది. అది తెలుసుకొన్న నేను ఈనాడు నీ దగ్గర ఓడిపోయాను. సాటిలేని నీ తపోమహిమకు భయపడిపోతున్నాను. మహాత్మా! నా పట్ల ప్రసన్నుడివి కావలసిందిగా ప్రార్థిస్తున్నాను. నన్ను ఆదర దృష్టితో చూడు. నీ పట్ల నేను చేసిన అపరాధాన్ని క్షమించు" అంటూ కాళ్ళమీద పడిన క్రోధ దేవుని చూసి లేవనెత్తాడు జమదగ్ని మహర్షి. శాంతయుతుడైన ఆ మహర్షి క్రోధుడితో "నాయనా! నీవేమీ తప్పు చేయలేదే? నీలో ఏర్పడిన అనుమానాన్ని త్రోసి పుచ్చవయ్యా. నేను తలపెట్టిన శ్రాద్ధవిధి భగ్నం కావటం వల్ల పితృదేవతలు



నాపై ఆగ్రహిస్తారు. కనుక నీవు శీఘ్రంగా వెళ్ళు" అని అనగానే క్రోధుడు అంతర్ధానం చెందాడు. హోమధేనువు పాలు క్రింద పడిపోయాయన్న విషయం తెలుసుకున్న జమదగ్ని పితృదేవతలు కోపించి ఆయనముందు ప్రత్యక్షమైనారు.

**"జమదగ్నీ! నీవు శ్రాద్ధంబునకు సంకల్పించి యుండి తద్వైకల్యంబు పుట్టిన నూరకుంటివి, ముంగివై పుట్టుమని" శపించిన –**

**–వ.282 – చతుర్థాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

"నీవు శ్రాద్ధకర్మ చేయాలన్న తలంపుతో నిష్ఠతో ఉండి కూడా దానికి వైరుధ్యంబేర్పడినప్పుడు ఎవరూ హోమధేనువు పాలనందకుండా చేశారో వానిని శిక్షించకుండా ఉపేక్షించావు. మాకందవలసిన భోజ్య పదార్థాలు దక్కకుండా చేశావు. తత్ఫలితంగా నీవు ముంగిసవై పుట్టుమ"ని శపించగా జమదగ్ని భక్తితో పితృదేవతలను చూసి వారికి సాష్టాంగ నమస్కారాలు చేశాడు. "మహానుభావులారా! నాదొక విన్నపం. దయతో ఆలకించండి. తపస్వి ఆగ్రహించకూడదని, క్రోధుడు చేసిన అపరాధాన్ని చూసి కూడా అతనిని నిందించలేకపోయాను. పైపెచ్చు శపించలేకపోయాను. నన్ను క్షమించండి. అంతేకాదు –

**"తప్పసైచి నన్ను దయసూచి శాపమో**
**క్షము నను గ్రహింపు డమిత తేజు**
**లార! యని వినీతి లంపటుండగుచు ప్రా**
**ర్థించుటయును వారు తెలివి నొంది"**

**–283ప–చతుర్థాశ్వాసము–అశ్వమేధపర్వము– మహాభారతము**

"తేజోసంపన్నులారా! పితృదేవతలారా! మీరు దయామయులు. నా వల్ల జరిగిన అపరాధాన్ని సహించి నన్ను రక్షించండి. శాపవిమోచనాన్ని ప్రసాదించండి" అని వినయ వినమితోత్త మాంగుడైనాడు జమదగ్ని మహర్షి. జమదగ్ని సత్ప్రవర్తనను ఆమోదించినివారై ఆతని పట్ల పితృదేవతలు ప్రసన్నులైనారు.

**"నాయనా! నీ వినయం మమ్మల్ని ఆనంద సాగరంలో ముంచెత్తింది.**

**"విదగ్ధ విప్రసమూహం బొడంబడునట్టి యుచిత వాక్యంబుల నీవెన్నడేని మహో**

**ధర్మంబు కీడని యాడితి నాడు నీకు శాపమోక్షంబగునని నిర్దేశించిరి"**

**–వ – 284 – చతుర్థాశ్వాసమబు – అశ్వమేధ పర్వము – మహాభారతము**

"ఏనాడు నీవు మహావిద్వాంసులు, మునీంద్రులు అయిన విప్రోత్తములు అంగీకరించే విధంగా మహాధర్మాన్ని లోపభూయిష్టమైనదని అభివర్ణిస్తావో – ఆనాడు నీ జ్ఞాన సంపదకు ఆ పండిత శ్రేష్ఠులు సంతుష్టులయిన మరుక్షణమే నీకు

శాపవిమోచనం జరుగుతుంద''ని జమదగ్నిని ప్రేమపూర్వకంగా ఆశీర్వదించి, పితృదేవతలు తమ నివాసస్థానాలకు వెళ్ళిపోయారు. అప్పటినుండి ముంగిసగా ఉన్న జమదగ్ని – ధర్మరాజు అశ్వమేధ యాగాన్ని చూసి శాపవిమోచనం పొందాలన్న కోరికతో – ఆ యజ్ఞ ప్రదేశానికి రావటం జరిగింది. అక్కడ ముంగిస కోరిక తీరేటట్లు దాని శరీరంలోని సగభాగం స్వర్ణమయం కాలేదు. అందుచేత విప్రోత్తముల మధ్య నిలబడి – వారితో సక్తుప్రస్థుని ధర్మబద్ధమైన, పశుహింసా విరహితమైన దాన యజ్ఞం యొక్క మహిమ, ధర్మరాజు చేసిన అశ్వమేధ యజ్ఞంలోని దాన మహిమ కన్న ఎంత గొప్పదో వివరించి చెప్పింది. ఆ మహానుభావుల ఒప్పుదలతో శాపవిమోచనాన్ని పొంది ముంగిస అంతర్ధానమై తన ఆశ్రమ స్థలానికి వెళ్ళిపోయింది. ముంగిస మానవభాషలో మాట్లాడి వేదవిదులు, మేధాసంపన్నులు అయిన విప్రోత్తములందరిచేత ఔననిపింప చేయగలిగిన జ్ఞానం కలిగి ఉండటానికి కారణం – అది పూర్వజన్మలో మహాత్ముడైన జమదగ్ని మహర్షి కావటమే'' అని చెప్పి సూతమహర్షి మునులవైపు చూశాడు 'సరేనా!' అన్నట్లు. మునులందరూ సక్తుప్రస్థుని నిస్వార్థ వర్తనానికి, ధర్మనిరతికి, దానయజ్ఞ నిర్వహణకు, పశుహింసా నిరసనకు ఆతనిని మనసారా ప్రస్తుతించారు. ''తనకు, తనవారికీ లేకపోయినా, అతిథికి పెట్టి, అతిథిని సంతృప్తి పరచటమే ధర్మాలలోకెల్లా ఉత్తమ ధర్మం'' అని చెబుతూ ఆసనం నుంచి దిగి, సూతమహర్షి ఆశ్రమం వైపుకు దారి తీశాడు. మునులందరూ ఆయనను అనుసరించారు.

# యవక్రీతుడు

శ్రోతలైన శౌనకాది మునులందరూ రాగానే అంతకుముందే వచ్చి కూర్చుని ఉన్న సూతమహర్షి వారినాశీర్వదించి నాడు చెప్పబోయే విషయం గురించి చెప్పసాగాడు.

మునిపుంగవులారా! విద్యాభ్యాసం ఏవిధంగా చేయాలన్నది ఈనాడు చెబుతాను జాగ్రత్తగా వినండి.

**"గురుముఖమునఁ బడయక, దు**
**ష్కరతపమునఁ జేసి పడయగా బడు విద్యల్**
**పరమార్థము మదమును మ**
**త్సరమును గావించు నెట్టి సాధులకైనన్"**

**–256 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

అని ఇంద్రుడే చెప్పాడు.

గురువు స్వయంగా విద్యాంశాలు చెబుతున్నప్పుడు విని నేర్చుకోకుండా, అత్యంత కఠినమైన తపస్సు చేసి పొందేటటువంటి విద్యలు గొప్ప ఫలితాన్ని ప్రసాదించటంలో ఎంత మంచివారికైనా మద మాత్సర్యాలను కలుగజేస్తాయి. గురువు చేసే ప్రబోధాలే ఎప్పటికీ సద్విద్యను ప్రసాదిస్తాయి అని తెలుసుకోవటం విద్యార్థికి ప్రథమ కర్తవ్యం.

గురువు చేసే బోధ సద్విద్యను ప్రసాదిస్తుందని ఇంద్రుడు ఎవరితో చెప్పాడో, ఎందుకు చెప్పాడో అన్న విషయం గురించి ఇప్పుడు చెప్పుకుందామన్న సూతుని చూచి మునులందరూ శ్రద్ధాళువులైనారు.

''ప్రకృతి శోభతో విరాజిల్లుతున్న ఒక ప్రశాంత వనభూమిలో రైభ్యుడు, భరద్వాజుడు చక్కని మైత్రీభావంతో కలిసిమెలిసి జీవించేవారు. తపోనిష్ఠలో వారిని మించినవారు లేరన్న ఖ్యాతిని పొందారు. ఆ మహర్షులిద్దరూ తమ తపోమహిమ వల్ల మహానుభావులై శాపానుగ్రహ సమర్థులైనారు. రైభ్యుడికి ఇద్దరు పుత్రులు. అర్వావసుడు, పరావసుడు అనే ఆ ఇద్దరు పుత్రులు గురువు వద్ద వేద వేదాంగాలను, ఉపనిషత్తులను, సర్వశాస్త్రాలను చక్కగా అధ్యయనం చేసి పేరు గడించారు. రైభ్యుని, అతని కొడుకులను విద్వాంసులు పూజించడాన్ని చూసిన భరద్వాజుని పుత్రుడైన యవక్రీతునికి నచ్చలేదు. ఈర్ష్యతో కొట్టుకుపోయాడు. వేదవిద్యను, శాస్త్రాలను, దేవపూజా విధానాలను గురువు వద్ద నేర్చుకోవటానికి చాలాకాలం పడుతుంది కనుక, అంతకాలం కేవలం అభ్యసించటానికి వినియోగించటం ఇష్టంలేని యవక్రీతుడు తపోబలం చేత వాటినన్నిటినీ పొందుదామని నిశ్చయించాడు. అగ్నిలో హోమం చేస్తూ తీవ్రమైన తపస్సును చేయసాగాడు. ఆతడు చేస్తున్న ఉగ్రమైన తపస్సుకు లోకాలు తాళలేకపోవడంతో అది చూసిన దేవేంద్రుడు అతని వద్దకు వచ్చి –

''మహర్షీ! నీవింత తీవ్రమైన తపస్సు చేయటానికి గల కారణం ఏమిటి? నీ కోరిక ఏమిటో చెప్పు'' అని అడగగానే యవక్రీతుడు తన ఆలోచనను చెప్పసాగాడు.

''దేవేంద్రా!

**"చదువకయును నాకు సర్వ వేదంబులు**
**సర్వ శాస్త్రములును సంభవిల్ల**
**వలయునని తలంచి వదలక నిష్ఠతో**
**నుగ్రతపముఁ జేయు చున్నవాడ"**

**–254 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''ఏ గురువు వద్ద బహుకాలం విద్యనభ్యసించకుండానే (చదవకుండానే), సమస్త శాస్త్రాలు, సర్వవేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, భగవత్పూజా విధానాలు – అన్నీ నాకు రావాలని (తెలియాలని) కోరి ఏమాత్రం నియమ నిష్ఠలను వదలకుండా ఉగ్రమైన తపస్సు చేస్తున్నాను'' అని చెప్పగానే యవక్రీతుని చూసి ఆశ్చర్యపోయాడు ఇంద్రుడు. ఆ తపస్విని చూసి – ''మహానుభావా! నీవు చేస్తున్న తపస్సు తీవ్రమైనదే కానీ, నీ కోరిక మాత్రం హర్షించదగినది కాదు. ఎందుకంటే గురుముఖతః నేర్చుకొన్న విద్య సత్ఫలితాలనిస్తుంది. కఠినమైన గాఢ తపస్సు చేసి సంపాదించిన చదువువల్ల – మద మాత్సర్యాల వంటి దుర్గుణాలు ప్రవేశించి సాధుడు – అసాధువౌతాడు (చెడ్డవాడవుతాడు). విద్య

నార్జించటానికి తపస్సు సాధనం కాదు'' అని చెప్పి ఇంద్రుడు వెళ్ళిపోతాడు. యవక్రీతుడు – ఇంద్రుని మాటలు లక్ష్యపెట్టక యథావిధిగాతపస్సు చేస్తూనే ఉన్నాడు.

యవక్రీతుడు వదలకుండా నిరంతరం తపస్సు చేస్తున్న కారణంగా ఇంద్రుడి మనస్సు తపనకు గురయింది. వెంటనే ఆ త్రిలోకనాథుడు వృద్ధ బ్రాహ్మణ రూపాన్ని ధరించి యవక్రీతుడున్న చోటికి వచ్చాడు. శుష్కించిన శరీరంతో అశక్తుడైనా ఏమాత్రం వీడకుండా, మితిలేని ప్రవాహంతో గంభీరంగా ఉన్న గంగానదికి ఆనకట్టను కట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అసలు బలం లేని ఆ వృద్ధుడు తన పిడికిళ్ళతో ఇసుకను తీసుకుని గంగానదిలో పోస్తున్నాడు. అతనిని చూసిన యవక్రీతుడు ఆశ్చర్యానికి గురైనాడు. ఇలాంటి వ్యర్థ ప్రయత్నం ఎవరైనా చేస్తారా? అని తనలో తనే ప్రశ్నించుకున్నాడు. అంతేకాక ఆ వృద్ధుడితో మాటలు కలిపాడు.

**“శతవర్ష వృద్ధుడవు నీ**
**వతి కృశుడ వశక్యమైన యర్థమునందా**
**స్థతయేల సేసి కడు దు**
**ర్మతివైతిం?కెన్నడిది సమాప్తి బొందున్?”**

**–258ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''అయ్యా! నీవు చూస్తుంటే శత వృద్ధుడిలాగా కనిపిస్తున్నావు. ఎంతగానో కృశించిపోయిన శరీరంతో ఈ పని చేస్తున్నావు? పిడికిళ్ళతో ఇసుక పోసినంత మాత్రాన ఈ గంగానదికి ఆనకట్ట కట్టగలననుకుంటున్నావా? ఇది అసాధ్యమని, దుష్కార్యమని తెలుసుకోలేకపోయావా? ఇటువంటి లక్ష్యం పట్ల నీకు ఆసక్తి ఎందుకయ్యా? ఈ ఆనకట్ట నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందంటావు? నీ యీ జన్మ సరిపోతుందంటావా?'' అని వృద్ధుని ఎగతాళి చేశాడు. అప్పుడు ఇంద్రుడు యవక్రీతుడికి తన నిజ రూపాన్ని చూపించి ''నేను కూడా చేయశక్యం కాని పనియందు ఆసక్తితో ఉన్నావన్న విషయం తెలియజేయడానికే ఈ వృద్ధుని రూపంతో నీకు కనిపించాను. ప్రయోజన రహితమైన పనిని చేసి ఎందుకు చేతకానివాడివి ఔతావు? నీవు చేస్తున్న ఈ తపస్సునికనైనా విరమించు'' అని చెప్పడంతో యవక్రీతుడు తన దృఢాభిప్రాయాన్ని మరోమారు తెలియజేశాడు.

''మహేంద్రా! నీవెంత చెప్పినా, ఎన్నివిధాల చెప్పినా, నా ఈ ప్రయత్నాన్ని విరమించుకోలేను. త్రిలోకనాథా! నా కోరిక మన్నించి వరం ప్రసాదించుమని ప్రార్థిస్తున్నాను'' అన్న యవక్రీతుని ప్రార్థన మన్నించి దేవేంద్రుడు అతనికి సకల విద్యలను ప్రసాదించి అంతర్థానం చెందాడు. మహదానంద భరితుడైన యవక్రీతుడు తాను తపో మహిమ వలన సాధించిన విద్యల గురించి – తండ్రి భరద్వాజ మహర్షికి తెలియజెప్పాడు. అందుకు భరద్వాజ మహర్షి కొడుకులో ప్రవేశించిన గర్వాన్ని చూసి సహించలేకపోయాడు. దేవగీతలైన గాథల అర్థాన్ని స్పష్టంగా వాక్రుచ్చాడు.

యవక్రీతా! బాలధి అనే మహర్షి పుత్రశోకంతో అమితమైన బాధతో తపించిపోయాడు. ఆ బాధను తట్టుకోలేక ఉగ్రమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన దేవతలు బాలధికి – ఆ పుత్రుని బ్రతికించి చిరంజీవిగా ప్రసాదించారు. ఆ పుత్రుడి పేరు మేధావి. ఆ మేధావి తనకు తరగని ఆయుస్సు కలదన్న గర్వంతో తపస్సంపన్నులైన మహర్షులను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా వారిని అవమానిస్తూ ఇష్టం వచ్చినట్లు తిరుగుతుండేవాడు. ఒకరోజు 'ధనుషాక్షు'డనే తపోధనునితో గర్వించి అవాకులు చవాకులు పేలాడు మేధావి. మేధావి ప్రేలాపనములకు కోపించిన ధనుషాక్షుడు అతనిని యముని సన్నిధానానికి పంపాడు. కాబట్టి నీవు గ్రహించవలసినదేమిటంటే పుత్రా! ఎంత గొప్ప మహిమాన్వితులకైనా గర్వమనే దానిని వర్జించటం ఎంతో మంచిది. గర్వం చాలా చెడ్డగుణం. అది ఎవరినైనా వెంటనే దహించివేస్తుంటుంది. గర్వాన్ని దూరం చేసినవాడే సజ్జనుడు. కనుక యవక్రీతా! ఒకటి చెబుతున్నాను విను. మొదటగా గర్వాన్ని వదిలివేయి. తర్వాత కోపాన్ని వర్జించు. పరమ శాంతులైన రైభ్యుని కొడుకులను చూసి ఈర్ష్య పొందకు. వారితో మైత్రి పాటించు'' అని భరద్వాజ మహర్షి పుత్రునికి బోధించాడు. తండ్రి మాటలకు అంగీకరిస్తూ ''మీరు చెప్పినట్లే నిగర్విగా ప్రవర్తిస్తాను. రైభ్యముని నాకు తండ్రి వంటివాడే. భడత్సమానుడు కదా'' అని యవక్రీతుడు తన విద్యా ప్రాభవాన్ని అంతటినీ మహర్షుల సభలలో చేస్తుండేవాడు. ఒకనాడు రైభ్యాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ ఒక దృశ్యాన్ని చూసి విచలితుడైనాడు.

**“కోమల కీర షట్చరణ కోకిల నాద మనోహరంబు ను**
**ద్దామవసంత పుష్పభరిత క్షితిజ ప్రకరంబు నైన యా**
**రామము నందుఁ జూచె ముని రాజకుమారుడు రైభ్యుకోడలిం**
**దామరసాక్షిఁ గృష్ణయను దానిఁ బరావసు భార్యఁ బ్రీతితోన్”**

**–262 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''ఆ ఆశ్రమం అతి మనోహరంగా కనిపించింది యవక్రీతుడికి. చూసిన కొద్దీ చూడాలనిపిస్తోంది. చిలుకల, కోకిలల, తుమ్మెదల మృదువైన నాదాల చేత నిండి వుంది ఆ ఆశ్రమం. సుకుమారమై, పరిమళభరితమైన పుష్పాలతో, రకరకాల పండ్ల చెట్లతో శోభాయమానంగా ఉంది. వసంత ఋతువు ప్రవేశించిందా అన్నట్లు రకరకాల అందాలను చిందిస్తున్న ఆ ఆశ్రమ ప్రాంతంలో యవక్రీతుడు–రైభ్యునికోడలు,పరావసుని భార్య,పరమసుందరి, తామరసాక్షి (పద్మాల రేకుల వంటి కన్నులు కలది) అయిన 'కృష్ణ' అనే పేరుగల యువతిని చూసి అనురాగభరితుడైనాడు. మోహావేశుడైన యవక్రీతుడు తన మనోభిప్రాయాన్ని ఆమెకు తెలియజెప్పాడు. అప్పుడు 'కృష్ణ' భరద్వాజ మునికుమారుడు తాను కాదంటే ఎక్కడ శాపం పెడతాడో అనే భయంతో అప్పటికి

తగినట్లు సంభాషించి, త్వరత్వరగా మామగారి దగ్గరకు వెళ్ళింది.

**"తన మామకు తద్వృత్తాం**
**తము నంతను దెలియఁజెప్పి తరుణి విలోలా**
**క్షములందు బాష్పసలిలో**
**ద్గమముగ తల వాంచి యుండె కడు కోపమునన్"**

**–264 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

కృష్ణతనమామగారైనరైభ్యమహర్షికిజరిగినవృత్తాంతమంతా తెలియజెప్పింది. ఓర్చుకోలేని కోపంతో కళ్ళవెంబడి నీళ్ళు కారుతుండగా ప్రక్కగా నిలబడి ఉండిపోయింది. తలవాల్చి కోపాశ్రువులతో నిల్చుండి ఉన్న కోడలిని చూశాడు రైభ్యుడు. ఆయనలో కోపం కట్టలు తెంచుకుంది.

''అప్పుడు రైభ్యుడేం చేశాడో తెలుసా మునులారా?'' అని సూతమహర్షి అడగగానే ఒక ముని లేచి ''ఏం చేశాడు స్వామీ? యవనక్రీతుని శాపానికి గురి చేశాడా? అయినా యవక్రీతుడు చేసిన పనికి ఆతనికి అంతకన్నా పెద్దశిక్షే పడాలి'' అన్న ఆతనివైపు చూస్తూ ''అవును నాయనా! భరద్వాజుని పుత్రుడికి పెద్దశిక్షే పడింది. అదేమిటో చెబుతాను వినండి'' అంటూ మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు సూతమహర్షి.

రైభ్యుడికి వచ్చిన కోపానికి యవక్రీతుడు మసి కావల్సిందే. చివరకు అదే జరిగింది. రైభ్యుడు – అగ్నిజ్వాలతో సమానమైన ఒక జడను శిరస్సునుండి చేతితో లాగి అగ్నిహోత్రంలో వేల్చాడు. అప్పుడు అగ్నికుండంలో నుండి ఆయన కోడలైన కృష్ణ కన్న మిన్ననైన సౌందర్యవతిని, తేజోవతిని తన తపోమహిమతో ఆవిర్భవింపచేశాడు. అంతటితో రైభ్యుని కోపావేశం తగ్గలేదు. మరొక జడను తలనుండి లాగి అగ్నిలో వేల్చాడు. నిష్ఠాగరిష్ఠుడైన ఆ మహర్షి తపోమహిమ వల్ల వికృతరూపుడు, శూలహస్తుడు అయిన ఒక రాక్షసుడు హోమకుండం నుండి ఉద్భవించాడు. హోమకుండం నుండి జనించిన ఆ ఇద్దరూ రైభ్యుని వద్దకు వచ్చి, మహర్షికి నమస్కరించి 'మేము చేయవలసిన పని ఏమిటో నిర్దేశించండి' అని అడిగాడు. దానికి రైభ్యుడు 'అవినీతుండైన యవక్రీతుని వధియింపు'డని పంపించాడు. రైభ్యుని ఆజ్ఞానుసారం మొదటగా జన్మించిన అతిలోక సౌందర్యవతి అయిన ఆ జవ్వని యవక్రీతుడి వద్దకు వెళ్ళింది. మోహావేశుడైన, అధీనం తప్పిన మనసుతో దిగులు చెందినవాడైన యవక్రీతుని చూసి వలపు మాటలతో ఆతనిని ఉత్తేజపరుస్తూ అతని చేతిలో ఉన్న కమండలాన్ని క్షణంలో కైవసం చేసుకుంది. ఎప్పుడైతే కమండలం అపహరింపబడిందో ఆ క్షణంలోనే యవక్రీతుడు అపవిత్రుడైపోయాడు. భరద్వాజ మహర్షి సుతుని తపోమహిమ అంతా శక్తిహీనమైపోయింది. అది గమనించిన రాక్షసుడు యవక్రీతుడిపై దాడి చేశాడు. రాక్షసుడి బలానికి భయపడిపోయిన యవక్రీతుడు పారిపోసాగాడు. ముందుగా మహానదులలో మునిగాడు. తరువాత సరోవరాలలో దాక్కున్నాడు. కాని నదులు, సరస్సులూ అతని అపవిత్రతకు ఎండిపోయాయి. రాక్షసుడు వెంటబడి తరుముతుండగా తట్టుకోలేక యవక్రీతుడు తండ్రి అయిన భరద్వాజ మహర్షి అగ్నిశాలలోకి ప్రవేశించి అక్కడ దాక్కున్నాడు.

**"మునికుమారు నెగిచికొని వచ్చి నిశిత శూ**
**లాయుధమునఁ బొడిచి యాసురమున**
**రక్కసుండు, చంపి, యక్కాంతయును దాను**
**నరిగె రైభ్యు కడకు నాక్షణంబ"**

**–271 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

భరద్వాజముని కుమారుడైన యవక్రీతుని తరుముకుంటూ వచ్చిన రాక్షసుడు వాడియైన శూలాయుధంతో క్రూరంగా పొడిచి చంపాడు. రాక్షసుడు తాను వచ్చిన పని అయిపోవడంతో, రైభ్యుడు పుట్టించిన వనితతో కలిసి రైభ్యుని వద్దకు వెళ్ళాడు. వారిద్దరినీ చూసిన రైభ్యుడు కృత్తిని రాక్షసునికి భార్యగా ఇచ్చి వారిని పంపివేశాడు.

భరద్వాజ మహర్షి అరణ్యం నుండి ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. కాని రోజులాగా ఆయన అగ్ని గృహంలోని అగ్నులు జాజ్వల్యామానంగా వెలుగుతూ ఆయనకు స్వాగతం చెప్పలేదు. అణిగి ఉండటంతో అగ్నులను చూసిన మహర్షి ఆశ్చర్యపోయాడు ఏమయిందా అని. ఆశ్రమ సేవకుని అడిగి జరిగిన విషయమంతా తెలుసుకున్నాడు. పుత్రుని మరణానికి ఎంతగానో పరితపించాడు.

**"రైభ్యుడధిక కోపరతుడంటి, నమ్ముని**
**యాశ్రమంబు దెసకు నరుగవలవ**
**దంటి; వినగ నొల్లవైతి నా పలుకులు;**
**గర్వితునకు బుద్ధి కాననగునె?"**

**–273 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

భరద్వాజ మహర్షిలో శోకం కట్టలు తెంచుకుంది. కుమారుడితో తానంతకు ముందు చెప్పిన మాటలన్నీ గుర్తుకు వచ్చి మరింత శోకతప్తుడైనాడు భరద్వాజుడు. ''పుత్రా! యవక్రీతా! రైభ్యుడు పరమకోపిష్ఠివాడని నీకెన్నిసార్లు చెప్పాను? ఆతని ఆశ్రమం వైపుకు వెళ్ళవద్దని చెప్పిన విషయాన్ని మరచిపోయావా నాయనా! నువ్వు నా మాటలు పట్టించుకోక ఆపదలపాలైనావు. ఎంత చెప్పినా వినని గర్విష్ఠికి సద్బుద్ధి కలుగుతుందా? ఎప్పటికీ కలుగదు'' అని రకరకాలుగా విలపించసాగాడు ఆ తండ్రి. తన దుఃఖానికి అంతం ఉండదనుకొన్న భరద్వాజ మహర్షి పుత్రునికి దహన కార్యక్రమాన్ని నిర్వహించి తన దురదృష్టానికి వాపోయాడు. పుత్రశోకాన్ని సహించలేకపోయిన ఆ మునిపుంగవుడు ఆ చితాగ్నిలో పడి శరీర త్యాగం చేశాడు. ఆ విధంగా ''తండ్రీ కొడుకులిద్దరూ మరణించడంతో కథ



అంతమైనదనుకొంటున్నారేమో! లేదు. యవక్రీతుడి చరిత్ర ఇంకా కొనసాగడంతో ఆశ్చర్యం కలుగుతుంది'' అని శ్రోతలవైపు పరిశీలనగా చూశాడు సూతమహర్షి. మునులు కూడా 'ఇంకా ఉందా!' అంటూ విస్మితులయ్యారు. సూతుడు మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

మునులారా! రైభ్యుని పుత్రులైన అర్ధావసు పరావసులకు ఈ విషయాలేవీ తెలియవు. అంతకుముందే వారిద్దరూ తండ్రి అనుమతితో బృహద్యుమ్నుడనే రాజు చేసే సత్త్ర యాగానికి, ఆ రాజు కోరిక మేరకు ఋత్విజులుగా వెళ్ళారు. ఒకనాడు పరావసుడు ఆశ్రమానికి వెడదామని బయలుదేరాడు. అడవి నుండి వస్తున్న పరావసుడికి చీకటిలో ఎదురుగా వస్తున్న రైభ్యుడు – రైభ్యుడిగా కనబడలేదు. ఎదురుగా వస్తున్నది – ఒక పెద్ద క్రూరమృగంగా కనిపించాడు. ప్రాణభీతితో మృగమే అనుకొని రైభ్యుని వధించాడు పరావసుడు. వెలుగులోకి వచ్చిన తరువాత – తాను చంపింది తండ్రినే అని తెలుసుకొన్న పరావసుడు దుఃఖంలో మునిగిపోయాడు. ఏం చేయటానికీ పాలుపోలేదు. ఏడ్చి ఏడ్చి చివరకు తండ్రికి దహన కార్యక్రమాలన్నీ చేశాడు. తిరిగి అన్న ఉన్న యజ్ఞశాలకు వెళ్ళాడు. అన్నను చూసి తన వల్ల జరిగిన పితృవధను గురించి ఆద్యంతం చెప్పి భోరుమని ఏడ్చాడు. కొంతసేపటికి దుఃఖాన్ని దిగమ్రింగుకొని, ''అన్నా! ఒక సంగతి చెబుతాను విను. ఈ మహాయజ్ఞ కార్యాన్ని నీవు ఒక్కడివే నిర్వహించలేవు. నేను ఒక్కడినే అయినా యాగాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా నిర్వహించగలను. అందుచేత నాకు బదులు నీవు బ్రహ్మహత్యను పోగొట్టే మంచి వ్రతాన్ని చేయి'' అని అన్న తమ్ముడి మాటలనంగీకరించి అర్ధావసుడు బ్రహ్మహత్యా వ్రతాలు యథావిధిగా చేయసాగాడు. పరావసుడు ఒక్కడే సత్రయాగాన్ని బృహద్యుమ్నుని చేత చేయిస్తున్నాడు. అర్ధావసుడు బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తములైన వ్రతాలనన్నిటినీ చేసి, సత్త్రయాగం వద్దకు వచ్చాడు. పరావసుడు అన్నను చూసి రాజుతో –

**"ఇమ్ముని నీ యజ్ఞాయత**
**నమ్ము ప్రవేశింప తగడు నరనాయక; యు**
**గ్రమ్ముగ సలిపెడు శుభకా**
**ర్యమ్ములకుం బాసి బ్రహ్మహత్యావ్రతముల్"**

**–277 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

అని అన్నాడు. ''మహారాజా! ఈ ముని నీ యజ్ఞశాలలోకి ప్రవేశించటానికి అర్హుడు కాదు. ఎందుకంటావేమో! విను. ఈ ఋషి శుభకార్యాలు చేయటం మాని, బ్రహ్మహత్యా పాతకాన్ని పోగొట్టే వ్రతాలను చేస్తున్నాడు'' అని పరావసుడనగానే బృహద్యుమ్న మహారాజు తన అనుచరుల వైపు చూసి 'ఇతనిని లోపలకు రానివ్వవద్ద'ని సైగ చేశాడు. వెంటనే రాజభటులు అర్ధావసుని యజ్ఞశాల లోనికి రాకుండా అడ్డుకున్నారు. తనకు జరిగిన అవమానానికి బాధపడుతూ అర్ధావసుడు వారిని చూసి ''బ్రహ్మహత్యా పాతకానికి గురైంది పరావసుడు కాని, నేను కాదు. అతని కోసం వ్రతాలు చేసి అతని బ్రహ్మహత్యా పాతకం (పాపం) నుంచి విడుదల చేశాను'' అన్న అర్ధావసుని సత్యవాక్కులకు అగ్నిని ముందుపెట్టుకొని ఉన్న దేవతలు మెచ్చుకుని అర్ధావసుని ముందు ప్రత్యక్షమైనారు. తమకు నమస్కరించిన అర్ధావసుని చూచి దేవతలు –

**"తమ్ము చేసిన దురితముల్ తలగఁ బూని**
**ధర్మబుద్ధివై వ్రతములు పేర్మిఁ జరిపి**
**తనఘ! నీకు నభీష్టంబులైన వరము**
**లడుగు మిచ్చెద; మీ మెచ్చు గడవదగునె!"**

**–279 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''ధర్మబుద్ధితో తమ్ముడు చేసిన పాపకార్య ఫలితాలను తొలగించటానికి పూనుకొన్నవాడివై ఎన్నో సద్వ్రతాలను చక్కగా నిర్వహించావు. తమ్ముడి మీద నీకున్న ప్రేమ శ్లాఘనీయం. పాపరహితుడవైన అర్ధావసు మహర్షీ! నీ ఘనత ప్రశంసనీయం. ఉన్నతమైన నీ ప్రవర్తన వరాలకు అర్హమైనది. నీకిష్టమైన వరాలను కోరుకో. సంతోషంగా ఇస్తాము'' అని ప్రసన్నులయిన దేవతలు అర్ధావసు ధర్మనిరతిని అందరిముందు పొగడగా అర్ధావసు వారికి నమస్కరించి వినమ్రుడైనాడు. ''పుణ్యపురుషులైన దేవతలారా! మీరు నామీద కృప వహిస్తే నా కోరికను విన్నవిస్తాను. నా తండ్రి అయిన రైభ్యుని, భరద్వాజ మహర్షిని, యవక్రీతుని మునుపటిలాగా జీవించి యుండే విధంగా వరం కోరుతున్నాను. జనకుని వధించిన పరావసుని పాపం పరిహరింపబడేటట్లు వరాన్ని అనుగ్రహించండి. పూజ్యులారా! మీరు ఈ రెండు వరాలు ప్రసాదిస్తే చాలు. నాకింకే వరాలు వద్దు. మీరు నాయందు దయ తలచి ప్రత్యక్షమై నన్ను వరాలు కోరుకోమన్నారు. ధన్యుడినయ్యాను. మీరు నాకు రెండు వరాలూ

ప్రసాదించారు'' అని అర్థావసుడు తిరిగి నమస్కరించాడు. దేవతల అనుగ్రహవం వల్ల అర్థావసుడు – రైభ్యుని, భరద్వాజుని, యవక్రీతుని పునర్జీవితులను చేసి కృతార్థుడైనాడు. యవక్రీతుడు దేవతలను చూసి తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

''మహాత్ములారా! నేను వేదాలన్నిటినీ తెలుసుకొన్నాను. అనేక శాస్త్రాలను కూలంకషంగా తెలిసినవాడిని. దేవతా సంబంధమైన వ్రతాలనన్నింటినీ దీక్ష వహించి చేసినవాడిని. సమస్త విద్యలలో ఆరితేరినవాడిని. అటువంటి నేను రైభ్యుని చేతిలో ఎందువల్ల హతుడనైనాను? ఎందువల్ల రైభ్యుడికి నాకన్నా ఎక్కువ శక్తి లభించింది? అదీ, నన్ను హతమార్చేటంత విధంగా! నేను అతనిని మించాలంటే ఏం చేయాలి? దయచేసి నా అనుమానాన్ని తీర్చండి'' అని ప్రార్థనాపూర్వకంగా అడిగాడు యవక్రీతుడు. దానికి సమాధానంగా దేవతలు –

**"గురు శుశ్రూష యొనర్చుచు**
**పరమక్లేశమునఁ జేసి పడసిన విద్యల్**
**స్ఫురియించుఁ గాక; గురుముఖ**
**విరహితముగఁ బడసినవియు వెలయునె యెందున్"**

**–282 ప – తృతీయాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''యవక్రీతా! విను. గురువుకు పరిచర్యలు చేస్తూ, అధిక శ్రమను సహించి గురువునుంచి పొందిన విద్యలు ఆ శిష్యుడికి వెంటనే స్ఫురిస్తాయి కాని గురువు చెబుతుండగా విని నేర్చుకోని విద్యలు ఎక్కడైనా ప్రకాశిస్తాయా? నీవు గురు ముఖతః చెప్పబడిన విద్యలను అభ్యసించకుండా వేరేవిధంగా (తపస్సు ద్వారా – యజ్ఞం ద్వారా) విద్యలను పొందావు. అందుకే నీవు నేర్చిన విద్యలు నిర్వీర్యమై నీకు ఉపయోగపడలేదు. గురువును సంతోషపెట్టిన రైభ్యుడు బ్రహ్మజ్ఞానాన్ని సముపార్జించాడు (పొందాడు). బ్రహ్మజ్ఞాని కావటం వల్లనే రైభ్యుడు నీకంత శిక్ష విధించగలిగాడు. ఇప్పటికైనా గురుముఖతః వచ్చే విద్య నభ్యసించటం ఎంత గొప్పదో తెలుసుకో'' అని చెప్పి దేవతలు అదృశ్యులైనారు. దేవతలచేత బోధింపబడిన యవక్రీతుడు తన అజ్ఞానానికి బాధపడి. కొంతకాలం జరిగిన తరువాత దీర్ఘ తపస్సులో నిమగ్నుడైనాడు'' అని చెప్పి సూతమహర్షి వేదిక నుండి లేవడంతో మునులందరూ లేచారు. గురుముఖతః విద్య నేర్చుకోవడం ఎంత గొప్పదో విన్నారు గదా! యవక్రీతుడు తపస్సుతో మహర్షి కాగలిగాడు. ఆయన నివాస స్థానం ఇప్పటికీ అడుగు పెట్టినవారిని పునీతుల్ని చేస్తుంది'' అని సూతుడు నడవడంతో అందరూ ఆయనను అనుసరించారు. **(సశేషం)**

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



**'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.**

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిపే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా



**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
**(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)**
**ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.**
**ఫోన్: 040-27175050, సెల్: 9348212354**
**Email: srivenkatesham@gmail.com**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

## అనునయింపు

విన్నది తార. నడిచింది. అడుగులు తడబడుతున్నాయి. తాగిన మత్తు కన్నుల్లో కనబడుతోంది. వడ్డాణం, మొలనూలు వేలాడుతున్నాయి. జుట్టు చెదిరి వుంది. చీరకొంగు జారిపోయింది. సంభోగ లక్షణాలు స్పష్టంగా కనబడుతున్నాయి. స్తనభారంతో వంగింది. లక్ష్మణుని కొడుకులా భావించింది. సిగ్గు పడలేదు. బిడియపడలేదు. సమీపించింది సౌమిత్రిని.

చూశాడు లక్ష్మణస్వామి. ఆమె సౌందర్యం చూశాడు, వేషం చూశాడు. ఏం తోచలేదు. తల వంచుకున్నాడు. కోపం పోయింది. అతనిలో ప్రసన్నతని చూసిందామె. స్నేహాతిశయంతో ధైర్యంతో ప్రేమపూరితంగా అంటోంది.

రాజపుత్రా! నీ కోపానికి కారణమేమి? నీ మాట మీరిందెవరు? దావాగ్నిలో పడాలని ఎవరు అనుకున్నారు? ఆమె స్వరంలో తాగిన మత్తు ఉంది. కానీ ఓదార్పు తొంగి చూస్తోంది.


విన్నాడు సౌమిత్రి. ‘‘తారా! నీ మొగుడు ధర్మం విడిచాడు. నీకు తెలియదా? రాజకార్యాలు మానేశాడు. నీకు తెలియదా? మధుపాన మత్తుడైనాడు. నీకు తెలియదా? సుఖభోగాల్లో మునిగాడు. నీకు తెలియదా? శోకమగ్నులం మేం. మా విషయం మరచారు. ప్రియురాండ్రతో కులుకుతున్నాడు. మంత్రులతో తాగుతున్నాడు. చిందులేస్తున్నాడు. నాలుగు నెలలు ముగిశాయి. సీతాన్వేషణ మాట ఏమైంది? ధర్మార్థ సిద్ధికి ప్రయత్నించేవాడు మధుపాన లోలురు కారాదు. ఉపకారికి ఉపకారం చేయకపోవడం అధర్మం. గుణవంతుడైన మిత్రుణ్ణి పోగొట్టుకోవాలనుకోవడం దౌర్భాగ్యం. రాజపత్నీ! సుగ్రీవుడు కాలయాపన చేశాడు. నీవు కార్య స్వరూపం తెలిసినదానవు. మేం ఏం చేయాలో చెప్పు’’.

విషయం అర్థమైంది తారకు. రాముడతణ్ణి ఎందుకు పంపాడో తెలిసింది. కాలాతీతమైనట్లు గుర్తించింది. అయినా అతనికి నమ్మకం కలగాలి. అందుకే అంటోంది. ఆమె మాట్లో వాక్చాతుర్యం బయటపడుతోంది. ‘‘రాజకుమారా! ఇది నీ కోపానికి సమయం కాదు. సజ్జనులకు ఆ కోపం తగదు. మీరు బలశాలురు. సుగ్రీవుడు బలహీనుడు. అతనిపై కోపమా? ఏం ప్రయోజనం? పొరపాటు జరిగింది. సహించు. అది వీరుల లక్షణం. నాయనా! అన్వేషణలో ఆలస్యమైంది. అది నాకు తెలుసు. నీ కోప పారవశ్యం చూశాను. కామ పారవశ్యం తెలియదు నీకు. కామ పరతంత్రకి దేశకాల నియమాల్లేవు. అసలు అవి తెలియవు. ధర్మార్థాలు ఆలోచించరు వాళ్ళు. సుగ్రీవుడు నీకు సోదరుడు అనుకో. అతణ్ణి క్షమించు. ఇంతకాలం అడవుల్లో తిరిగాడు. స్త్రీ సుఖం ఎరుగడు. ఇపుడు స్త్రీ

జనం లభించింది. కామోద్రేకం పొంగి పొర్లింది. పరవశుడైనాడు. సిగ్గు లజ్జ వదిలేశాడు. నాతో కూడినాడు. సుఖించాడు. అపరాధం చేశాడు. క్షమించు''.

''ధర్మాచరణ పరాయణులు నిరంతర తపశ్చర్య పరాయణులు మహర్షులు. వాళ్ళు కూడా కామానికి బానిసలవుతారు. ఇక సుగ్రీవుడు వానరుడు. చపలుడు. పైగా రాజు. సుఖభోగ లాలసుడైనాడు అంటే ఆశ్చర్యం లేదు. నాయనా మీ కార్యం విషయంలో పరాకు పడలేదు. సీతాన్వేషణకి ప్రయత్నాలు చేశాడు. అనేక ప్రాంతాల్లో ఉన్నారు వానర వీరులు, భల్లూక వీరులు. అందరినీ రమ్మని ఆజ్ఞాపించాడు. త్వరలో కోట్లాదిమంది వస్తారు. మహాబాహూ! పరస్త్రీలను చూడరాదనుకున్నావు. నీ సదాచారం గొప్పది. నీ సత్ప్రవర్తన గొప్పది. కాని మిత్రుల భార్యల్ని చూడవచ్చు. దోషం కాదు. నాతో లోపలికి రా. సుగ్రీవుణ్ణి చూడు. మాట్లాడు.

లక్ష్మణస్వామి నడిచాడు. అంతఃపురం లోకి వెళ్ళాడు. దివ్యమాలలు ధరించాడు సుగ్రీవుడు. దివ్య ఆభరణాలు ధరించాడు. దేవేంద్రునిలా ఉన్నాడు. బంగారు సింహాసనం మీదున్నాడు. రుమని కౌగలించుకొని ఉన్నాడు. చుట్టూ స్త్రీలున్నారు. చూశాడు వానర రాజుని. పరమ కుపితుడైనాడు సౌమిత్రి. కనులు నిప్పు కణాలైనాయి. కాలాంతకునిలా కనిపించాడు. అతణ్ణి చూశాడు సుగ్రీవుడు. తుళ్ళాడు. ఎగిరి పడ్డాడు. ఇంద్ర ధ్వజంలా పైకి లేచాడు. నిశ్చేష్టుడైనాడు. పూర్ణచంద్రుని వెనుక నక్షత్రాలు కదలినట్లు స్త్రీలందరూ లేచారు. నిలుచున్నారు. పెద్ద కల్పవృక్షంలా చేతులు జోడించాడు సుగ్రీవుడు. లక్ష్మణస్వామి కోపం ద్విగుణీకృతమైంది.



## సౌమిత్రి ఆగ్రహం

సుగ్రీవా! సత్కుల సంజాతుడు, బలవంతుడు, జితేంద్రియుడు, దయాహృదయుడు, కృతజ్ఞుడు అయిన రాజుని అందరూ పూజిస్తారు. నీలాంటి అధర్మపరుడు, మిధ్యాప్రతిజ్ఞుడు, పాపిష్టుడు, కృతఘ్నుడు మరొకడు ఉండడు. బ్రహ్మ హత్యకి పాల్పడినవానికి, మద్యపానం చేసినవానికి, దొంగతనం చేసినవానికి, వ్రతభంగం కావించినవానికి ప్రాయశ్చితం చెప్పారు పెద్దలు. కాని కృతఘ్నునికి చెప్పలేదు. నీచుడవని తెలియక – నిన్ను ఈ రాజ్యానికి రాజుని చేశాడు రాముడు. నీవు కృతజ్ఞుడవైతే ఈ పాటికి సీతాన్వేషణలో ఉండేవాడివి. సుగ్రీవా! ప్రతిజ్ఞ మీద నిలబడు. వాలి మాదిరి పోవద్దు''.

## శాంతించు

అంతా విన్నది తార. లక్ష్మణస్వామితో అంటోంది. ''నీవు పరుషంగా మాట్లాడావు. అది తగదు. ఇతడు వానరరాజు. పైగా మిత్రుడు. కృతఘ్నుడు కాడు. వంచకుడు కాడు. క్రూరుడూ కాడు. కుటిలుడూ కాడు. అబద్ధాలాడేవాడు కాడు. రామానుగ్రహంతో ఈ రాజ్యాన్ని పొందాడు. రుమను నన్నూ పొందాడు. నాయనా! సుగ్రీవుడు రాళ్ళమీద రప్పలమీద బతికాడు. ఒంటరితనాన్ని అనుభవించాడు. ఇపుడు సుఖాలకు అలవాటు పడ్డాడు. విశ్వామిత్రుడు మేనకతో పదేళ్ళు గడిపాడు. ఆ మహర్షికి కాలం తెలియరాలేదు. అలాగే సుగ్రీవుడు కామభోగాల్లో మునిగాడు. కాలాన్ని మరచాడు. నీవు అతణ్ణి క్షమించు''.

''అసలు విషయం తెలియదు నీకు. హఠాత్తుగా కోపవశుడవైనావు. ధర్మం తెలిసినవాడవు. శాంతించు. సుగ్రీవుని కోసం నేను ప్రార్థిస్తున్నాను. రామకార్యార్థం రుమను నన్ను రాజ్యాన్ని త్యజిస్తాడు. ఇది నిజం. యుద్ధంలో రావణుని చంపుతాడు. రోహిణిని చంద్రునికి అప్పగించినట్లు సీతాదేవిని రామసన్నిధి చేరుస్తాడు''.

''లక్ష్మణా! లంకా పట్టణంలో వేల కోట్ల రాక్షసులున్నారు. ఇంకా అనేక ప్రాంతాల్లో వున్నారు. అందరూ కామరూపులు. బలవంతులు. ఎవరికీ భయపడరు. ఇవన్నీ వాలి చెప్పాడు నాకు. అంతమందిని చంపితేకాని రావణుని హతమార్చడం సాధ్యం కాదు. వానరసేన సహాయం అవసరం. ఒక్క సుగ్రీవునికి అది అశక్యం. ఒంటరిగా దాడికి దిగరాదు. అపారసేనకి పిలుపునిచ్చాడు. వారి కోసం కొందరు వెళ్ళారు. అందుకోసం సుగ్రీవుని నిరీక్షణ. ఆ కోట్లాది వానర వీరుల్ని, భల్లూక వీరుల్ని కొండముచ్చుల్ని త్వరలో చూస్తావు''.

వాలి వధ చూశారు. ఆ భయంలో వానర స్త్రీలు ఉన్నారు. గజగజ వణికి పోతున్నారు. నిన్ను చూశారు. ఇంక ఎలాంటి ప్రమాదం రాబోతోందో అని శంకిస్తున్నారు. నీ ముఖాన్ని ఎఱ్ఱబారిన కన్నుల్ని చూశారు. ఆందోళన చెందుతున్నారు.

## క్షమించు

సహజంగా మృదుస్వభావి లక్ష్మణుడు. అన్నగారి విరహ ప్రభ చూశాడు. బాధపడ్డాడు. కోపించాడు. సుగ్రీవుని వద్దకు వచ్చాడు. కఠినంగా మాట్లాడాడు. తార మాట్లాడింది. విన్నాడు. ఆమె మాటలు వినయంగా ఉన్నాయి. ధర్మబద్ధంగా ఉన్నాయి. హేతుబద్ధంగా ఉన్నాయి. నిజం చెప్పిందామె. ఒప్పుకున్నాడు. ఇపుడాతని ముఖం ప్రసన్నమైంది. చూశాడు సుగ్రీవుడు. తడిబట్టని పిండితే నీరంతా కారిపోతుంది. ఇంతసేపు భయపడ్డాడు వానరరాజు. ఇపుడా భయమంతా పోయింది. అతని మెడలో పూలమాలలున్నాయి. అవి చిత్ర విచిత్రాలు. సుగంధ భరితాలు. ఆ మాలల్ని తెంచేశాడు. మత్తు దిగిపోయింది. అది మన్మథ వ్యాపారాలన్నీ త్యజించినట్లు సంకేతం.

నడిచాడు. సౌమిత్రిని సమీపించాడు. ''లక్ష్మణా! నాకు లభించిన ఈ రాజ్యం ఈ సుఖాలు అన్నీ రామానుగ్రహమే. రాముడు లోక విఖ్యాతుడు. నా పాలిట దేవుడు. అతను చేసిన ఉపకారం గొప్పది. ప్రత్యుపకారం చేసే సమర్థుడు. ఈ లోకంలో ఉన్నాడా? రామునికి ఇతరుల సాయం అక్కర్లేదు. తన పరాక్రమంతో రాణుని హతమారుస్తాడు. నా సహాయం నిమిత్తమాత్రమే. జైత్రయాత్రలో రాముని వెంట నడుస్తాను. స్నేహంతో కాని నమ్మకంతో కాని చనువుతో కాని నేను హద్దు మీరి ఉండవచ్చు. ఈ భృత్యుడు క్షంతవ్యుడు. న కశ్చిత్ నా పరాధ్యతి – లోకంలో తప్పు చేయని వాడెవడు?''

విన్నాడు లక్ష్మణస్వామి. సంతుష్టుడైనాడు. ప్రేమపూర్వకంగా ''సుగ్రీవా! నీవు వానరేశ్వరుడవు. వినయవంతుడవు. సమర్థుడవు. రామునికి తోడుగా ఉన్నావు. మా అన్నకి కుడిభుజం లాంటివాడవు. రాజ్యలక్ష్మిని అనుభవించతగినవాడు. నీ సాయంతో యుద్ధం చేస్తాడు రాముడు. శత్రు సంహారం చేస్తాడు. సందేహం లేదు. నీ తప్పు నీవు తెలుసుకున్నావు. నిష్కపటివి. నిర్మల మనస్కుడవు. అన్న దుఃఖం చూశాడు. బాధపడ్డాను. కఠినంగా మాట్లాడాను. ఏమీ అనుకోవద్దు. నాతోరా. రాముణ్ణి ఊరడించు. ధైర్యం చెప్పు''.

ఎవరైనా తప్పు చేస్తారు. చేసిన తప్పును ఒప్పుకోరు. అలా ఒప్పుకున్నవాడు ఉత్తముడు. సుగ్రీవుడు తన దోషాన్ని కప్పి పుచ్చుకోలేదు. ఒప్పేసుకున్నాడు. ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే – కొందరు పూజ గంటల తరబడి చేస్తారు. ఆర్భాటానికో మెప్పుల కోసమో ఎన్నో నైవేద్యాలు సమర్పిస్తారు. అవి దేవుడు తినడు. ఎంతెంత పెట్టావని కాదు ఎలా సమర్పించావని చూస్తాడు. నీ మనసు చూస్తాడు.

మనం చేసిన తప్పులు స్వామి ముందు చెప్పుకోవాలి. పశ్చాత్తాపం చెందాలి. ఏడ్వాలి. మాట్లాడాలి స్వామితో. హృదయంలోని భారం దించుకోవాలి. మళ్ళీ తప్పులు చేయనని చెప్పాలి. అమ్మవారి అనుగ్రహం పొందాలి. స్వామి



కృపకు పాత్రుణ్ణి చేయాలని – అమ్మవారికి నివేదించుకోవాలి. ప్రార్థించాలి. అదే శరణాగతి. అదే పూజ. అదే ఆరాధన. అమ్మవారి ద్వారా స్వామిని చేరాలి. అది భక్తుని తపన. ఇక్కడ తప్పు తెల్సుకున్నాడు. పశ్చత్తాప పడ్డాడు సుగ్రీవుడు. పరమ భాగవతుడు లక్ష్మణస్వామి. అతని ద్వారా రామసన్నిధి చేరాలని రామకృపకు పాత్రుడు కావాలని ఆరాటపడ్డాడు సుగ్రీవుడు.

## సుగ్రీవాజ్ఞ

హనుమంతుణ్ణి పిలిచాడు సుగ్రీవుడు. ''మన వానర వీరుల్ని రమ్మన్నాను. అందుకు కొందరిని పంపాను. వారింకా రాలేదు. ఆలస్యానికి కారణం తెలియదు. నీవూ కొందరిని పంపు అన్నాడు. వానరవీరులు ఎక్కడెక్కడ ఉన్నారో వర్ణించాడు వాల్మీకి. అవి 33 శ్లోకాలు. మహేంద్ర పర్వతం, హిమవత్పర్వతం, వింధ్యపర్వతం, కైలాసపర్వతం, మందరగిరి, ఉదయగిరి, అంజన పర్వతం, మేరుపర్వతం, ధూమ్రగిరి, అస్తాద్రిలో ఉన్నారు వానరులు. ఇంకా అరణ్యాల్లో ఉన్నారు. తాపసాశ్రమాల్లో ఉన్నారు. నదీతీరాల్లో ఉన్నారు. ''హనుమా! ఈ భూమండలం లోని వానరులందరూ రావాలి. 10 రోజులు గడువు. ఇది నా ఆజ్ఞ. అది ధిక్కరిస్తే మరణ దండన'' అన్నాడు మళ్ళీ.

కాటుకలా నల్లగా ఉన్నారు వానరులు. వారు మహా వేగవంతులు. వాళ్ళు మూడుకోట్ల మంది. అంజనాద్రి నుంచి వచ్చారు. బంగారు ఛాయగలవారు 10 కోట్ల మంది. అస్త్రాద్రి నుంచి వచ్చారు. హిమాలయాల నుంచి వేలకోట్ల మంది వచ్చారు. కోట్లాదిమంది వింధ్య పర్వతాల నుంచి వచ్చారు. ఇలా అందరూ గడువులోగా వచ్చారు. కిష్కింధ చేరారు. వానర రాజుని దర్శించారు. దివ్య ఓషధుల ఫల మూలాలు సమర్పించారు. సంతోషించాడు సుగ్రీవుడు. కానుకలు స్వీకరించాడు.

## రామదర్శనం

వానర వీరులను చూశాడు సుగ్రీవుడు. భూమండలంలోని వారందరూ బయల్దేరారు. వచ్చేస్తున్నారని చెప్పారంతా.

వానరులకోసం పంపినవారు శుభవార్త తెచ్చారు. విన్నాడు సుగ్రీవుడు. సంతోషించాడు. వాళ్ళని మాటలతో సమ్మానించాడు. అందరినీ పంపించాడు. రామకార్యం జయప్రదం అవుతుంది. ఆ ధీమా మనసులో కలిగింది. లక్ష్మణుని చూశాడు. రాముని దగ్గరకు వెడదాం అన్నాడు. సేవకుల్ని రమ్మన్నాడు. శిబికని తీసుకురండి. అది అతని ఆదేశం. క్షణాల్లో పల్లకి వచ్చింది. అందమైంది అది. ముందు లక్ష్మణుడు ఎక్కాడు. తర్వాత సుగ్రీవుడు ఎక్కాడు. వాహకులు వచ్చారు. వారు మహాకాయులు. శిబికని ఎత్తారు. భుజాలపై చేర్చారు. నడిచారు. కొందరు శ్వేతపత్రం పట్టారు. కొందరు వింజామరలు వీచసాగారు. శంఖాలు పూరింపబడ్డాయి. భేరీలు మోగాయి. ఎందరో వానరవీరులు వెంట నడిచారు. వారి చేతుల్లో అనేక ఆయుధాలున్నాయి.

ప్రస్రవణగిరి వచ్చింది. ఆగింది పల్లకి. దిగారు ఇద్దరూ. నడిచారు. రామసన్నిధి చేరారు. అంజలి ఘటించాడు వానరరాజు. వినయంతో నిలుచున్నాడు. వానరులందరూ నమస్కరించారు. తలలపై చేతులు జోడించి నిలబడ్డారు. అదెలా ఉందంటే – తామర మొగ్గలతో నిండిన తటాకంలా కనిపించిందన్నాడు వాల్మీకి. శిరసు పాదాలకు తాకేట్లు నమస్కరించాడు వానరరాజు. చూశాడు రాముడు. వెంటనే లేవనెత్తాడు సుగ్రీవుణ్ణి. ప్రేమాతిశయంతో కౌగలించుకున్నారు. అందరూ నేలమీద కూర్చున్నారు. అంటున్నాడు రాముడు.

''వానరవీరా! రాజు అనేవాడు ధర్మాన్ని తెలుసుకోవాలి. అర్థాన్ని తెలుసుకోవాలి. కామాన్ని తెలుసుకోవాలి. ఏయే సమయాల్లో ఏవి అనుభవించాలో తెల్సుకోవాలి. అలా తెల్సుకున్నవాడే రాజోత్తముడు (ఉదయం ధర్మాన్ని – మధ్యాహ్నం అర్థాన్ని – రాత్రి కామాన్ని అనుభవించాలి). శత్రువులపై దండెత్తే సమయంలో కామ భోగాలు అనుభవించరాదు. చెట్టుకొమ్మ మీద పడుకుని నిద్రించేవానిలా కింద పడ్డ తర్వాత మేలుకుంటారు. సుగ్రీవా! దండయాత్రకి ఇదే సమయం. నీ ప్రయత్నాలేమిటో నీ మంత్రులతో ఆలోచించు''.

విన్నాడు సుగ్రీవుడు. ''మహాబాహూ! ఈ సంపద, ఈ కీర్తి, ఈ రాజ్యం నీ అనుగ్రహమే. సీతమ్మ అనుగ్రహమే. ఉపకారికి ప్రత్యుపకారం చేయనివాడు పురుషాధముడు. శత్రుసూదనా! మా వాళ్ళు వెళ్ళారు. వానరుల్ని, భల్లూకాల్ని, గోలాంగులాల్ని పిలిచారు. వాళ్ళంతా దేవ గంధర్వాది అంశజులు. లక్షల కోట్లమంది తరలివస్తున్నారు. అందరూ దేవేంద్ర సమ పరాక్రమవంతులు. కామరూపులు. నీ ఆజ్ఞాబద్ధులు. భ్రాతృ పుత్ర బంధు సహితంగా రావణుని సంహరిస్తారు. సీతాదేవిని తెస్తారు. నీకు సమర్పిస్తారు''.

విన్నాడు రాముడు. సంతోషించాడు. ఆయన నేత్రాలు నల్ల కలువల్లా దర్శనీయమైనాయి.

అయుతం అంటే పదివేలు. అర్బుదమంటే పదికోట్లు. అలా ఒక్కో సంఖ్యకి పదిరెట్లు ఎక్కువ. అవి బృందం, ఖర్వం, నిఖర్వం, పద్మం, శంఖువు, సముద్రం, అంతం, మధ్యం, పరార్థం. మామూలుగా లక్షల కోట్లాది అపారసేన అని చెప్పాలి. లంకలో కూడా లక్షల కోట్లాది రాక్షస సేన ఉంది. ఈ రెండు సేనలు లంకలో యుద్ధానికి సిద్ధమైనాయి. భూమండలంలో అంతసేన నిలవటానికి జాగా ఉండదు. ఇక యుద్ధం మాట దేవుడెరుగు. ఇదంతా వాల్మీకి రచన కాదని ప్రక్షిప్తం అన్నారు వ్యాఖ్యాతలు కొందరు. వానరసేనని లెక్కపెడితే ఒకటి పక్కన 52 సున్నాలు చేర్చితే ఎంత అవుతుందో మొత్తం అంత సేన వుందనాలి. కొందరు వేదంలో వచ్చే సంఖ్య అన్నారు. యజ్ఞవాటిక నిర్మాణానికి ఉపయోగపడే ఇటుకల సంఖ్య అన్నారు కొందరు. త్రేతాయుగాంతంలో అంత జనాభా వుండవచ్చు అన్నారు కొందరు. అంత సేనలు – అదంతా అతిశయోక్తి అన్నారు.

మనిషి ఆయుర్దాయం వందేళ్ళు అనుకుంటే – శైశవే – అభ్యస్త – విద్యానాం – బాల్యం విద్యాభ్యాసం కోసం వినియోగించాలి. యవ్వన్ – విషయేషునాం – యవ్వనం సుఖభోగాల కోసం. వార్ధకే మునివృత్తినాం – వృద్ధాప్యంలో మునిలా మౌనంగా ఉండాలి. యోగినాం తే తనూజ్యనాం – తర్వాత ఒక యోగిలా తనువు చాలించాలి – అది రఘువంశ కాళిదాసు మాట. ఒక్కో వయసులో ఏం చేయాలో సుస్పష్టంగా చెప్పారు మహాకవి. కాని ఈనాడు విద్య వ్యాపారమైంది. చదువుకోవడం లేదు. చదువు కొంటున్నారు కొందరు. పదేళ్ళు నిండకముందే విషయ సుఖభోగాలకు అర్రులు చాస్తున్నారు. వృద్ధాప్యంలో కూడా కామదాసులవుతున్నారు కొందరు. విదేశీ సంస్కృతి జడలు విప్పి పైశాచిక నృత్యం చేస్తోంది. జిజియాబాయి బాల శివాజీకి భారత రామాయణ గాథలు వినిపించింది. మన జాతి వీరుల చరితలు బోధించింది. అలాగే ఈనాటి తల్లితండ్రులు పెద్దలు – తమ పిల్లల పెంపకంలో శ్రద్ధ చూపాలి. మన సనాతన పరమర్షుల సంస్కృతిని భారతీయ సత్ సంప్రదాయల్ని బాల్యావస్థలోనే నూరిపోయాలి. కృతజ్ఞత, పరోపకారం, సౌశీల్యం, పౌరుషం, దేశభక్తి ఇత్యాది సుగుణాలు అలవర్చుకోవాలి.

## అపార వానరసేన

వానరసేనలు త్వరలో వస్తాయి – అది సుగ్రీవుని మాట. దానికి రాముడు అంటున్నాడు 'వానరరాజా! నీవు నా ప్రాణ మిత్రుడవు. నీ సాయం అవసరం. నాకు తోడుగా వుంటే అవలీలగా శత్రువుల్ని జయిస్తాను. పూర్వం అనుహ్లాదుడు పులోమి సాయంతో శచీదేవిని అపహరించాడు. తన భార్యకోసం దేవేంద్రుడు యుద్ధం చేశాడు. అనుహ్లాదుని, పులోమిని చంపాడు. శచీదేవిని తెచ్చుకున్నాడు. అలాగే మారీచుడు సాయపడ్డాడు. రావణుడు సీతని అపహరించాడు. నేను మారీచుని చంపాను. ఇక మిగిలింది రావణాసురుడు. త్వరలో వాణ్ణి హతమారుస్తాను''.

**(సశేషం)**

# నైమిశారణ్యం

ఉత్తరప్రదేశ్ లోని లక్నోకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలో సీతాపూర్ జిల్లాలో నైమిశారణ్యం ఉంది.

నైమిశారణ్య ప్రవేశం సమస్త పాతక నాశనం అని కూర్మపురాణం. నైమిశారణ్య క్షేత్రం గురించి చెప్పాలంటే సూక్ష్మంగా కలియొక్క ప్రభావం లేని ప్రదేశం కోసం మునులు, తాపసులు బ్రహ్మ గారిని ప్రార్థించగా దర్భలతో చేసిన చక్రాన్ని బ్రహ్మగారు వదిలారు. ఆ చక్రం అంతటా తిరుగుతూ వచ్చి ఈ అరణ్య ప్రాంతంలో తిరుగుతూ ఉండగా దానికున్న నిమి ఊడి చక్రం పడిపోయింది. అందువలన ఇది నిమి పడిన క్షేత్రం కాబట్టి నైమిశారణ్యం అయింది. అంటే పుట్టడం–మరణం–పుట్టడం–మరణం–పుట్టడం అనే చక్రం ఆగి పునరావృత్త రహిత శాశ్వత మోక్ష సిద్ధి కలగడానికి ఈ జనన మరణ ఆవృత్తి ఆగిపోవాలంటే సంసారమనే నిమి పడిపోయే ప్రదేశమే నైమిశారణ్యం. నైమిశారణ్యంలో ప్రవేశించిన సాధకులకు భగవత్కృప వలన, సద్గురు వచనం, శాస్త్ర వచనం ఆకళింపు చేసుకున్నంత. సంసారంలో ఉన్నా సంసారం అంటనివ్వని ప్రదేశమే నైమిశారణ్యం.

అప్పట్నుంచి ఇక్కడ ఎన్నో వేలమంది ఋషులు, తాపసులు వారి శిష్యగణాలతో వసించి తపస్యాదులు చేసుకొన్న క్షేత్రం గొప్ప తపోభూమి. మనోలయం తొందరగా కాగలిగిన క్షేత్రం. అందుచేతనే ఇక్కడ కొన్ని రోజులుండి అతి ప్రాచీన దేవాలయాలు ఎన్నో ఏళ్ళ నుంచి తాపసులు తపస్సు చేస్తున్నారా అన్నట్లుండే పెద్ద పెద్ద కైవారంతో ఉన్న దేవతా వృక్షాలు, గోమతీనది, శ్రీచక్రతీర్థం ఇత్యాది ఎన్నో గొప్ప గొప్ప విశేషాలతో ఉన్న ప్రదేశం గొప్ప సాధనా క్షేత్రం. ఏదో చూసి వెళ్ళిపోదాం అనుకునే లాంటి క్షేత్రం మాత్రం కాదు.

ఐనాసరే ఒక్కసారి ఇందులో ప్రవేశిస్తే చాలు ''రజో హరం యస్య రజా పవిత్రం తేజోమయం యస్య తమసా పురస్తాత్..'' నైమిశారణ్యంలోని రజస్సు (ధూళి, మన్ను, మట్టి) తాకగానే సకల పాపాలు హరించుకుపోతాయట. చక్రతీర్థంలో స్నానం చేసిన భక్తులు, అక్కడ జానపదులు తడిబట్టలతో అడుగడుగు దండాలు పెడతూ చక్రతీర్థానికి ప్రదక్షిణ చేస్తుంటారు. నైమిశారణ్య క్షేత్రానికి కూడా అరుణాచల గిరి ప్రదక్షిణ లాగా చేస్తారు కాని అడవి ప్రాంతం కావడం మూలాన అక్కడివారే చేస్తుంటారు. సింహాచల క్షేత్ర ప్రదక్షిణోత్సవం లాగా నైమిశారణ్యంలో ఏటా ఫాల్గుణ శుక్ల పంచమి నాడు చేస్తారని అక్కడి వారు చెప్పారు. సనాతన ధర్మంలో చరించే ప్రతి ఒక్కరూ నైమిశారణ్య క్షేత్రానికి వచ్చి చక్ర తీర్థంలో మునకలు వేయవలసిందే. చక్రస్నానం చేసి



ఒడ్డున ఉన్న యజ్ఞవరాహస్వామిని దర్శించాలి. అందువల్ల అపార పాపహరం, కలిదోషహరం, యజ్ఞఫలితమై కలుగుతాయని పెద్దల వాక్కు. ఈ దివ్య ధామానికి వచ్చి ప్రతి ఒక్కరూ కనీసంలో కనీసం ఒక్కరోజైనా నిద్ర చేసి అనుష్ఠానాదులు చేసుకొని, ప్రత్యేక దీక్షలు, మంత్రాలు ఉంటే ఇక్కడ సాధన చేసుకోవలసిందే. ఎందుకంటే ఇది సిద్ధ క్షేత్రం. అందుకే వ్యాసులు ''కలి స్సాధుః'' అన్నారు. ఇందువల్లనే కదా మనకి నైమిశారణ్యమనే గొప్ప క్షేత్రం దొరికింది.

గోస్వామి తులసీదాసు మాటల్లో ''తీర్థ వర నైమిశ్ విఖ్యాతా! అతి పునీత్ సాధక్ సిద్ధాదాతా!!'' అని అన్నారు. భూమండలంలో ఉన్న అన్ని తీర్థాలూ క్షేత్రాలు కలిసి పెళ్ళివారి ఊరేగింపుగా కదలివస్తే అందులో ముఖ్యమైనది మధ్యలో ఉండి అందరూ చూడాలనుకునేది ఐన వరుని స్థానంలో ఉండేది నైమిశారణ్యం. ఇది అతి పునీతమైనది. సమస్త సాధకులకి సిద్ధినొసరించే క్షేత్రముగా విరాజిల్లుతోంది.

వ్యాస, శుక, సూత, శౌనకాది మహర్షులు 88 వేల మంది వారి శిష్యగణాలు, అందులో శౌనకాదులు కులపతులు (11 వేల మంది శిష్యలను పోషిస్తూ వేదవేదాంగాలను బోధించేవారిని కులపతి అంటారు) దీర్ఘ సత్రయాగం (1000 సంవత్సరాలు) చేసిన స్థలం. అందునా యాగం జరిగిన చోట అన్నివేల మందికి అన్నదానం జరిగిన ప్రదేశం. అంత గొప్ప మునులు మహర్షులు, రాజర్షులు నడయాడిన ప్రదేశం. దేవతలు మెచ్చి దర్శనమిచ్చే ప్రదేశం నైమిశారణ్యం.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

## 306. శకట ప్రాణ కంటకాయ నమః

**– శకటాసురుని ప్రాణములను హరించినవాడు కృష్ణుడు.**

కృష్ణుడు శిశువుగా ఉన్నపుడు కంసుని భటుడయిన శకటాసురుడు ప్రేపల్లెకు శకట (బండి) రూపమున కృష్ణుని హతమార్చుటకు వచ్చాడు. చిన్నికృష్ణుడు ముద్దుగా బోర్లగిల పడుచున్న శుభ సమయమును పురస్కరించుకొని కృష్ణుని జన్మనక్షత్రము రోహిణి నాడు యశోద తోటి గోపస్త్రీలను పిలిచి వారి మధ్య కుతూహలముతో అభిషేక మహోత్సవమును జరిపింది. బ్రాహ్మణోత్తములు బాలకృష్ణుని వేదమంత్రములతో ఆశీర్వదించారు. యశోద వారి వారి అభీష్టముల ననుసరించి వస్త్రములను, ఆభరణములను, గోవులను విప్రులకు దానం చేసింది. ఇంతలో నిద్ర ముంచుకొని రాగా కనులు మూసుకొనుచున్న చిన్నారి కృష్ణుని మెత్తని పడకపై పరుండ బెట్టింది. పిమ్మట ఆ మహోత్సవమునకు వచ్చిన గోపికలను సాదరముగ సత్కరించుచున్నది. ఇంతలో చిన్నికృష్ణుడు మేల్కొని ఏడువసాగినాడు. ఆ ఉత్సవ సంబరములలో మునిగి తేలుచున్న యశోదకు చిన్నారి కృష్ణుని ఏడుపు వినబడలేదు. స్తన్యము కొరకు గుక్కపట్టి ఏడ్చుచూ కృష్ణుడు తన రెండు కాళ్ళనూ వేగముగా పైకి తన్నినాడు. చిన్నికృష్ణుడు ఒక బండి క్రింద శయ్యపై పండుకొని యున్నాడు. చిన్నికృష్ణుని మృదువైన చిట్టి పాదములు ఆడించుచు బండిని తన్నినాడు. ఆ తాకిడికి ఆ బండి (శకటాసురుడు) తలక్రిందులయింది. ఆ బండి యొక్క చక్రములు, ఇరుసు నొగలు వేర్వేరుగా విడిపోయినవి. కృష్ణుడు బోర్లగిల పడినప్పుడు జరిపిన ఉత్సవమునకు వచ్చిన స్త్రీ పురుషులందరు నంద యశోదలు ఆ అద్భుత దృశ్యమును చూచినారు. వారందరూ ఆ అద్భుత సంఘటనకు కంగారు పడినారు. అయ్యయ్యో! ఈ పెద్ద బండి తనంతట తానే ఎట్లు తలక్రిందులైంది? అని ఆశ్చర్యపడినారు. తికమక పడుచు ఆందోళనకు గురియైన గోపికలతో, గోపాలురతో అచ్చట ఉన్న బాలురు శయ్యపై ఏడ్చుచున్న కృష్ణుడు తన పాదములతో తన్నుట వలన ఆ తాకిడికి ఆ బండి తలక్రిందులైంది. చక్రములు, కాడి, నొగలు వేర్వేరుగా పడిపోయాయి అని చెప్పినారు. కాని వారందరూ అవి పిల్లల మాటలుగా తలంచి నమ్మలేదు. ఏలయన ''అప్రమేయం బలం తస్య బాలకస్య న తే విదుః'' (భాగ, 10–పూర్వ–అధ్యా. 7–10 శ్లో॥) ఆ చిన్నారి యొక్క అద్భుత బల పరాక్రమాలను వారు ఎరుగరు కదా! శకటాసురుడు ఎగిరి కొంత దూరమున పడి మరణించాడు. గోపకులలో పెద్దలందరు

**"బాలుండెక్కడ బండి యెక్కడ నభోభాగంబుపై జేడ్పడన్ గాలందన్నుట యెక్కడ?**
**"మిన్నున కూరక యెగయదు**
**దన్న సమర్థుండు గాడు తల్ప గతుండీ**
**చిన్న కుమారుడు తేరే**
**విన్ననువుగ నెగసె దీని విధమెట్టిదియో? - భాగ. 10-పూర్వ – 256, 252**

బాలుడెక్కడ? బండి ఎక్కడ? ఆకాశమున కెగురునట్లు తన్నుట ఈ బండి వూరకే

వినా వేంకటేశం
సదా వేంకటేశం



అన్ని నామాలు
ఓ వేంకటేశా! నీ




పైకి ఎగరదు. బాలుడు తన్నుటకు సమర్థుడు కాదు. ఈ చిన్నారి శయ్యపై పరుండి యున్నాడు. బండి ఏవిధముగా పైకెగసింది? దీనివిధమెట్టిదియో! అని ఆశ్చర్యపడినారు. పిమ్మట కృష్ణుని మేన బాలగ్రహము సోకెను గదా అని సందేహముతో గోపకులు అనేక బలి విధానములు చేశారు. స్వస్తి పుణ్యాహ వచనములు చేయించి, విప్రులకు అనేక దానములు చేసి వారి ఆశీర్వాదములు గైకొని సంతోషించారు.

శకటాసురుని సంహరించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 307. ఇంద్ర సేవ్యాయ నమః

కృష్ణునిచే గోవర్ధనగిరి ఉద్ధరించినపుడు పరాజితుడై అవమానము పొందిన ఇంద్రునిచే సేవింపబడినాడు – కృష్ణుడు.

ఇంద్రునిచే సేవింపబడిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ఇంద్రుని సేవను గూర్చిన వివరముల కొరకు ''గో సంఘధ రక్షకాయ నమః'' 299 అను నామమున చూడండి.

## 308. పుణ్య గాత్రాయ నమః

– పవిత్రమైన శరీరము గలవాడు కృష్ణుడు.

పుణ్య గాత్రము – శరీరము – గల్గి యున్న కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 309. ఖర జితే నమః

ఖరుడను రాక్షసుని జయించినవాడు, సంహరించిన వాడు శ్రీరాముడు.

ఖరుని జయించిన, సంహరించిన శ్రీరామునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

రాముడు ఖరాసురుని సంహరించిన, జయించిన వృత్తాంతము కొరకు ''ఖరాంతకాయ నమః'' అను 227 నామ వ్యాఖ్యను పరిశీలించండి.

## 310. చండదీధితయే నమః

– దుస్సహమైన తేజస్సు గలవాడు – కృష్ణుడు ఈ నామము చండ దీధితిః పరశురామునికి రామునికి కూడా అన్వయించును.

చండ దీధితులైన పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణులుగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

# తిరుప్పాన్ ఆళ్వార్

– మందరపు వి.జి.శంకరాచారి

భక్తి సామ్రాజ్యంలో భగవంతుడు భక్తుడి హృదయనివాసి. హృదయంలో కొలువైయున్న పరమాత్మని గుర్తించకుండా జీవాత్మని హింసిస్తే అది సాక్షాత్తు పరమాత్మని హింసించినట్లే. ఈ విషయం తెలియనివారు అర్థం చేసుకోలేనివారు భక్తుడి భక్తిని గుర్తించక హింసిస్తారు. అటువంటి వారికి జ్ఞానోదయం చేసి భక్తుడి హృదయంలో కొలువై ఉన్నది తనేనని, అతణ్ణి వేధిస్తే తనని వేధించినట్లేనని, కొడితే తనను కొట్టినట్లేనని దెబ్బలవలన రక్తస్రావం జరిగితే సరిగ్గా తనకి కూడా అలాగే రక్తస్రావం జరుగుతుందనే విషయాన్ని శ్రీరంగనాథుడు తన భక్తుడైన తిరుప్పాన్ ఆళ్వార్ జీవితంలో అజ్ఞానులందరికీ తెలియజేశాడు. అటువంటి మహాభక్తుడైన పానార్ వెరసి తిరుప్పాన్ ఆళ్వార్ గురించి సంక్షిప్తంగా...

క్రీ.శ. 8, 9వ శతాబ్దంలో శ్రీరంగం పట్టణానికి దగ్గరలో గల ఉదయపూర్ గ్రామంలో శ్రీమహావిష్ణువు యొక్క శ్రీవత్స (శ్రీవారి హృదయం దగ్గర గల మచ్చ యొక్క అంశ) అంశతో ఒకానొకరి పొలంలో గల ధాన్యపురాశిలో శిశువుగా సాక్షాత్కరించాడు. ఆ శిశువుని చూసిన సంతానం లేని మాలదాసరి దంపతులు పెంచుకుంటారు

శ్రీవత్స అంశతో జన్మించిన ఆ శిశువు మాలదాసరి దంపతుల సంరక్షణలో పెరుగుతూ వచ్చాడు. పానార్ వర్ణస్థులు కావడం మూలాన అతడికి పానార్ అని నామకరణం చేశారు. పానార్ కి చిన్నతనం నుండియే విష్ణుమూర్తిపై భక్తిభావం ఏర్పడింది. మాలదాసరి కుటుంబంలో పెరగడం వలన ఇతడికి పాటలు పాడటం, హరిదాసులు (సంక్రాంతి సమయంలో వచ్చే హరిదాసులు ఈ మాలదాసరి సంప్రదాయమునకు చెందినవారు) వాయించే వీణని హృద్యంగా వాయించడం చిన్నతనం నుండే అబ్బింది. అందుకే ఎంతో హృద్యంగా శ్రీరంగనాథుడిపై పాటలు పాడేవాడు. రాగాలను అద్భుతంగా ఆలపించేవాడు.

ప్రతిరోజు శ్రీరంగపట్టణానికి వెళ్ళి ఆ గుడికి దగ్గరలో గల కావేరీనది ఒడ్డున నిలబడి శ్రీరంగం గుడిగోపురాన్ని చూస్తూ పాటలు పాడేవాడు. నిమ్నజాతి కులంలో పెరగడం వలన పానార్ ని గర్భగుడిలోనికి రానిచ్చేవారు కాదు. తమ కులస్థులకి గుడి ప్రవేశం చేసి శ్రీరంగనాథుడిని దర్శించే భాగ్యం లేదని తెలిసే పానార్ కావేరీనది దగ్గరకు వెళ్ళి గుడిగోపురం వంక చూస్తూ పాటలు పాడడం అలవాటు చేసుకున్నాడు పానార్. అదే అతడికి నిత్యకృత్యమైపోయింది.

శ్రీరంగం గుడి ప్రధాన పురోహితుడు లోక సారంగముని రంగనాథుడికి కైంకర్యం సేవ చేయడానికి గాను జలాన్ని దగ్గరలో



గల కావేరీ నది నుండి తీసుకుని వచ్చేవారు అతడి శిష్యగణం. అయితే వారు బయటకు వచ్చినప్పుడు నిమ్నకులస్థులు ఎదురైతే అది మహాపాపంగా భావించేవారు. అంతేకాదు... మరలా శుచిగా స్నానం చేసి నిమ్నజాతివారు కనబడకుండా ఉండడం చూసి పిదప నదికిపోయి బిందెలతో జలాన్ని తీసుకు వచ్చేవారు. ఈవిధంగా వారు ఒకరోజు శ్రీరంగనాథుడి కైంకర్య సేవ నిమిత్తం నీరు తేవడానికని దగ్గర్లో గల కావేరీ నది ఒడ్డుకు చేరుకున్నారు.

అక్కడ పానార్ శ్రీరంగం గుడిగోపురాన్ని తదేకంగా చూస్తూ పాటలు పాడసాగాడు. అతడు భక్తి పారవశ్యంలో మునిగి సమాధి స్థితిలోనికి వెళ్ళిపోయాడు. సమాధి స్థితిలోకి వెళ్ళిపోయి ఉన్న పానార్ ని లోకసారంగముని శిష్యులు చూసి, నిమ్నకుల జాతివాడు ఎదురయ్యాడు, వీణ్ణి ఇక్కడనుండి పంపి, మరలా నదిలో స్నానం చేసి స్వామివారి కైంకర్యానికి జలాన్ని తీసుకుని వెళదామని అనుకున్నారు.

నిమ్నజాతి కులస్థుడిని చూడడమే పాపంగా తలచినవారు పానార్ ని అక్కడనుండి పంపడానికి, సమాధి స్థితి నుండి బయటపడవేయడానికి చిన్న చిన్న రాళ్ళను అతడిపై విసిరి చలనం కలిగించాలని చూస్తారు. కానీ పానార్ అచేతన స్థితిలో యుండి భగవంతుడి ఆరాధనలో నిమగ్నమైపోయాడు. అతడికి వీరు చేస్తున్న పనుల వలన ఏమాత్రం తెలివిలోకి రాలేదు. ఇది చూసి సారంగముని శిష్యులలో ఒకడు ఒక పెద్ద రాయిని తీసుకుని సూటిగా అతడి తలపై విసరుతాడు.

తలకు రాయి గట్టిగా తగలడంతో పానార్ తలపైనుండి రక్తం స్రవించి ఈలోకంలోకి వచ్చిపడ్డాడు. విషయం తెలుసుకున్న పానార్ రంగనాథుణ్ణి క్షమించమని ప్రార్థిస్తూ...

"తండ్రీ! నీకు కైంకర్య సేవ చేయడానికి జలాన్ని తీసుకుని వెళదామని వచ్చిన వీరి కంటపడి.. నీకు వారిచే సేవ చేయించడంలో ఆలస్యమైందుకు కారకుడినైన నన్ను క్షమించు. నేను ఈ క్షణమే వారి కంటినుండి దూరంగా వెళతాను. ఈ పాపిని క్షమించు తండ్రీ!" అంటూ అక్కడనుండి సారంగముని శిష్యులకు కనబడకుండా దూరంగా వెళ్ళిపోతాడు.

పానార్ వెళ్ళిపోవడంతో ఆ శిష్యులు కావేరీ నదిలో స్నానం చేసి బిందెలతో జలాన్ని శ్రీరంగం గుడిలోనికి తీసుకుని వెళ్తారు. అక్కడ ఉన్న లోకసారంగమునికి ఇచ్చి తమ ఆలస్యమునకు కారణం చెబుతారు. తరువాత ప్రధాన అర్చకుడైన లోకసారంగమునితో కలిసి శ్రీరంగనాథునికి కైంకర్యసేవ చేయడానికై బిందెలతో తెచ్చిన జలాన్ని స్వామివారి అలంకరణకై పుష్పాలను తీసుకుని ఆలయ తలుపులు తెరిచి గర్భాలయ ద్వారాలు తెరుస్తారు. అంతే... అందరూ నివ్వెరపోతారు.

స్వామివారి తలనుండి రక్తం కారడం చూసి అందరూ సంభ్రమాశ్చర్యాలకు లోనై తాము చేసిన అపచారమేమిటో చెప్పమంటూ ప్రార్థన చేస్తారు. అప్పుడు ఆ విగ్రహం నుండి మాటలు ఈవిధంగా వినబడుతాయి.

"ప్రియభక్తులారా! ఈరోజు మీరు తీరని అపచారం చేశారు. నా హృదయం దగ్గర గల మచ్చ యొక్క అంశతో జన్మించిన పానార్ ని, నిమ్నకుల జాతివాడని, అతడిని తక్కువ చేస్తూ రాళ్ళతో కొట్టి పక్కకు సాగనంపారు. అందరి హృదయాలలో నివసిస్తున్న వాడను నేనే కదా! మరి అంటరానివాడెవరు? ఈ విషయాన్ని అర్థం చేసుకొనక జీవన్ముక్తుడు, మహాభక్తుడైన పానార్ ని రాయితో కొట్టి తలకు గాయం చేసి రక్తస్రావం అయినట్లుగా చేశారు. మరి అతడి హృదయంలో నివసిస్తున్న నాకు మీ రాళ్ళ దెబ్బలు తగలవా? అందుకే ఆ దెబ్బలు నాకు కూడా తగిలి నా తల నుండి రక్తస్రావం అవుతోంది". ఆ మాటలు వినగానే అందరూ సాష్టాంగపడి తమ తప్పుని క్షమించమని స్వామివారిని అడుగుతారు. తమ తక్షణ కర్తవ్యమేమిటో ఉపదేశించమన్నారు.

అప్పుడు మరలా రంగనాథుడు ఈ విధంగా మాట్లాడతాడు. "నా ప్రధాన అర్చకుడైన లోకసారంగమునితో పాటు అందరూ వెళ్ళి రక్తస్రావంతో బాధపడుతున్న పానార్ ని భుజాలపై మోసుకుని సారంగముని ఇక్కడకు తీసుకురావాలి. అలా తీసుకుని వస్తే నా తల నుండి కారుతున్న రక్తం, మరియు పానార్ కి తగిలిన దెబ్బ క్షణంలో మాయమవుతాయి" అని చెప్పగానే అందరూ హుటాహుటిన పానార్ దగ్గరకు వెళ్ళి విషయం చెబుతారు.

లోకసారంగముని పానార్ పాదములపై పడి క్షమించమని అడుగుతా "మహాభక్తా! ఈరోజు రంగనాథస్వామి వారు మా కళ్ళు తెరిపించారు. మిమ్మల్ని రాళ్ళతో కొట్టి రక్తం కారినట్లుగా చేశారు మా శిష్యులు. అందుకు ప్రతిఫలంగా నేడు స్వామివారు కూడా మీలాగే దెబ్బ తగిలి రక్తస్రావంతో బాధపడుతున్నారు. మిమ్మల్ని నేను భుజాలపైకి ఎత్తుకుని తీసుకుని గర్భగుడిలోకి ప్రవేశపెట్టకపోతే స్వామివారి రక్తస్రావం ఆగదు. తమరు మాయందు దయ ఉంచి నాతో రండి" అని గుడిలో జరిగిన విషయం తెలియజేస్తాడు.

పానార్ తను అంతగా ఆరాధించే స్వామివారికి తన వలన దెబ్బ తగిలి రక్తస్రావంతో బాధపడుతున్నందుకు చింతించి వెంటనే బయలుదేరతాడు.

లోకసారంగముని పానార్ ని తన భుజాలపైకి ఎత్తుకుని శ్రీరంగం గుడిలోకి తీసుకుని వెళతాడు.

ప్రధాన ద్వారం దగ్గరకు చేరుకోగానే లోకసారంగముని పానార్ ని తన భుజాలపై నుండి క్రిందకు దింపుతాడు.

అప్పుడు పానార్ శ్రీరంగనాథుణ్ణి నఖశిఖ పర్యంతం పరవశంగా చూస్తాడు. అతడు చూస్తుండగానే రంగనాథుడి నుదుట నుండి కారుతున్న రక్తస్రావం ఆగిపోతుంది. అదేక్షణంలో పానార్ తలకి తగిలిన గాయం మాయమై రక్తస్రావం ఆగిపోతుంది.

ఈ అద్భుతాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న లోకసారంగముని అతడి శిష్యులు అచ్చెరువొందుతారు.

రంగనాథుడిని తనివితీరా చూస్తూ స్వామివారి గురించి ఆశువుగా పాశురాలు (శ్లోకాలు) పాడడం ప్రారంభిస్తాడు పానార్.

పానార్ రంగనాథుడి యొక్క పాదాలు మొదలుకుని నేత్రాల వరకు పది పాశురాలను ఆశువుగా పాడడం ప్రారంభిస్తాడు. పానార్ ఒక్కొక్క పాశురం చదువుతున్నప్పుడు అతడి శరీరంలోని ఒక్కొక్క అవయవం శ్రీరంగనాథుడిలో ఐక్యమవడం ప్రారంభమవుతుంది. ఆ విధంగా అదృశ్యమవుతున్న పానార్ అంగాలు స్వామివారి నేత్రాలపై పాశురాన్ని చదవడం పూర్తయిన తరువాత జ్యోతిగా మారి శ్రీరంగడిలో ఐక్యమవడాన్ని అక్కడ ఉన్నవాళ్ళంతా ప్రత్యక్షంగా తమ కళ్ళతో వీక్షిస్తారు.

"మహాభక్త పానార్ కి జై" అంటూ నినాదాలు చేస్తారు. అప్పుడు స్వామివారి విగ్రహం నుండి మరల ఈ మాటలు వినబడతాయి.

"మహాభక్తులారా! పానార్ నేటినుండి ఆళ్వార్ లలో ఒకడిగా కీర్తింపబడతాడు. ఇకనుండి ఇతడు తిరుప్పన్ ఆళ్వార్ గా ప్రసిద్ధి చెందుతాడు. అంతేకాదు నా ప్రధాన అర్చకుడైన సారంగముని ఈతడిని తన భుజాలపై తీసుకుని వచ్చాడు కనుక "మునివాహనుడి"గా కూడా ప్రసిద్ధుడౌతాడు" అని చెబుతాడు.

స్వామివారి మాటలు విన్న తర్వాత లోకసారంగముని రంగనాథుడి కాళ్ళపై బడి కృతజ్ఞతను వెలిబుచ్చుతాడు.

నాటినుండి ఆళ్వార్ లలో పదకొండవ వాడిగా తిరుప్పన్ ఆళ్వార్ ప్రఖ్యాతి చెందుతాడు.

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

### 18వ శ్లోకం

**హే మర్త్యాః పరమం హితం శృణుత వో వక్ష్యామి సంక్షేపతః**
**సంసారార్ణవ మాపదూర్మిబహుళం సమ్యక్ప్రవిశ్య స్థితాః |**
**నానాజ్ఞాన మపాస్య చేతసి నమో నారాయణాయే త్యముం**
**మంత్రం సప్రణవం ప్రణామసహితం ప్రావర్తయధ్వం ముహుః ||18||**

మర్త్యులు అమృతత్వము పొందుటకు ఉపాయము ఇందు ఉపదేశిస్తున్నారు. ఉపాయములు కర్మ, జ్ఞాన, భక్తి, యోగములుగా పేర్కొనబడినవి ఎన్నియో ఉన్నవి. కాని అవి ప్రయాస సాధ్యము లని, సంక్షేపముగ ఒక ఉపాయమును ఉపదేశించుచున్నారు.

ఆపదలనెడి కెరటములతో నిండిన సంసారమనెడి సముద్రములో చొచ్చియున్న ఓ మర్త్యులారా! వినుడు. మీకు సంగ్రహముగా ఒక ఉపాయమును చెప్పెదను. అనన్యమగు భక్తితో తదితర చింతనములను విడచి మనసున "ఓం నమో నారాయణాయ" అను ఈ మంత్రమును జపించండి.

'హే మర్త్యాః' అంటే అశాశ్వత శరీరములను ధరించినవారా నూరు సంవత్సరాల ఆయుష్షు ఉన్నా ఎప్పటికైనా వదలవలసిందే.

'జాతస్య హి ధ్రువో మృత్యుః' అని భగవద్గీతలో చెప్పినట్లు, పుట్టినవారు తప్పక మరణించాల్సిందే. కాబట్టి 'శృణుత వో వక్ష్యామి సంక్షేపతః' పరమ హితాన్ని చెబుతాను సంగ్రహంగా వినండి.

'స్సంసారార్ణవ' సంసార+అర్ణవం, సంసారమనే మహా సముద్రములో అధికముగా అలలు అనే బాధలు చేత కొట్టబడే దానిలోకి 'సంయక్ప్రవిశ్య స్థితాః' లోతుగా దిగి స్వయం రక్షణ చేసుకోలే నంతగా మునిగి ఉన్నవాళ్ళము.

**'నానాజ్ఞాన మపాస్య' నానావిధములైన అజ్ఞానములను విడిచిపెట్టి అంటే,**

**"శ్రుతి విప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా |**
**సమాధా వచలా బుద్ధి స్తదా యోగమవాప్స్యసి ||"**

అనేక మంది మాటలను వినడం వల్ల నీ బుద్ధి అయోమయానికి గురైంది, ఎప్పుడు పరమాత్మ ధ్యానంలో నిశ్చలంగా, స్థిరంగా ఉంటుందో అప్పుడు నువ్వు ఆత్మసా క్షాత్కారాన్ని పొందుతావు అని కృష్ణపరమాత్మ శ్రీ వచనం.

'సప్రణవం' ప్రణవముతో కూడిన నారాయణుడి యొక్క

మంత్ర రాజమనే అష్టాక్షరిని మనస్సు నందు పదే పదే నిశ్చల భక్తిశ్రద్ధలతో నమస్కార పూర్వకంగా నిరంతరం జపించండి. అది ఏ ఈ దుఃఖసాగరము, అలాగే పుట్టుట గిట్టుట అనే చక్రములో పడకుండా మోక్షమునిచ్చి నిత్యానందాన్ని కృప చేస్తుంది.

ఈ నారాయణ నామ విశిష్టతను యమధర్మరాజే చెప్తారు, దేవతలే శ్రీమన్నారాయణుడి నామ వైశిష్ట్యాన్ని వివరిస్తారు.

"నారాయణాయేతి నామాస్తి వాగస్తి వశవర్ధిని తథాపి నరకే ఘోరే పతంతి కిమద్భుతం"

నారాయణ అనే పదం ఉంది, ఎవ్వరైనా పలకవచ్చు. అనడానికి సాధనం నాలుక. నాలుక ఉంది, లేదని కాదు. "వాగస్తి వశ వర్ధిని" పశువులకి నాలుక ఉంది, కానీ అనే యోగ్యత లేదు. మనిషికి అట్లాంటి సమస్య లేదు. ఎవరినో అప్పు అడిగి తెచ్చుకోవాల్సిన అవసరం లేదు, వారి వశంలోనే ఉంటుంది. "తథాపి నరకే" అయినప్పటికీ నరకానికి రావాలని కోరుకుంటారు. మామూలు నరకం కోసం కాదు, నరకాల్లో ఎన్నో రకరకాలు ఉన్నాయి.

"ఘోరే" ఘోర నరకం కోసం "పతంతి" కోరి కోరి పడి చస్తున్నారు "కిమద్భుతం" ఏమి ఆశ్చర్యం అన్నాడట. నరకలోకానికి రాకుండా తప్పించుకునే మార్గం ఏదైనా ఉందా అంటే అది నారాయణ నామం. నోరారా పలకండి. దేవతలూ నారాయణ మహా మంత్రం యొక్క గొప్పతనాన్ని చెబుతున్నారు. అలాంటి నామాన్ని నిరంతరం మనస్సులో జపిస్తూ తరించడానికి ఉత్తమమైన మార్గాన్ని కులశేఖరాళ్వార్లు తెలియజేస్తున్నారు. అదే విధంగా ఆట, పాట, స్మరణ, పూజ... మనసుకి తోచిన ఏ మార్గంలోనైనా భగవంతుని చేరుకోవచ్చునని భక్తి ఉద్యమంతో తేటతెల్లం చేసాడు. భక్తి ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన కృష్ణ తేజం – సంత్ సూరదాస్ (సూర్‌దాస్).

దేవుళ్ళను పూజించాలంటే ఉన్నతకులంలో పుట్టి ఉండాలి, మడి కట్టుకోవాలి, మాంసాహారం తినకూడదు, అంటూ అనేక ఆంక్షలు ఉండేవి. సామాన్య ప్రజలకి, నిరక్షరాస్యులకు, వెనకబడ్డ కులాలకు దేవుణ్ణి దూరంగా పెట్టిన రోజులవి...ఆ అజ్ఞానాన్ని పటాపంచలు చేసి భగవంతుడు అందరివాడన్న సూక్ష్మాన్ని చాటిచెప్పడానికే "భక్తి ఉద్యమం" మొదలైంది.

సూరదాస్ పుట్టుగుడ్డి కాదు. పుట్టుకతోనే గుడ్డివాడు అని కొన్ని చోట్ల వుంది. కానీ నిజానికి పుట్టు గుడ్డివాడు కాదు సంత్ సూరదాస్... తన నడి వయసులో ఒక బలమైన కారణం చేత తన కళ్లు తనే తీసుకున్నాడని అంటారు!

ఆయన మంచి అందగాడు, ధనవంతుడు. అలాంటి సూరదాస్ ఒకామె మోహంలో పడిపోయాడట. ఆమె కోసం తన సర్వస్వాన్నీ త్యాగం చేసేందుకు సిద్ధపడ్డాడంటారు. రాత్రి పగలు ఆమె ధ్యానంలోనే గడిపేవాడట... అలా కొన్నాళ్ళు గడిచాయి. సూరదాస్ తండ్రి మరణించాడు. తండ్రికి



శ్రాద్ధకర్మలను నిర్వహించే సమయంలో కూడా ఎప్పుడెప్పుడు ఆమెని కలుద్దామా!! అని అతని మనసు ఆరాటపడసాగిందట. ఆ ఆరాటంతోనే క్రతువుని ముక్తసరిగా ముగించి తన ప్రేయసిని కలుసుకునేందుకు బయల్దేరడం తన జీవితంలో పెద్ద మలుపు.

సూరదాస్ (సూర్‌దాస్) ప్రేయసిని కలుసుకోవాలంటే ఒక నదిని దాటవలసి ఉంది. కానీ ఆ రాత్రి భీకరమైన వర్షం, హోరు గాలి. అలాంటి వాతావరణంలో, అంత చీకటివేళ నదిని దాటేందుకు పడవవాడు నిరాకరించాడట. దాంతో సూరదాస్ ఒక మొద్దు పట్టుకుని ఈదుకుంటూ ఆవలి ఒడ్డుకు చేరుకున్నాడు. ఇంతాచేసి అతను పట్టుకుని వచ్చినది మొద్దు(దుంగ) కాదు! అది శవం అని తెలుస్తుంది. ప్రాన్పడిపోతాడు. ఆ తర్వాత ఇంకో విస్మయకరమైన ఘటన. ప్రియురాలి మేడని ఎక్కేందుకు ఒక తాడుని పట్టుకుని పై అంతస్తుకి చేరుకుంటాడు. పైకి వెళ్లిన తర్వాత తాను పట్టుకున్నది తాడు కాదు, అది పెద్ద పాముననీ తెలియడంతో తేరుకోలేకపోతాడు. ఇవన్నీ సరే అనుకుంటే, అంత రాత్రివేళ, భారీ వర్షాలు, ఇలాంటి పరిస్థితులలో, ఎంతో ప్రమాదానికి ఓర్చి తన దగ్గరకు వచ్చిన సూరదాస్‌ని చూసిన ఆమె ఆశ్చర్యపోవడం మరో ఎత్తు. ఆమె దగ్గరికి రావడానికి తానెంత కష్టపడ్డాడో చెప్పి... ఆమెను దగ్గరికి తీసుకోబోయేంతలో మరో శరాఘాతం. అతనిలోని మోహపు తీవ్రతను చూసి ఆమెకు కంపరమెత్తిపోతుంది. 'ఇదే ఆర్తిని ఆ భగవంతుని పట్ల చూపిస్తే నీకు ఆయన దర్శనం లభించి తీరుతుంది కదా' అంటూ "నా మీద నీ వ్యామోహం తుచ్ఛమైనది" అని చీదరించుకుంటుంది.

ఆ రాత్రి ఆమెతో జరిగిన సంభాషణతో సూరదాస్ మనసు కకావికలమై పరివర్తన మొదలవు తుంది. ఏ అందానికి తను బానిస అయ్యాడో... ఆ ఆనందంపై తన మనసు మరలే అవకాశం లేకుండా కళ్లు తీసుకుని గుడ్డివాడై పోయాడంటారు. ఇక తాను భగవంతుని మీదే దృష్టి ఎక్కుపెట్టాడనీ అంటారు.



అలా సూరదాస్ కన్నులు మూసి హృదయం తెరిచాడంటారు. దృష్టికీ, బంధాలకీ అతీతమైన ఆ పరమాత్మ మీద తన మనసుని లగ్నం చేసుకున్నాడనీ చెబుతారు. ఇదిలా ఉండగా అతడి జీవితంలో జరగవలసిన ఘటన జరగడానికి సరైన వేళ రానే వచ్చింది. ఒకరోజు తన ఊరి మీదుగా తీర్థయాత్రలకు వెళ్తున్న భక్తుల కీర్తనలు ఆయన చెవిన పడనే పడ్డాయి. ఆ కీర్తనలు విన్న సూరదాస్ మనసుకి ఎంతో స్వాంతన లభించింది. అంతే...ఇక ఇల్లు వదిలి యాత్రికులతో యమునాతీరానికి చేరాడు.

ప్రయాణంలో ఓ రోజు ఆయన ఒక భక్త బృందాన్ని కలిసాడు. అక్కడే వల్లభాచార్యుల వారు కలిశారు. ఆయన సూరదాస్‌ను తన శిష్యులలో ఒకరిగా చేర్చుకోవడంతో తన భక్తికి గురువు అండ కూడా తోడయింది.

సూరదాస్ వల్లభాచార్యులుతో కలిసి బృందావనం చేరాడు. కృష్ణుడు తన బాల్యాన్ని గడిపిన ఆ బృందావనంలో, కృష్ణుని మీద కీర్తనలు పాడుతూ సూరదాస్ అలౌకికమైన ఆనందాన్ని అనుభవించాడు. అది స్త్రీ సాంగత్యం కన్నా మించిందని గుర్తించాడు. అప్పుడు మొదలైంది జ్ఞానోదయం (enlightenment). ఇక ఆ రోజు నుండి భక్తి పారవశ్యంతో పరమాత్ముని మీద సూరదాస్ పాడిన పాటలు, భజనలు అనతికాలంలోనే ఆయనకు గొప్ప గుర్తింపును తీసుకువచ్చాయి. ఎంతోమంది భక్తులను చేరువ చేశాయి.

సూరదాస్ భక్తిని గమనించిన వల్లభాచార్యులవారు సూరదాస్‌కు భక్తి ఉద్యమం గురించి బోధించడం మరో మలుపు. దీంతో గురువు ప్రోత్సాహంతో సూరదాస్ కవితా ప్రతిభ అసాధారణంగా వెల్లి విరియడం విశేషం.

మనందరికీ తెలుసు. అన్నమయ్య (తాళ్ళపాక అన్నమాచార్యులు) గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని, అహోబిలములోని నరసింహ స్వామిని, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ 32 వేలకు పైగా కీర్తనలు రచించాడు. మే 9, 1408 – ఫిబ్రవరి 23, 1503 మధ్య వారు జీవించారు. సూరదాస్...1483–1584 మధ్య కాలంలో జీవించారు. అక్బర్ సమకాలీన భక్తి ఉద్యమకారుడు సూరదాస్.

గుడ్డివాడైన సూరదాస్ ఒకరోజు లోతైన వ్యవసాయ బావిలో పడిపోయాడట. అనేక గాయాలతో ప్రాణాలతో మిగిలాడంటారు. అలాంటి పరిస్థితుల్లో కూడా ఆయన కృష్ణుని ధ్యానించడం మానక పోవడం, సూరదాస్ భక్తికి మెచ్చిన కృష్ణ పరమాత్ముడు స్వయంగా వచ్చి అతడిని రక్షించడం, ఆపై సూరదాస్‌కి దృష్టి వచ్చే వరాన్ని ప్రసాదించడమూ, కానీ కృష్ణుని చూసిన కళ్లతో ఈ సమాజాన్ని చూడలేనంటూ సూరదాస్ తిరిగి తనకు అంధత్వం ప్రసాదించమని ఆ దేవదేవుని వేడుకోవడం, ఇదంతా అతడి జీవితంలో చెప్పుకునే మరికొన్ని విశేషాల సమాహారం. అలౌకిక దివ్యజ్ఞానానికి, భక్తి పారవశ్యానికి ప్రతీకలు.

సూరదాస్ తన జీవితకాలంలో లక్ష పాటలు రాశాడని చరిత్ర చెపుతోంది. అయితే వాటిలో ఎనిమిదివేల పాటలు మాత్రమే ప్రస్తుతం లైబ్రరీలో లభ్యమవుతున్నాయి. వీటిలో హిందీతో పాటుగా బ్రజ్ భాషలో పాటలు, పద్యాలు రాశారు.

కృష్ణునితో అనుబంధం ఉన్న దేవభూమిలో అనాదిగా వినిపించే భాషే ఈ బ్రజ్ (braj) భాష! బాలకృష్ణుడు పలికిన భాషలోనే బాలకృష్ణుని లీలలను గుర్తుచేసే సూరదాస్ భజనలు అద్భుతాలు. 'నేను వెన్న తినలేదమ్మా! ఎవరో నా మొఖానికి వెన్న పూశారు' అంటూ ఆ వెన్నదొంగని గుర్తుచేసే 'మై నహీ మాఖన్ ఖాయో!' వంటి భజనలు సూరదాస్ రచనలలో అనేకం కనిపిస్తాయి. అలా కృష్ణభక్తిలో మునిగితేలుతూ, పదిమందికీ పంచుతూ వందేళ్లకు పైగా జీవించిన సూరదాస్ మథుర సమీపంలో తన దేహాన్ని చాలించాడని అంటారు. కానీ.... అతని మరణం ఇప్పటికీ ఓ రహస్యమే....!!!

సెయింట్ అండ్ పోయిట్ సంత్ సూరదాస్ కళ్లు లేకపోయినా దివ్య దృష్టితో ఎన్నో రచనలు చేశాడు. మహా సముద్రం యొక్క మహా సముద్రం (sur sagar), సుర్ సరావలి, సాహిత్య లహరి. వంటి అనేక రచనల్లో శ్రీ కృష్ణుడి మీద లక్షకుపైగా పద్యాలు, పాటలు, కీర్తనలు రాశాడు. అద్భుతమైన వర్ణనతో మనోవైజ్ఞానికమైన 'రాధాకృష్ణుల' లీలలు రాశారు. ఇప్పుడు మనం చూస్తున్న రాధాకృష్ణుల చిత్రాలన్నీ సంత్ సూరదాస్ వర్ణనను బట్టి చిత్రీకరించినవే.

సంత్ సూరదాస్ రచనలు చేసిన బ్రజ్ భాష...యూనివర్సల్ లాంగ్వేజ్...ఒక విశ్వభాష (plebeian language). సిక్కుల

పరిశుద్ధ గ్రంథం గురు గ్రంథ్ సాహెబ్లో సంత్ సూరదాస్ రచనలు 'Hymns' (కీర్తనలు) చోటుచేసుకున్నాయి.

సంత్ సూరదాస్ పేరు మీద తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా గొల్లగూడలో 'సూరదాస్ భవన్' అంధుల పాఠశాల ఉంది. అక్కడ వందలాది మంది అంధ విద్యార్థులకు Education, sports, cultural activities, నేర్పిస్తూ వసతి కల్పిస్తున్నారు. Sant Surdas (Sihi) metro station Delhi Faridabad, Haryanaలో ఉంది. ఇంకా దేశంలోని అనేక రాష్ట్రాలలో సూరదాస్ మార్గ్ అని రోడ్లు పేర్లు, బస్ స్టేషన్ పేర్లు ఉన్నాయి.

ఈ మధ్య సబర్మతి ఆశ్రమంలో జరిగిన 'ఆజాద్ కా అమృత్ మహోత్సవ్' india@75 కార్యక్రమంలో భారతదేశ ఆధునిక జీవితం భక్తి, ముక్తి మీద ప్రజల్లో చైతన్యం కలిగించి, అఖిల భారత స్వభావాన్ని అలరించడంలో ప్రధాన పాత్ర పోషించిన కథానాయకుడు 'సంత్ సూరదాస్' అని ఆయన్ని స్మరించి సూరదాస్ జీవిత చరిత్ర ప్రజల చెంతకు చేరాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి మోడీ అన్నారు.

ఆ రోజుల్లోనే సూరదాస్ అనే ఈ మహాభక్తుడు కృష్ణుని కీర్తిస్తూ ఉత్తర, దక్షిణ భారతం మొత్తం తిరిగి భక్తి ఉద్యమం ద్వారా పరమాత్ముని కీర్తించాడు. దాంతో ఉవ్వెత్తున ఎగిసి హిందూ మతానికి పునర్వైభవం రావడానికి సూరదాస్ కీర్తనలు ప్రముఖ పాత్రని పోషించాయి. "దేవునికి రూపం ఉందని... పూజ, పునస్కారం, వ్రతం, మనుషుల్లో సంస్కారం తీసుకొస్తుంది" అన్నది సూరదాస్ నమ్మిన ఫిలాసఫీ.

**సూరదాస్ జయంతి తేదీ**

కొన్ని పాఠాంతరాలలో అతని పుట్టిన తేదీ తెలియదు కానీ, అతను 1479 AD లేదా 1478 AD మధ్య జన్మించాడని వుంది. హిందూ క్యాలెండర్ ప్రకారం, సూరదాస్ జయంతి వైశాఖ మాసంలో శుక్ల పక్షంలో పంచమి తిథిలో ఐదవ రోజు వస్తుంది. సూరదాస్ జయంతిని గొప్ప కవి మరియు సంగీత విద్వాంసుని జయంతిగా జరుపుకుంటారు. అతను శ్రీకృష్ణుని యొక్క గొప్ప భక్తుడు మరియు అతని గౌరవార్థం అనేక పద్యాలు మరియు పాటలు పాడాడు. దేవతకు అంకితమైన అతని ఆత్మీయ కవిత్వం, అతనికి భక్త కవి సూరదాస్ (భక్తుడు మరియు కవి సూరదాస్) అనే పేరు తెచ్చిపెట్టింది. 16వ శతాబ్దంలో భారతదేశంలో జరిగిన భక్తి ఉద్యమానికి సంబంధించి సుర్ సాగర్ అనే అతని కవితా సంకలనం ముఖ్యమైనది. భారతదేశంలోని ఉత్తర ప్రాంతంలో ఈ రోజును సాధారణంగా జరుపుకుంటారు. శ్రీకృష్ణుని భక్తులందరూ భగవంతుడిని పూజిస్తారు మరియు ప్రార్థనలు చేస్తారు మరియు గొప్ప కవి గౌరవార్థం ఉపవాసం ఉంటారు. ఈ రోజును గుర్తించడానికి, అనేక సంఘాలు సెయింట్ యొక్క బోధనలను బోధించడానికి సెమినార్లు మరియు ఉపన్యాసాలను



నిర్వహిస్తాయి. ఆ రోజు జ్ఞాపకార్థం చాలా మంది అతని సేకరణ నుండి భజనలు పాడతారు. సూరదాస్ ని ఎప్పుడూ బ్రజ్ యొక్క 'నైటింగేల్' అని పిలుస్తారు. అతను హిందీ, బ్రజ్ భాష మరియు కన్నడ భాషలలో వ్రాసిన కవి మరియు సంగీతకారుడు.

కవి యొక్క జన్మస్థలం రహస్యంగా ఉంచబడింది. అతను ఆగ్రాలోని రుంకటా అనే చిన్న జిల్లాలో సరస్వత్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడని కొందరు నమ్ముతారు, మరికొందరు అతను హర్యానాలోని సిహి గ్రామానికి చెందినవాడని పేర్కొన్నారు. కథల ప్రకారం, అతని అంధత్వం కారణంగా అతని కుటుంబం అతనిని ఎన్నడూ అంగీకరించలేదు. నిర్లక్ష్యానికి మనస్తాపం చెంది ఇంటిని విడిచిపెట్టి శ్రీ వల్లభాచార్యుల శిష్యుడైనాడు. భగవంతునికి అంకితమైన గ్రంథాలను తనకు పరిచయం చేసిన ఆచార్యుల నుండి అతను శ్రీకృష్ణుని గురించి తెలుసుకున్నాడు.

కొన్ని పుస్తకాలలో ఈ విధంగా వుంది: శ్రీ సూరదాస్ 15వ శతాబ్దానికి చెందిన సాధువు మరియు సంగీత విద్వాంసుడు. అతను హిందీ సాహిత్యం మరియు సంగీత చరిత్రలో అత్యంత ముఖ్యమైన వ్యక్తులలో ఒకరిగా పరిగణించబడ్డాడు. సూరదాస్ నేటి రాజస్థాన్ రాష్ట్రంలోని వైరాగ్ గ్రామంలో నేత కార్మికుల కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచీ సంగీతం పట్ల అపారమైన ప్రేమను, పాండిత్యాన్ని కనబరిచాడు. అతను 16,000 కంటే ఎక్కువ ద్విపదలను రచించాడని చెబుతారు, వీటిలో ఎక్కువ భాగం హిందూ దేవుడు విష్ణువుకు అంకితం చేయబడ్డాయి. సూరదాస్ స్వరకల్పనలు హిందీ కవిత్వం మరియు గానం యొక్క అత్యుత్తమ ఉదాహరణలుగా పరిగణించబడతాయి.

కృష్ణుడి కోసం సూరదాసు విలపించారు. సూరదాస్ యొక్క అత్యంత ప్రసిద్ధ రచనల్లో ఒకటి కృష్ణుడి కోసం అతని విలాపం. ఈ పాట ప్రభువును తిరిగి భూలోకానికి రావాలని వేడుకుంటున్న హృదయ విదారక విన్నపం. సూరదాస్ తన స్నేహితుడు మరియు

ప్రభువును కోల్పోయి నందుకు దుఃఖిస్తున్నాడు, భూమిపై కృష్ణుడి కాలక్షేపాల అందాన్ని పాడాడు. ఈ పాట సూరదాస్ యొక్క కవిత్వ ప్రతిభాపాటవానికి మరియు దైవికతతో అతనికి కృష్ణునితో ఉన్న సన్నిహిత అనుబంధానికి ఒక అందమైన ఉదాహరణ.

అంతేకాదు, తన భార్యను కోల్పోయిన తరువాత, సూరదాస్ ప్రపంచం నుండి చాలా విడిపోయారు. అతను కొన్ని రోజులు ఒంటరిగా గడిపాడు, తినడానికి మరియు త్రాగడానికి మాత్రమే బయటకు వస్తాడు. ఒక రోజు, అతను ఒక కోతిని ఒక వ్యక్తి కొట్టడం చూశాడు. అతనికి ఆశ్చర్యం కలిగించే విధంగా, కోతి ఎదురు తిరిగి పోరాడి వ్యక్తి చేతిని కొరికింది. ఈ సంఘటన సూరదాస్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది, అతను దేవతల నుండి వచ్చిన సూచనగా భావించాడు. అతను ప్రపంచానికి మరియు దాని క్రూరత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని సూచించాడు. ఆ రోజు నుండి, సూరదాస్ తన జీవితాన్ని సంగీతానికి అంకితం చేశాడు. మరియు ప్రేమ, కరుణ యొక్క సందేశాన్ని వ్యాప్తి చేశాడు. తన భార్యను పోగొట్టుకున్నందుకు సూరదాస్ ఈ విధంగా ప్రతీకారం తీర్చుకున్నాడు.

ఆ తరువాత సూరదాస్ జీవనశైలి అతని సంగీతాన్ని ఎలా మార్చింది అంటే! అతను తన భజనలు మరియు కీర్తనలతో ప్రసిద్ధి చెందాడు, వీటిలో చాలా వరకు స్వయంచాలకంగా కూర్చబడ్డాయి. సూరదాస్ సంగీతం అతని జీవితంలోని కష్టాలను ప్రతిబింబిస్తుంది. అతను బృందావనం విడిచిపెట్టిన తర్వాత, అతని జీవనశైలి మారింది మరియు అతని సంగీతం కూడా మారింది. తనను మరియు తన కుటుంబాన్ని పోషించుకోవడానికి, సూరదాస్ ప్రభువుల ఆస్థానాలలో పాడటం ప్రారంభించాడు. ఇది మరింత అధునాతనమైన మరియు పట్టణ సంగీత శైలికి దారితీసింది, ఇది అతను ఇంతకు ముందు వ్రాసిన సాధారణ, జానపద-శైలి కూర్పులకు పూర్తిగా విరుద్ధంగా ఉంది.

సంస్కృత సాహిత్యానికి ఆయన చేసిన కృషితో, ముఖ్యంగా భాగవత పురాణం ఆధారంగా రూపొందించిన సూరసాగర్‌తో, సూరదాస్ పనిని ఇష్టపడని లేదా అభినందించని వ్యక్తిని కనుగొనడం కష్టం. కృష్ణుడి కోసం అతని విలాపం మరియు అతని భార్యను కోల్పోయినందుకు ప్రతీకారం అందమైన పాటలు మాత్రమే కాదు, అవి ప్రపంచవ్యాప్తంగా ప్రజలను తాకిన శక్తివంతమైన కళాఖండాలు. అతను చిన్న వయస్సులో వివాహం చేసుకున్నందున అతను సమాజం నుండి తొలగించబడినప్పటికీ, ఈ ప్రక్రియ ద్వారా అతనికి సహాయం చేసిన వారిలో చాలా మంది గొప్పవారు ఉన్నారు, తద్వారా అతను భారతదేశంలోని అందరితో తన ప్రేమను పంచుకో గలిగాడు – ఇప్పుడు వారు ఉత్తమ భక్తి కవులలో ఒకరిగా పేరు పొందారు.

శ్రవణ జ్ఞానేంద్రియాన్నే నేత్రంగా భావించిన అంధ మహాకవి, ఆధ్యాత్మిక ప్రవక్త, సంత్ సూరదాస్ ఒక కృష్ణ తేజం. రోజూ వారిని స్మరించుకోవడం ఒక గొప్ప భావన, స్ఫూర్తి.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# తులసి మాల విశిష్టత

తులసి రెండు రకాల వర్ణాలు కలిగి ఉంటుంది. తెల్లగా ఉండే తులసిని 'రామ తులసి' అంటారు. నలుపు వర్ణం కలిగిన తులసిని 'కృష్ణతులసి' అని అంటారు. జాతక చక్రంలో శుక్రగ్రహ దోషాల ద్వారా వచ్చే వివాహ, వైవాహిక సమస్యలను రామతులసి ధరించటం వలన దోషాలు తొలగించుకోవచ్చును.

శనిగ్రహ దోషాలైన ఆయుర్దాయ సమస్యలు, అనారోగ్యాలు, ఏలిన నాటి శనిబాధలు కృష్ణతులసి ధరించటం వలన తొలగించుకోవచ్చును. తులసి మాలలో అత్యంత శ్రేష్ఠమైనవి వ్రిందావన్ (బృందావన్) తులసి. ఈ తులసి శ్రీకృష్ణుని జన్మస్థానమైన మధుర పట్టణంలోని నిదివన్ మరియు సేవాకుంజ్ అను రెండు వనములందు లభించును. బృందావనంలో ఆవిర్భవించిన కారణమున బృందావని అని కూడా సౌభాగ్యవతి యగు తులసిని కీర్తించెదరు.

తులసి సాక్షాత్ మహాలక్ష్మియే. సూర్యోదయ కాలమందు తులసి మాలను ధరించినా, పూజించినా విష్ణువును దర్శించినంత పుణ్యఫలములు లభించును. మృత్యువు ఆసన్నమైనపుడు తులసిమాలను ధరించిన సర్వపాపములు నశించి వైకుంఠము నందు కల విష్ణుసన్నిధానమును పొందుదురు.

**"తులసీ స్మరణేరైవ సర్వపాపం వినశ్యతి**
**తులసీ స్పర్శనేరైవ సశ్యంతి వాదయో నృణామ్"**

తులసి స్మరణ మాత్రము చేతనే సర్వపాపములు నశించును. తులసి మాలని స్పర్శించినంత మాత్రము చేతనే సర్వవ్యాధులు నశించును.

తులసిమాల శ్రీమన్నారాయణునకు సమర్పించుకుని, పూజాదికాలు చేయించుకుని లేదా ఇంట్లోనే చేసుకుని ఆ మాలను "ప్రసీద దేవదేవేశి ప్రసీద హరివల్లభే / క్షీరోదమాధనోద్భూతే తులసి త్వాం నమామ్యహమ్" అను మంత్రోచ్చారణతో ధరించేవారు పరమ భాగవతోత్తములు అవుతారట. ఈ మాల ధరించిన వారికి దుశ్శకునములు, దుస్వప్నాల దుష్ఫలితాలు దరికి చేరవు. ఇంకా ఈ జన్మలో చేసిన పాపాలే గాక గత జన్మలో చేసిన పాపాలు కూడా పూర్తిగా నశిస్తాయి. శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మి అనుగ్రహంతో విష్ణుసాయుజ్యం కలుగుతుంది.

## నర్మదా తీరంలో పుణ్యపురాశి

# బేధాఘాట్

- డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు,
9491946070



**మే నెల 1 నుంచి నర్మదా నదీ పుష్కరాల సందర్భంగా:**

సాధారణంగా శివుడు ఏ ఆలయంలోనైనా సరే లింగరూపంలో కొలువుదీరి దర్శనమిస్తూ అశేషభక్తుల అభిషేకాలు, పూజలు అందుకుంటూ ఉంటాడు. కానీ పరమశివుడు మూర్తిరూపంలో తన దేవేరి శ్రీ పార్వతీ దేవితో పాటు నందీశ్వరుడిపై ఆశీనుడై కొలువుదీరి పూజలందుకుంటూ ఉన్న అపురూపమైన... అరుదైన... ప్రాచీనమైన శైవక్షేత్రం –

**నర్మదా నదీ తీరంలోని పవిత్ర క్షేత్రం – బేధాఘాట్!**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్ పూర్ జిల్లాలో జబల్ పూర్ నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో నర్మదా నదీ తీరంలో బేధాఘాట్ వుంది. ఈ క్షేత్రానికి బేధాఘాట్ అనే పేరుతో పాటు బేడాఘాట్, బేరాఘాట్, మేధాఘాట్ అనే పేర్లు వున్నాయి. బేధాఘాట్ ఆలయాన్ని చౌసత్ యోగినీ మందిరం అనే పేరుతో పిలుస్తారు. అందుకు 81 యోగినీ రూపాలు ఈ ఆలయ ప్రాంగణంలో కొలువుదీరి ఉండడమే కారణం. సాధారణంగా యోగినీ ఆలయాల మధ్యలో శివుడు లేదా భైరవుడు కొలువుదీరి వుంటారు. అందువల్లనే ఈ క్షేత్రానికి పూర్వం భైరవఘాట్ అనే పేరు ఏర్పడింది. అది కాలక్రమంలో మార్పు చెంది భైరాఘాట్ అయి చివరకు ప్రజల వాడుకలో బేధాఘాట్ గా మారినట్లు కథనం.

బేధాఘాట్ క్షేత్రంలో శివుడు మూర్తి రూపంలో శ్రీ పార్వతీ దేవితో కలిసి కొలువుదీరడానికి సంబంధించిన ఖచ్చితమైన స్థలపురాణ గాథలేవీ ప్రచారంలో లేకపోయినా పరమశివుడు ఇక్కడ స్వయంభువుగా కొలువుదీరినట్లు కథనం. పూర్వం ఒకసారి పరమశివుడు తనదేవేరి పార్వతీ దేవితో కలిసి భూలోక విహారానికి బయలుదేరి వివిధ ప్రాంతాలను చూస్తూ ఈ ప్రాంతానికి చేరుకున్నాడట. నర్మదా నదీ తీరంలో వున్న ఈ ప్రాంతం శివ పార్వతులను ముగ్ధులను చేసిందట. దీనితో వారు ఈ ప్రాంత ప్రకృతిని ఆస్వాదిస్తూ అలాగే కూర్చునిపోయారు. ఈ విషయం నర్మదా నదీతీరంలో ఆశ్రమాలు నిర్మించుకుని తపస్సూ, యజ్ఞయాగాలు చేస్తూ ఉన్న మహర్షులకు తెలిసి వారు శివ పార్వతులు ఆశీనులైన ప్రాంతానికి చేరుకుని పరిపరి విధాలుగా పూజలు చేయడం ప్రారంభించారు. వారి పూజలను మెచ్చిన శివ పార్వతులు ఏదైనా కోరమని చెప్పడంతో...

“స్వామీ! మీ దర్శనభాగ్యంతో మా జన్మ తరించినది. మీ దర్శన భాగ్యం, మీకు సేవ చేయడం కంటే మాకు కావల్సినది ఏమున్నది! మాకు మీరు ఇప్పుడు దర్శనమిచ్చిన రూపంలోనే ఇక్కడే కొలువుదీరి నిత్యం మిమ్మలను పూజించుకునే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి” అని మహర్షులు వేడుకున్నారు.

మహర్షుల ప్రార్థనలను మన్నించిన పరమశివుడు పార్వతీ సమేతంగా తాము నందిపై కూర్చున్న భంగిమలోనే కొలువుదీరినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

కాగా 10, 11 శతాబ్దాలలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన కాలచుర్య వంశ పాలకులు ఈ స్వామివారిని సేవించి తరించగా ఆ వంశ చక్రవర్తి అయిన రాజా రెండవ యువరాజు స్వామివారిని సేవించడం తో పాటు యోగిని దేవతలను ప్రతిష్టించినట్లు కథనం.

జబల్పూర్ కు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో నర్మదా నదీ తీరంలో వున్న చిన్న కొండపైన ఆలయం వుంది. ఈ క్షేత్రానికి చేరుకున్న భక్తులు ముందుగా నర్మదా నదిలో స్నానం ఆచరించి ఆలయ దర్శనానికి వెళతారు. ఆలయం చిన్న కొండమీద వుంది. కొండమీద వున్న ఆలయానికి చేరుకోవడానికి సోపాన మార్గం వుంది. సుమారు రెండువందల మెట్లు ఎక్కి ఆలయానికి వెళ్ళాలి. ఆలయం విశాలమైన ప్రాంగణంలో వృత్తాకారంలో వుంది. ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించబడివుంది. ఈ ప్రాకారం కూడా వృత్తాకారం లోనే నిర్మితమై వుంది. ఆలయంలోకి ప్రవేశించేందుకు పశ్చిమంగా రెండు, నైరుతి లో ఒక ద్వారం వుంది. ఈ ద్వారాల్లో ఏదోఒక ద్వారం గుండా ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశిస్తూనే ప్రధాన ఆలయం మధ్యలో దర్శనం ఇస్తుంది. ఆలయం ప్రాకారాన్ని ఆనుకుని లోపలివైపు సాలమండపం నిర్మితమై వుంది. ఈ మండపం రెండు భాగాలుగా విభజితమై వుంది. అందులో ప్రాకారాన్ని ఆనుకుని చుట్టూ వున్న సాలమండపం 81 చిన్న భాగాలుగా విభజితమై ఒకదాని ప్రక్కన ఒకటిగా చుట్టూ దర్శనమిస్తాయి. దాని ముందువైపు భక్తులు నడిచేందుకు మార్గం వుంది. ఈ సాల మండపంలో వున్న 81 భాగాలలో 81మంది యోగిని దేవతా మూర్తులు కొలువుదీరి దర్శమిస్తారు. ఇందులో సప్తమాత్రికలతో పాటు వివిధ రూపాలలో అమ్మవారు దర్శనమిస్తారు. అందులో చండిక అమ్మవారు స్మశానంలో మానవ శరీరంపై స్వారీ చేస్తున్న భంగిమలో కొలువుదీరి దర్శనమిస్తుంది. కామదా మూర్తి ఎరుపు రంగు అశ్వం ముఖంతో దర్శనమిస్తుంది. యోని పూజకు సంబంధించిన శిల్పాలు కూడా ఇందులో దర్శనమిస్తాయి. కాగా యోగిని విగ్రహాలలో చాలామటుకు ముస్లింల దండయాత్రల సమయంలో దాడికి గురై వివిధ అవయవాలు పోయిన రూపంలో దర్శనమిస్తాయి. ఈ విధంగా అనేక యోగినీ మూర్తులను దర్శనం చేసుకునే భాగ్యం ఈ క్షేత్రం వల్ల కలుగుతుంది.

ఆలయప్రాంగణంలో ప్రధాన ఆలయం ఉత్తరభారత నిర్మాణ శైలిలో గర్భాలయంపై గోపురంతో శోభాయమానంగా దర్శనం ఇస్తుంది. ఆలయం ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగివుంది. ముఖమండపం స్థంబాలతో కూడుకుని రెండువైపుల ఎత్తైన అరుగులు ఒకవైపు ఆలయంలోకి ప్రవేశించే ద్వారం, మరోవైపు అంతరాలయంలోకి ప్రవేశించే ద్వారంతో శోభాయమానంగా దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయానికి ఎదురుగా గంటలు, ధ్వజం వున్నాయి. వీటికి వెనుకవైపున మండపం వుంది. ఈ మండపంలో శివుడు లింగరూపంలో దర్శనమిస్తారు. ఇక ప్రధాన గర్భాలయంలో శివ పార్వతులు నందీశ్వరుడిపై ఆశీనులై కొలువుదీరి వున్నారు. శివ పార్వతులు ఒకరిని ఒకరు చూస్తున్నట్లుగా దర్శనం ఇస్తారు. ప్రధాన మూర్తులకు కుడివైపున భైరవుడు కొలువుదీరి వుండగా ఎడమవైపున నాట్య భంగిమలో శ్రీ వినాయకుడు, ప్రక్కనే మరో రెండు పరమశివుడి మూర్తులు దర్శనమిస్తాయి. ఈ విధంగా పరమశివుడు అద్భుతంగా దర్శనమిస్తూ పూజలు అందుకుంటూ వున్నాడు. కాగా, ఆ క్షేత్రాన్ని దర్శించి స్వామివారలను పూజించడం వల్ల భార్యాభర్తల మధ్య అన్యోన్యత, ప్రేమానురాగాలు వృద్ధి చెందడంతో పాటు సంతానం ఆలస్యం అవుతున్నవారికి శీఘ్రంగా సంతానం కలుగుతుందని భక్తులలో విశ్వాసం వుంది. అంతేకాకుండా యోగినీ దేవతలను దర్శించి పూజించడంవల్ల సకల విధాల భయాలు తొలగిపోయి.. అనుకున్న పనులు త్వరగా పూర్తి అవుతాయని భక్తులలో ప్రగాఢ నమ్మకం వుంది. అంతేకాకుండా ఈ క్షేత్రంలోని నర్మదా నదిలో స్నానం ఆచరించి ఈ స్వామివారిని సేవించడం వల్ల ఇహంలో సౌఖ్యం, పరంలో మోక్షం సిద్ధిస్తాయని చెప్పబడుతూ వుంది.

చారిత్రకంగా పరిశీలిస్తే అత్యంత ప్రాచీన కాలం నుంచే ఈ ఆలయంలో దేవతా మూర్తులు పూజలు అందుకుంటూ ఉండేవారని తెలుస్తోంది. కాగా త్రిపురి కాలచుర్య వంశ పాలకుడు అయిన రాజా రెండవ యువరాజు (975-1025) ప్రస్తుతం దర్శనం ఇస్తున్న ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రిక ఆధారాలు వెల్లడిస్తూ వున్నాయి. తర్వాత అదే వంశ పాలకులు 1125 వ సంవత్సర ప్రాంతంలో మరింత అభివృద్ధి పరిచినట్లు తెలుస్తోంది. మొగల్ సుల్తాన్ ఔరంగజేబు పాలకుడుగా వున్న సమయంలో ఈ ఆలయం పైన జరిగిన దాడిలో విగ్రహాలు దెబ్బతిన్నాయి. స్వాతంత్రానంతరం ఆలయంలో జీర్ణోద్ధారణ జరిగి పునరుద్దరించ బడింది.

ప్రతిరోజు పూజలు జరిగే ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉత్సవాలను నిర్వహిస్తారు. దేవీ నవరాత్రులు, వసంత నవరాత్రులు వంటి ప్రత్యేక రోజులలో విశేష పూజలను నిర్వహిస్తారు.

బేధాఘాట్ లోని ప్రైవేటు లాడ్జీలలో భక్తులకు వసతి సౌకర్యాలు లభ్యమవుతాయి. జబల్ పూర్ నుంచి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న బేధాఘాట్ కు జబల్ పూరు నుంచి బస్సులు ప్రైవేటు వాహన సౌకర్యం వుంది. అందులోనూ ఇక్కడ వున్న జలపాతాలను చూసేందుకు సందర్శకులు అధిక సంఖ్యలో వస్తూ వుండడం వల్ల అన్ని సమయాల్లోనూ రవాణా సౌకర్యం వుంది.

ప్రాచీన అరుదైన క్షేత్రం అయిన బేధాఘాట్ క్షేత్రాన్ని దర్శించి దివ్యమైన అనుభూతిని పొందవచ్చు.

★★★

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

## గత సంచిక తరువాయి

పూర్వజన్మలో ఎవరైవుంటుంది ఈ పూతన– కృష్ణుడు ఆలోచిస్తూ కళ్లు మూసుకున్నాడని వ్యాఖ్యానించారు కొందరు. బలిచక్రవర్తి కుమార్తె కదా–రత్నమాల–బొద్దుగానూ ముద్దుగానూ పొట్టిగానూ వున్న నా లేత వామనరూపాన్ని చూసింది. అంతటి చక్కనైన కొడుకు కావాలనుకుంది.తర్వాత తన తండ్రిని శిక్షించినందుకు ప్రతీకారంగా నన్ను చంపాలనుకుంది. అటు మాతృభావంతో పాలివ్వడానికి–ఇక ఇటు శత్రుభావంతో చంపడానికి వచ్చింది.ఆవిధమైన ద్వైత భావంతో అంటే లోపల ఒకవిధంగా బయటికి మరొక విధంగా కపటబుద్ధితో ప్రవర్తించేవాళ్లని చూడరాదని కళ్లు మూసుకున్నాడట కృష్ణుడు.

బాల ఘాతి మహా మారి పూతన తల్లి ప్రేమను ఒలకబోసుకుంది.కృష్ణునికి పాలిచ్చింది.పూతన స్తన్యంతో పాటు ప్రాణాలను శరీరంలోని మాలిన్యాలను పీల్చాడు కృష్ణుడు.

చెప్పాలంటే పూతన అవిద్యకు ప్రతీక.ఆ అవిద్య భగవంతునితోనే సంపూర్తిగా నశించి తీరాలి. భగవత్ స్పర్శతో ---

పూతన హతమైందనుకునేలోగానే మరొక అరిష్టం. ఒకడు శకటరూపంలో ఆవహించాడు. శకటాసురుడు అన్నారు. కన్నయ్య లేత చిన్నికాలితో ఒక తన్ను తన్నాడు. అంతే. శకటాసురుడు బండితో పాటుగా పైకెగిరాడు. ఇరుసు చక్రాలు ముక్కలు ముక్కలయ్యాయి. ఏ కీలుకాకీలు విరిగి చచ్చాడు.

శకటం అంటే బండి. అందులో శ అంటే శరీరం. కం అంటే సుఖం. శరీరంలోని జీవుడు శాశ్వతమైనట్టి సుఖం (ముక్తి) వైపు ప్రయాణించాలికదా.అయితే మనం కర్మశకటం మీద జన్మనుంచి మరొక జన్మ లోనికి నిరంతరమూ ప్రయాణిస్తున్నాం.మన కర్మశకటాన్ని కీళ్లు విరిగిపడేలా కృష్ణుడు తన్నాలని ప్రార్థించాలి.

కృష్ణ భగవానుని దివ్యపదపద్మాల స్పర్శతో దంభం దర్పం అహంకారాది అసురశక్తులు పటాపంచలైపోతాయి. అందుకే నీ పాదమే శరణు అన్నారు పరమభక్తులు.

పాలు జ్ఞానానికి సంకేతం. ఆ పాలను తోడుపెట్టడం– ధ్యానం. అది గట్టిపడిన పెరుగు. అది భక్తి. ఆ పెరుగును చిలికితే వచ్చేది వెన్న. అది మెత్తగా వుంటుంది. ఏ కొంచం వేడి తగిలినా కరిగిపోతుంది. అదే భక్తి పండిన ప్రేమ. ఏమాత్రం కల్మషంలేని జీవుల సొమ్ము ఆ ప్రేమ. సకల చరాచర జీవకోటిని ప్రేమించే మనసున్న మారాజు కృష్ణ భగవానుడు. భక్తుల కష్టాలను చూసి వెన్నలా కరిగిపోయే కరుణామూర్తి. ఆ లీలామానుషుని దివ్యమైన చేష్టలలోని ఆంతర్యాన్ని గ్రహించలేక వెన్న దొంగగా నిర్దయతో నింద మోపినపుటికినీ– నవ్వు రాజిల్లెడి మోముతో కృపారసాన్ని మనమీద చల్లేస్తున్న సౌశీల్యమూర్తి.

కృష్ణుడు మన్ను తిన్నాడని యశోదమ్మకు ఫిర్యాదు అందింది. నాహం భక్షితవానంబ సర్వే మిథ్యాభిశంసః-----పశ్యమే ముఖం – అమ్మా! మన్ను తినంగ నే శిశువునో ఆకొంటినో వెర్రినో – వాళ్ల మాటలు నమ్మవద్దు. నమ్మకపోతే నా నోరు చూడంటూ తెరిచాడు.

చూస్తూంటే– అంతరిక్షం జ్యోతిర్మండలం తరువాత సూర్యుడు చంద్రుడు ఇంకా అగ్నివాయువులు ఇంకా నలుదిక్కులు పర్వతాలు సముద్రాలు ద్వీపములు భూమి ఇంకా సకల చరాచరజీవకోటి గోకులం నందయశోదలు (తనని తాను) దర్శించుకున్నది. అంతే, ఆశ్చర్యచకితురాలైంది యశోదమ్మ.

ఇదంతా కలయో। వైష్ణవ మాయో। ఇతర సంకల్పార్థమో। సత్యమో। తలపన్ నేరక వున్నదాననో। యశోదాదేవిని కానో। పరస్థలమో। బాలకుడెంత। ఈతని ముఖస్థంబై అజాండంబు। ప్రజ్వలమై వుండడానికి కారణమేమిటో మహాశ్చర్యంగా వుందనుకున్నది యశోదమ్మ తనలో తాను.

యశోదమ్మకు కనిపించినట్టి గోకులం ప్రదేశం మొత్తం నాదే. అక్కడున్న సంపదలన్నీ నాకు చెందినవే. ఇదంతా నాదే అని

అనుకోవడమనేది నా అజ్ఞానమే. నిజానికి నాదంటూ ఏదీలేదు. అంతా భగవానునిదే. ఇక ఇతడే నాకు శరణ్యమని ఆలోచిస్తున్న తల్లికి మాయని ఆవరింపచేసాడు స్వామి.

కుండ పగులగొట్టి వెన్నను తీసుకుని తోడివారలకు కోతులకు పెడుతున్నాడు కృష్ణుడు. అమ్మ చేతిలోని బెత్తాన్ని చూసాడు. పరిగెత్తాడు. వెంటపడింది యశోదమ్మ.

తపస్సమాధుల్లో వున్న యోగులకు మునులకు అందనట్టి పరబ్రహ్మ- యశోద చేతికి చిక్కుతాడా? అయినా యశోదమ్మ పరిగెత్తి పరిగెత్తి ఇక అలసిపోయింది. మెల్లగా నడిచినా ఆయాసపడుతోంది. అమ్మను చూసాడు. జాలిపడి తానే పట్టుబడ్డాడు. రాని ఏడుపు ఏడుస్తున్నట్లు నటిస్తూ-చిన్ని కృష్ణుడు తన చిట్టి చేతులతో కనులు నులుముకున్నాడు. కండ్ల కాటుక ముఖానికి అంటుకుంది. ఇక భయంతో బిత్తరి చూపులతో- అమ్మ గమనిస్తుందో లేదోనని క్రీగంట చూస్తున్నాడు. నిజంగా భయపడ్డాడని బెత్తాన్ని పడేసింది యశోద.

ఇక మీదట అల్లరి చేసావో- కొడతా కన్నా! అన్నది యశోదమ్మ. ఎందుకైనా మంచిదని ఒక తాడుతో కట్టి పడేస్తే ఇక బుద్ధిగా వుంటాడనుకుంది ఆమె. కానీ దివ్య పురుషుడు కృష్ణుడు కదా.

**న చాంతర్న నాపి బహిర్యస్య-న పూర్వం నాపి చాపరమ్।**
**పూర్వాపరం బహిశ్చాంతర్జగతో యో జగచ్చ యః॥**

ఆ కృష్ణభగవానుడు బహిరంతరాలు లేనివాడు. ఆస్వామి సృష్టికి పూర్వమూ అనంతరమూ నిత్యుడై- శాశ్వతుడై వున్నాడు. ఇక ఈ జగత్ స్వరూపుడైన దివ్యప్రభువును తన కొడుకనే అనుకుందామె. ఒక తాడు తెచ్చింది.చిన్ని పొట్ట చుట్టూ తిప్పాక-ముడివేద్దామనుకున్నది-కానీ రెండు అంగుళాలు తక్కువ వచ్చింది. మరొక తాడును జతచేసి చుట్టినా- మరలా రెండంగుళాలు తక్కువ-అలా ఎన్నెన్ని తాళ్లు కూర్చి కట్టినా రెండంగుళాల మేర తక్కువ వస్తోంది. బొజ్జలో పద్నాలుగు లోకాలు వున్న పరమాత్మని కట్టడం సాధ్యమా?

చూసాడు అమ్మని. ఒళ్ళంతా చెమటలతో బాగా తడిసిపోయింది.కృష్ణభగవానుడు లోకానికి తన భక్తపరాధీనతను చాటి చెప్పాడు. కర్మబంధాల్ని- భస్మం చేసే మోక్షప్రదాత కృష్ణపరమాత్మ యశోదా మాతకు బందీయైపోయాడు.

భార్యతో నీ వాణ్ణి అంటాం. తరువాత ఆఫీసర్/బాస్ తో ప్రతిదినమూ yours sincerely/obediently అంటూ వుంటాం. నేను నీవాడనని-నేను నీకు దాసుడనని-ఇకమీదట నీవు చెప్పబోయే పనులు ఎలాంటివి అయిననూ శ్రద్ధతో చేయగలవాణ్ణి-అంటూ ఒకే ఒక్కసారి భగవానునితో మనసు విప్పి అనలేకున్నాం. నేను నాది నాకోసం అనే అహంకార మమకారాలే ఆ రెండంగుళాలకి సంకేతం.

1. దామం అంటే తాడు. ఆ దామం ఉదరమందు (పొట్ట)



కలవాడు.

2. దామమంటే లోకాలు అని అర్థం. పద్నాలుగు లోకాలు తన ఉదరమందు కలవాడు.

3. యశోదమ్మ చిన్ని కృష్ణుని పొట్టకు తాడు గట్టిగా బిగించడం వలన-లేత చర్మం కందిపోయింది. అది ఒక మచ్చగా ఏర్పడింది. అందుకని కృష్ణుణ్ణి దామోదరుడు అంటూ పిలిచారు. ఇక ఒకటేమో పరత్వనామం- ఇంకొకటి సౌలభ్యనామం.

తుంటరివాడు తాళ్లని విప్పకుండా వుండాలని రోటికి బాగా కట్టేసినది యశోదమ్మ. ఆ పెరట్లో ఎన్నో రకరకాల చెట్లు వున్నాయి. వాటిలో రెండు మద్ది చెట్లపై కన్నయ్య చూపు పడింది.

నలకూబర-మణిగ్రీవులు ఇద్దరునూ కుబేరుని కుమారులు. వాళ్లిద్దరూ జాతి ధన విద్యా సౌందర్య బల గర్వితులు. నారదమహర్షి-వృక్షాలై పడివుండాలని వాళ్లని శపించాడు. అప్పటినుంచి సాలవృక్షాలై అక్కడి పెరట్లో పడివున్నారు.

ఒక్క ఉదుటున రోటిని ఈడ్చుకుంటూ వెళ్లాడు కృష్ణదేవుడు. అతని బలానికి రోలు తిరగబడింది. చెట్లమధ్యలోకి దూరాడు. ఆ వృక్షాలు కూకటివేళ్లతో లేచి నేలకు కూలిపోయాయి. నలకూబర మణిగ్రీవులకు శాపవిమోచనమై-తమ తమ దివ్యమైన తేజస్సులతో నిలబడ్డారు. వెంటనే కృష్ణభగవానునికి సాగిలపడ్డారు. కృష్ణుణ్ణి స్తుతించారు. నలకూబర మణిగ్రీవులు వృక్షాలుగా మారినారు. నహుషుడు కొండచిలువ అయ్యాడు. ఇంకా నృగుమహారాజు ఊసరవెల్లి అయినాడు.

కర్మఫలానుసారంగా పశు పక్షి కీటకాది నీచజన్మలు లభిస్తాయి కూడా. అయితే మనిషి పుట్టుక ఒక అదృష్టం. ఇక మనం చీకటి గుయ్యారాల్లో మగ్గిపోవడమనే హీనాతిహీనమైన జన్మలను వద్దనుకుంటే మనం మన Ego-Identity అన్నింటినీ భగవదర్పితం చేయాలి. అపుడు సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతనామృతస్వాద సంధానులం కావాలి. అపుడే మనకు మోక్షం.

మరి ఇంకొక రకంగా చెప్పాలంటే శ్రీహరి నివాసం పాలకడలి. అదెంతో తెల్లనిది. ఆవిధంగా మన హృదయం తెల్లగా వుండాలి. అది భగవన్నిలయం కావాలి. అపుడే నాహం కర్తా - హరిః కర్తా.

**(సశేషం)**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

గత సంచిక తరువాయి

## శంఖ మహారాజుకు శ్రీనివాసుని దర్శనం :

దిలీపా! పూర్వం సూర్య వంశంలో శంఖుడనే మహారాజు ఉద్భవించాడు. అతడు మహాప్రాజ్ఞుడు. ఆయన శ్రీ మహావిష్ణువును సాక్షాత్కరింప చేసుకొని వరం పొందాడు. సూర్య చంద్రాదులు, భూమి ఉన్నంతకాలం నేను భగవంతునికి చేసే సేవ స్థిరంగా ఉండాలి! అని మనస్సులో ఆలోచించి తన కుమారునికి రాజ్యాధిపత్యాన్ని యిచ్చి వసిష్ఠుని వద్దకు వెళ్ళి మహర్షీ ! బ్రాహ్మణోత్తమా! శ్రీమహావిష్ణువు ఏ పుణ్యక్షేత్రంలో సులభంగా ప్రసన్నుడవుతాడు? నా కెక్కడ ఆ భగవంతుని దర్శనమవుతుంది? అటు వంటి దివ్యక్షేత్రాన్ని గురించి తెలియజేయండి అని అడుగగా వశిష్ఠ మహర్షి శంఖ మహారాజుతో యిలా అన్నాడు.

ధర్మాత్ముడైన శంఖరాజా! అగస్త్యమహర్షి భగవంతుని దర్శింపగోరి శేషాద్రిలో తపస్సు చేస్తున్నాడు. సర్వ వ్యాపియైన భగవంతుడు ఆయనకు అక్కడ సాక్షాత్కరిస్తాడు. నీవు కూడా శేషాద్రికి వెళ్ళు. ఆ పర్వతం సువర్ణముఖరీ నదీతీరంలో ఉంది. ఆ నది మధ్యలో ఒక బ్రహ్మశిల ఉంది. ఆ శిల అగస్త్యుని తపః ప్రభావం వలన గయా క్షేత్రంతో సమానమైన మహిమ గలది. శివుడు, విష్ణువు మొదలగు దేవతల పాదములు అక్కడ ఉన్నాయి. అక్కడ సువర్ణముఖరీ నదితో కల్యాణీ నది కలుస్తుంది. ఆ రెండు నదులు కలిసే సంగమ స్థానంలో యథావిధిగా సంకల్పం చేసి స్నానమాచరించి దేవతలను, ఋషులను పూజించి ఆ బ్రహ్మశిల మధ్యలో పితృదేవతల నుద్దేశించి భక్తితో శ్రాద్ధములను, తర్పణములను, పిండప్రదానములను శ్రద్ధతో ఆచరించే వారి ఏడు తరాలవరకు గయలో పిండ ప్రదానములు చేయుట వలన పితృదేవతలు ఎలా సంతోషిస్తారో ఆ విధంగా వారి పితృ దేవతలు తృప్తి చెందుతారు ఇది సత్యం. ఇందుకు సందేహం లేదు. ఆరోజున అన్నదానం చేసి తాంబూలం, చందనాదులు, గోదానం, భూదానం, తిలదానం, హిరణ్యదానం, వస్త్రదానం, ధాన్యందానం యధాశక్తి చేసినట్లైన అణుమాత్రం మేరువుతో సమానం అవుతుంది. కావున ఓ రాజేంద్రా నీవా మహానదుల సంగమస్థానంలో స్నానం, దానం చేసి, పితృ దేవతలకు శ్రాద్ధం, పిండ ప్రదానం, తిలోదకాలు యిచ్చి ధ్యాన యోగాన్నవలంబించి వృషాచలంలో వాసుదేవుని యందు మనస్సు పెట్టి తపస్సు చెయ్యి.

కొంతకాలం తరువాత అగస్త్య మహర్షి తన శిష్యులతో అక్కడికి వస్తారు. నీవు ఆ మహర్షి చెప్పే వేంకటాచల మాహాత్మ్యాన్ని వింటూ ఆయనతోపాటు గిరిప్రదక్షిణం చేస్తూ, ఆయనతోపాటు తపస్సుచెయ్యి. సమాధిస్థితిలో వున్న నీకు భగవంతుడు ప్రత్యక్షమవుతాడు. నీవాయనను స్తోత్రం చేయగా నీకు సర్వాభీష్టాలు ప్రసాదిస్తాడు ! అని చెప్పాడు.

గురువుగారిచే ఈ విధంగా ప్రేరేపించబడినవాడై శంఖమహారాజు వేంకటాచలానికి వెళ్ళి అక్కడ తపస్సు చేశాడు. ఆ తరువాత అగస్త్యమహర్షితో కలిశాడు. భగవంతుడు ప్రత్యక్షం

కాగా ఆయనను ఈ విధంగా వరమడిగాడు - 'ఓ దేవదేవా ! సూర్య చంద్రాదులు, భూమి ఉన్నంతవరకు నేనీ పర్వతంపై నీకు చేసే సేవ స్థిరంగా ఉండేటట్లుగా వరాన్ననుగ్రహించండి.

అప్పుడు భగవంతుడు శంఖరాజుతో యిలా అన్నాడు.

## శంఖరాజు నిర్మించిన దివ్య విమానం :

ఓ శంఖరాజా ! నా మాట విను. సచ్చిదానందమూర్తినైన నేను అర్చామూర్తిగా స్వయంగా వెలసిన ప్రదేశాలలో బ్రహ్మాది దేవతలు, యోగులు నన్ను దర్శిస్తారు. కొంతమంది దానిని కేవలం ప్రతిమ అని అనుకొంటారు. కలియుగంలో అలాగైనా నన్ను దర్శించినా చాలు. అన్ని యుగాలలోను పుణ్యాత్ములకు, పాపాత్ములకు అందరికీ నేను దర్శనమిస్తూ ఉంటాను కాని నాదివ్య రూపాన్ని పాపాత్ములు దర్శింపలేరు. కావున దానిని మరుగు పరచితిని, వారంతా ధ్యానించడానికి వీలైన శిలాప్రతిమను నీవు నిర్మించు.

రాళ్ళు, కొయ్యలు, ఇటుకలతో ఆలయ గోపురాన్ని నిర్మించు. యోగులు కాని వారు దానిని దర్శిస్తారు. బ్రహ్మజ్ఞానులు రెండు రూపాలు దర్శిస్తారు. సూర్యుడు తన కిరణాలచే భూమి నుండి నీటిని గ్రహించినట్లు నేను ఆ ప్రతిమ ద్వారా భక్తులు చేసే పూజను గ్రహిస్తాను. నీవు ఏ విధంగా నా రూపాన్ని, ఈ దివ్య విమానాన్ని దర్శించావో అలాగే వాటిని నిర్మించు. నీవు నా ఆలయాన్ని నిర్మించి, దానిలో నా మూర్తిని ప్రతిష్ఠించి ఆరాధించు. నేను భక్తుల పూజలను, సేవలను స్వీకరించి వారిననుగ్రహించి, వారి అభీష్టాలను నెరవేరుస్తాను. దానివలన నీవు కోరిన ఫలితం సిద్ధిస్తుంది. నీకు శుభం కలుగుతుంది. నీ కోరిక నెరవేరుతుంది ! అని ఆదేశించి భగవంతుడు అందరూ చూస్తూండగానే అదృశ్యమయ్యాడు.

శంఖ మహారాజు భగవంతుడాదేశించిన విధంగా దివ్య ఆలయాన్ని గోపురాన్ని నిర్మించి, దానిలో శ్రీనివాసుని దివ్య మంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠించి భూలోకంలో స్వామి వైభవాన్ని ప్రకటింపచేశాడు మానవలోకానికి మహోపకారం చేసిన ఆ శంఖమహారాజు చివరకు శాశ్వతమైన, అవ్యయమైన వైకుంఠలోకాన్ని పొందాడు.

**"సాక్షాత్పూజాశ్రయో నిత్యం అహం బింబాంతరేణ చ |**
**యథాదృష్టం విమానం తే మద్రూపం పురుషర్షభ ! ||**
**తథా కురు మహాభాగ ! తేన తే భవితా గతిః |**
**ఇత్యుక్త్వాతర్దధే దేవః సర్వేషామేవ పశ్యతామ్ ||**
**తేనోక్తమార్గేణ విధాయ పుణ్యం**
**విమానవర్యం ప్రతిమాం చ పుణ్యామ్ |**
**ప్రఖ్యాప్య శంఖో నరలోక సంఘే**
**జగామ విష్ణోః పదమవ్యయం శుభమ్" ||**

**బ్రహ్మపురాణం. 3వ అధ్యాయం. శ్లో. 49,50,51.**

## సప్తగిరులలో సప్త తీర్థాలు :

దిలీపుడు దుర్వాసమహర్షితో 'మహర్షీ ! ఈ పర్వతంలో ఎన్ని తీర్థాలున్నాయి ? వాటిల్లో ముఖ్యమైనవి ఏవి ? వాటిల్లో కూడా ప్రధానమైనవి ఏవి ? వాటిలో ధర్మాచరణకు ఆసక్తిని కలిగించేవి ఎన్ని ? భక్తి జ్ఞాన వైరాగ్య ప్రదాలెన్ని ? ముక్తి ప్రదాలెన్ని ? అని ప్రార్థించాడు.

అంతట దుర్వాస మహర్షి దిలీపునితో యిలా చెప్పాడు- 'రాజా!

**"షట్షష్టి కోటి తీర్థాని పుణ్యాన్యత్ర నగోత్తమే |**
**అష్టోత్తర సహస్రన్తు తేషు ముఖ్యాని సువ్రత ! ||**

**బ్రహ్మపురాణం. 4వ అధ్యాయం, శ్లో. 4.**

ఈ పర్వతంలో అరవై ఆరు కోట్ల పుణ్య తీర్థాలున్నాయి. వాటిలో 1008 తీర్థాలు ముఖ్యమైనవి. ఇవి ధర్మము నందు ఆసక్తిని కలిగిస్తాయి. వాటిలో 108 తీర్థాలు విజ్ఞాన ప్రదములు. కావున అవి చాలా ముఖ్యమైనవి. 68 తీర్థాలు భక్తివైరాగ్య ప్రదములు. ఏడు తీర్థాలు ముక్తిదాయకాలు అని పెద్దలు చెబుతారు. అవి 1. స్వామి పుష్కరిణి 2. ఆకాశగంగ 3. పాప వినాశనం 4. పాండవ తీర్థం 5. కుమారధారా తీర్థం. 6. తుంబురు తీర్థం 7. రామ కృష్ణ తీర్థం. ఈ ఏడు తీర్థాలు సర్వ పాపాలను పోగొట్టి సకల శుభాలను కలిగిస్తాయి. ఈ తీర్థాలలో స్నానం చేసిన మానవులు పరమపదాన్ని పొందుతారు.

ఈ వేంకటాద్రిలోని ఈ ఏడు తీర్థాలలో ప్రతి సంవత్సరం ఆయా తిథి, నక్షత్రములు కలిసినప్పుడు ఆ పర్వదినాలలో భారత దేశంలోని సమస్త పుణ్య తీర్థములు వచ్చి ఒక్కొక్క తీర్థంలో కలుస్తాయి. ఆ పర్వకాలాలను తెలియ జేస్తాను. సావధానంగా విను. సూర్యుడు మకరరాశిలో ఉండగా పూర్ణిమ తిథినాడు పుష్యమీ నక్షత్రం (పుష్య పౌర్ణమి) రామకృష్ణ తీర్థానికి పర్వకాలం. ఆ పర్వదినాన ఆ తీర్థంలో స్నానం చేసే బుద్ధిమంతులు సర్వపాపముల నుండి విముక్తులై సకలాభీష్టాలను పొందుతారు. కుంభమాసంలో (మాఘమాసంలో) పౌర్ణమినాడు మఖా నక్షత్రంలో కుమారధారా తీర్థంలో అన్ని తీర్థాలు వచ్చి చేరతాయి ఆ రోజున ఆ తీర్థంలో స్నానం చేస్తే రాజసూయ యాగం చేసిన ఫలితం వస్తుంది. పుత్రప్రాప్తి కూడా కలుగుతుంది. ఇక మోక్షం వస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. కుమారధారా తీర్థంలో పితృదేవతల నుద్దేశించి అన్నదానం చేసి దక్షిణలనివ్వాలి

ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో శుక్ల పక్షంలో పౌర్ణమి నాడు (ఫాల్గుణ పౌర్ణమి) రవి మీన రాశిలో నుండగా అపరాహ్ణ సమయంలో సర్వతీర్థాలు తుంబురు తీర్థంలో వచ్చి చేరతాయి. ఆ పుణ్య సమయంలో ఆ తీర్థంలో స్నానం చేసిన వారికి పునర్జన్మ ఉండదు. ఆ సమయంలో అక్కడ వివాహోపనయనాదులు చేయాలి. ధనాన్ని దానం చేయాలి.

సూర్యుడు మేషరాశిలో ఉండగా చిత్రా నక్షత్రంతో కూడిన చైత్ర

పౌర్ణమి నాడు ఆకాశ గంగలో అన్ని తీర్థాలు వచ్చి చేరతాయి. ఆ సమయంలో ఆ తీర్థంలో స్నానం చేసిన వారికి నూరు యజ్ఞాలు చేసిన ఫలితం లభిస్తుంది ఆ పర్వదినంలో అక్కడ సువర్ణదానం చేయాలి. విశేషించి కన్యాదానం చాలా శ్రేష్ఠం.

సూర్యుడు వృషభరాశిలో నుండగా ద్వాదశి ఆదివారం నాడు శుక్ల పక్షం గాని, కృష్ణ పక్షంగాని మంగళవారంగాని, మూడు లోకాల్లో ఉన్న గంగాది నదులన్నీ పాండవ తీర్థంలో వచ్చి చేరతాయి. అప్పుడు అక్కడ స్నానం చేసి గోదానం చేస్తే ఆటంకాలన్నీ తొలగిపోతాయి. సంగమ కాలం (పగలు యొక్క రెండవ భాగం) ఈ దాన ధర్మాదులు చేయడానికి ఉత్తమమైనదిగా మహర్షులు చెప్పారు. ఆశ్వయుజ మాసంలో శుక్లపక్షం ఆదివారం సప్తమి తిథి నాడు ఉత్తరాషాఢ నక్షత్రంతో గాని, ఉత్తరాభాద్రా నక్షత్రంతోగాని కూడిన ద్వాదశినాడు పాపనాశన తీర్థంలో స్నానం చేసిన మానవులు మోక్షం పొందుతారు. ఆ పుణ్యతీర్థంలో స్నానంచేసి, సాలగ్రామ శిలను దానం చేస్తే కోటి జన్మలలో చేసిన పాపాల నుండి విముక్తు లౌతారు.

**"ధనుర్మాసే సితే పక్షౌ ద్వాధ్యామరుణోదయే ।**
**ఆయాన్తి సర్వతీర్థాని స్వామి పుష్కరిణీజలే" ॥**

**–బ్రహ్మ పురాణము. 4వ అధ్యాయము, శ్లో. 27.**

ధనుర్మాసంలో శుక్ల పక్షంలో ద్వాదశినాడు అరుణోదయ సమయంలో స్వామి పుష్కరిణిలో సకల తీర్థాలు వచ్చి చేరుతాయి. ఆ రోజున వేల జన్మలలో పుణ్యం చేసిన వారికి మాత్రమే స్వామి పుష్కరిణిలో స్నానం చేసే మహాభాగ్యం లభిస్తుంది. పుణ్యం చేయని వారికి లభించదు. అక్కడ ఒక్కసారి స్నానం చేస్తే గంగాది తీర్థాలలో శతకోటి జన్మలలో స్నానం చేసిన ఫలితం వస్తుంది అక్కడ యథావిధిగా తమ తమ శక్తిననుసరించి, శక్తి వంచన లేకుండ దానాలు చెయ్యాలి.

సాలగ్రామ శిలాదానం, అన్నదానం, గోదానం, విశేషించి భూదానం చేయాలి అలా దానాలు చేసినవారికి బ్రహ్మలోకం ప్రాప్తిస్తుంది. అక్కడ పితృదేవతల నుద్దేశించి శ్రాద్ధాదులు, తర్పణాలు చెయ్యాలి.

**"అరుణోదయమారభ్య తత్ర షట్ఘటికావధి ।**
**సంగమః సర్వతీర్థానాం తత్ర పుణ్యమనన్తకమ్" ॥**

**–బ్రహ్మ పురాణము. 4వ అధ్యాయము, శ్లో. 32.**

అరుణోదయం నుండి ఆరు ఘడియల వరకు తీర్థాలన్నీ వచ్చి స్వామి పుష్కరిణిలో చేరుతాయి. ఆ శుభసమయం అనంతమైన పుణ్యాన్నిస్తుంది. ఆ సమయంలో స్నానం చేస్తే అపారమైన పుణ్యం లభిస్తుంది.

## ఏడు కొండలలో 68 తీర్థాలు :

దిలీపుడు దుర్వాసమహర్షితో మహాత్మా ! భక్తి వైరాగ్యాలనిచ్చే 68 తీర్థముల వైభవాన్ని గురించి వినాలని ఉంది. కావున దయచేసి నాకు మీరు వాటి పేర్లను వివరంగా చెప్పండి 'అని అడిగాడు. అప్పుడు దుర్వాసమహర్షి యిలా చెప్పనారంభించాడు.

దిలీపమహారాజా ! భక్తి వైరాగ్య ప్రదాలు పరమ పవిత్రాలు, పాప వినాశకాలు అయినటువంటి అరవై ఎనిమిది తీర్థముల మాహాత్మ్యాన్ని, వైభవాన్ని చెబుతాను, విను, ఈ పుణ్య తీర్థముల పేర్లను స్మరించినంత మాత్రముననే మానవులు చేసే అనేక కోట్ల మహా పాపాలు కూడా వెంటనే నశిస్తాయి. ఇక వాటిలో స్నానానుష్ఠానాదులు చేసే మహాత్ముల పుణ్య విశేషాన్ని గురించి చెప్పేదేముంది ? వాటన్నింటిని వరుసగా చెబుతాను. నీవు సావధానంగా విను.

శ్రీనివాసునికి తూర్పుదిక్కున ఆగ్నేయమూల సుదర్శనుడు అధిష్ఠించిన చక్రతీర్థమున్నది దానిపైన ప్రసిద్ధము, మనోహరమైన వజ్ర తీర్థమున్నది. అక్కడే దేవేంద్రుని పాపాన్ని పోగొట్టిన విష్వక్సేనతీర్థం ఉంది. ఆపైన పంచాయుధ తీర్థాలున్నాయి. వాటి మధ్యలో హలాయుధతీర్థమున్నది. దానికి ఈశాన్య దిశలో మనోహరమైన నారసింహతీర్థమున్నది. ఆపైన కాశ్యప తీర్థం, ఆతరువాత మన్మథతీర్థం, బ్రహ్మతీర్థం, అగ్నితీర్థం, గౌతమతీర్థం, దైవ తీర్థం, దేవలతీర్థం, విశ్వామిత్ర తీర్థం, భార్గవతీర్థం, అష్టావక్ర తీర్థాలున్నాయి.

అగ్నేయదిక్కులో దురారోహణ తీర్థం, ఈశాన్య దిక్కులో భైరవ తీర్థం ఉన్నాయి. ఈ భైరవ తీర్థం పిశాచ బాధలను పోగొడుతుంది. ఆపైన మేహతీర్థం ఉంది. అది ఉదరవ్యాధులను పోగొడుతుంది. ఆ ప్రక్కన క్షేత్రపాల శిలా తీర్థముంది. దానికి పశ్చిమంలో పాండవ తీర్థముంది. తరువాత వాయుదేవుడు సేవించే వాయుతీర్థమున్నది. అక్కడే మహాపుణ్యప్రదమైన అస్థి తీర్థమున్నది. ఇక్కడ చనిపోయినవారి అస్థికలను ముంచితే వారు పునర్జీవితులవుతారు. వారికి పూర్వ శరీరం లభిస్తుంది. ఈ తీర్థం అంతటి మహత్తరమైనది.

ఆ పైన మార్కండేయ తీర్థమున్నది దానిలో స్నానం చేస్తే ఆయుష్షు వృద్ధి అవుతుంది. ఆ తరువాత జాబాలి తీర్థం, వాలఖిల్య తీర్థం, జ్వరహర తీర్థాలున్నాయి. ఈ జ్వరహర తీర్థంలో స్నానం చేస్తే అన్ని రకాల జ్వరాలు నశిస్తాయి. ఆపైన ఆస్తీక మహర్షి నిర్మించిన విషహరమనే తీర్థమున్నది. దానిలో స్నానం చేస్తే తక్షకుడు కరిచినా కూడా ఆ విషం తొలగి పోతుంది. ఆ తరువాత తూర్పు దిక్కులో లక్ష్మీ తీర్థమున్నది. ఇది సర్వసంపత్ప్రదము.

వాయవ్యదిశలోను, ఉత్తర దిక్కున ఇంకొన్ని తీర్థాలున్నాయి. అవి ఏమిటంటే ఋషి తీర్థం, ఇది మహా పవిత్రమైనది. శతానంద తీర్థం, సుతీక్ష్ణక తీర్థం, వైభాండక తీర్థం, బిల్వ తీర్థం ఉన్నాయి. ఇవన్నీ మహాపుణ్య ప్రదమైనవి. కొంచెం క్రింది భాగంలో విష్ణు తీర్థం అనే పుణ్య తీర్థముంది. దీనిని ఆంజనేయస్వామి నిర్మించాడు. అలాగే సర్వతీర్థం, శరభతీర్థం, ఉన్నాయి. ఆ పైన వాయవ్య దిక్కున మనోహరమైన బ్రహ్మతీర్థముంది. ఇక్కడ



బ్రహ్మదేవుడు భగవంతుని ప్రీతికై అశ్వమేధయాగం చేసి ఆయనను ఆరాధించాడు. భరద్వాజ తీర్థం, ఆపైన ఆకాశగంగ, వరుణ తీర్థం, (ప్రాచేతస తీర్థం), ఉన్నాయి.

ఆ తరువాత పాపవినాశన తీర్థమున్నది. ఇది సర్వపాపాలను పోగొడుతుంది. అక్కడే సరస్వతీ తీర్థం కూడా ఉన్నది. పాపాత్ములు దీనిలో స్నానం చేస్తే వారి పాపాలన్నీ పోయి పరిశుద్ధులవుతారు. అక్కడికి వాయవ్యదిశలో కుమారధారా తీర్థముంది. దానికి దిగువన గజ తీర్థమున్నది. దానిపైన ఋశ్య శృంగ తీర్థమున్నది. ఆ తరువాత నారదాది మహర్షులు సేవించిన తుంబురు తీర్థమున్నది. వాటి మధ్యలో సర్వ పాపాలను పోగొట్టే అష్టాథ తీర్థాలు, ధావతార తీర్థం, హతాయుధ తీర్థాలున్నాయి. ఆపైన సప్తర్షి తీర్థం, గజ కోణ తీర్థాలున్నాయి. వాటికి పడమట దిక్కున విష్వక్సేన తీర్థం ఉన్నది. దాని తరువాత యుద్ధగళ తీర్థమున్నది. ఈ తీర్థంలో విష్వక్సేనునికి విజయం సిద్ధించింది. ఈ 68 ముఖ్యమైన తీర్థాలు. ఇవి మహా పాపాలను కూడా పోగొడతాయి. ఇంతటి మహా మహిమగల తీర్థాలు శేషాద్రిలో ఉన్నాయి.

## మన్వాది అష్టోత్తర శత తీర్థాలు :

దుర్వాసమహర్షి దిలీపునికి మనువు మొదలైన నూట ఎనిమిది పుణ్య తీర్థాల గురించి యిలా వివరించాడు రాజా మనుతీర్థం, ఇంద్రతీర్థం, వసుతీర్థం, ఏకాదశరుద్రతీర్థాలు, ద్వాదశాదిత్యతీర్థాలు, తొమ్మిది ప్రజాపతి తీర్థాలు, అశ్వినీతీర్థం, శుక్రతీర్థం, వరుణతీర్థం, జాహ్నవీ తీర్థం, కాంపేయ తీర్థం, కాణ్వ తీర్థం, ఆగ్నేయ తీర్థం, యజ్ఞ తీర్థం, పశుతీర్థం, గణేశ్వర తీర్థం, భౌమాశ్వ తీర్థం, పారిభద్ర తీర్థం, జగజ్జాడ్యహర తీర్థం విశ్వ కల్లోల తీర్థం, యమతీర్థం, బార్హస్పత్య తీర్థం, రోమహర్ష తీర్థం, అజామోదతీర్థం, జనేశ్వరతీర్థం, ఇష్టసిద్ధితీర్థం, కర్మసిద్ధితీర్థం, వట తీర్థం, ఔదుంబర తీర్థం, కార్తికేయ తీర్థం, కుబ్జతీర్థం, ప్రాచేతస తీర్థములు, గారుడ తీర్థం, శేష తీర్థం, విఘ్నవర్ధన తీర్థం, కర్మ కాండ తీర్థం, పుణ్యవర్ధన తీర్థం, ఋణవిమోచన తీర్థం, పర్జన్య తీర్థాలు ఉన్నాయి.

ఆ తరువాత మేఘ తీర్థమున్నది. ఆ తీర్థంలో నిత్యం వర్షం కురుస్తూంటుంది. ఆపైన సంకర్షణ తీర్థం, వాసుదేవ తీర్థం, నారాయణ తీర్థాలున్నాయి. ఆ తరువాత దేవతీర్థం, యక్ష తీర్థం, కాల తీర్థం, గోముఖతీర్థం, ప్రద్యుమ్న తీర్థం, అనిరుద్ధ తీర్థం, పితృతీర్థాలున్నాయి. ఆపైన ఆర్షేయ తీర్థం, వైశ్వదేవ తీర్థాలున్నాయి. ఈ రెండింటిని అగ్నిదేవుని పత్నులైన స్వాహాదేవి, స్వధాదేవులు నిర్మించారు.

ఆ తరువాత అస్థి తీర్థం, ఆంజనేయ తీర్థం, శుద్ధోదక తీర్థాలున్నాయి. ఆపైన అష్టభైరవ తీర్థాలు ఉన్నాయి. ఇవి నూట ఎనిమిది తీర్థాలు. ఈ పుణ్య తీర్థాలు మానవులకు ఉత్తమ జ్ఞానాన్ని కలిగిస్తాయి. ఈ నూట ఎనిమిది తీర్థాలు పర్వతానికి నైరుతి దిక్కులో ఉన్నాయి. అక్కడ దక్ష ప్రజాపతి యొక్క వెయ్యి మంది పుత్రులు గొప్ప తపస్సు చేశారు. నారదమహర్షి ఉపదేశంతో వారు వేయి తీర్థాలను నిర్మించారు. అవన్నీ వెంటనే సిద్ధిని ప్రసాదిస్తాయి. కాశ్యపమహర్షి ఆశ్రమం నుండి అర్ధయోజన దూరంలో, కుమార ధారికా తీర్థము నుండి పశ్చిమంగా ఆ వేయి తీర్థాలున్నాయి. అష్టభైరవ తీర్థాలతో కలిపి అవి నూట ఎనిమిది. తీర్థాలు. ఇవన్నీ మానవులకు కర్మసిద్ధిని కలుగజేస్తాయి. ఆ తీర్థాలలో స్నానానుష్ఠానాదులు చేసేవారికి వెంటనే ఫలం సిద్ధిస్తుంది'' అని దుర్వాస మహర్షి దిలీప మహారాజుకు తీర్థమాహాత్మ్యాన్ని చెప్పాడు.

**(సశేషం)**

# పీఠికాపుర క్షేత్ర వైభవం

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**



**గత సంచిక తరువాయి**

ఇక కుక్కుటేశ్వరాలయంలో నంది మండపంలో కొలువై ఉన్న నంది గురించి తెల్సుకుందాం. శ్రీ కుక్కుటేశ్వర స్వామివారికి అభిముఖంగా నంది మండపంలో ఏకశిలా నిర్మితమైన పెద్ద నందీశ్వరుని విగ్రహం దర్శనమిస్తుంది. లేపాక్షి నంది తర్వాత అంతటి అందమైన నంది విగ్రహం ఇదే. సాలగ్రామశిలా నిర్మితమైన ఈ ఏకశిలా నందిని స్పర్శించి ఏకాగ్రతతో ధ్యానిస్తే జీవనాడీ స్పందన అనుభూతమవుతుందని చెప్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు ఈ దేవాలయంలో నంది ఉత్సవం జరుగుతుంది. ఉదయం నందీశ్వరునికి అభిషేకం చేస్తారు. నంది మెడకు సెనగల మూటలు, అరటిపళ్ళ గెలలు కడతారు. సాయంకాలం మేళతాళాలతో పలురకాల బాణసంచాతో వేద స్వస్తివాచకములతో ఆనంద కోలాహలంగా నంది ఉత్సవం జరుగుతుంది. నందీశ్వరునికి ఇంత పెద్ద ఉత్సవం ఏ ఇతర దేవస్థానంలోనూ జరగదు. పూర్వకాలంలో ఈ నందికి జరిగే నివేదన చాలక దేవాలయం నుండి అర్ధరాత్రి సమయంలో మేతకు బయటకు వెళ్ళేదనీ, ఈ విషయం గ్రహించిన ఒక భక్తుడు రెండున్నర ఎకరాల భూమిని నిత్యం సంతుష్టిగా సెనగలు నివేదన చేయడానికి నందీశ్వరునికి సమర్పించినట్లుగా తెలుస్తోంది. నేటికీ ఈ భూమి స్వామివారి దేవాలయానికి పడమరగా ఉందనీ, ఈ పొలాన్ని 'సెనగల మాన్యం' అంటారనీ భక్తులు చెప్తారు.

ఇక పురుహూతికా పీఠం గురించి. సతీదేవి మృత దేహాన్ని విష్ణుమూర్తి తన సుదర్శన చక్రంతో ఖండించగా 18 భాగాలు పడిన ప్రాంతాలు అష్టాదశ పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. పిఠాపురంలో అమ్మవారి పీఠభాగం పడినట్లుగాను, అందుకే అమ్మవారిని పీఠాంబికగా కొలుస్తారని చెప్తారు. ఇది పదవ శక్తిపీఠం. ఇంద్రునికి మరోపేరు పుర్హూతుడు. ఇంద్రుడు అమ్మవారిని సేవించి ఆమె కృపకు పాత్రుడయ్యాడు. ఇంద్రుని కోరిక మేరకు పీఠాంబిక పుర్హూతికాదేవి అనే నామంతో ప్రసిద్ధమయింది. ఎడమ క్రింది చేతియందు బంగారు పానపాత్రనూ, కుడిక్రింది చేతియందు దాలునూ, కుడి పై చేతియందు లోహ దండమునూ ధరించి నాలుగు వీధుల కూడలిలో శ్రీచక్ర పీఠముపై నుండి భక్తకోటికి సకల సౌభాగ్యాలు సమస్త సంపదలు ప్రసాదించే తల్లి పుర్హూతికాదేవి. పదవ శక్తిపీఠమైన పుర్హూతికాదేవి ఆలయం చుట్టూ 18 శక్తిపీఠాల విగ్రహాలు కొలువై ఉన్నాయి. ఈ అమ్మవారికి ప్రతినిత్యం కుంకుమార్చనలు జరుగుతాయి. అలాగే ప్రతి సంవత్సరం ఉగాది నుండి పది రోజులు శతచండీ యాగ పూర్వకంగా వసంత నవరాత్రులు, దేవీనామ సంకీర్తనలు, భజనలు, వేదస్వస్తులు మహావైభవంగా జరుగుతాయి. దసరా నవరాత్రులు కూడా విశేషంగా అత్యంత వైభవంగా జరుగుతాయి. పీఠాంబికా శక్తిని చతుర్భుజాలతో కూడిన శ్రీమహాలక్ష్మిగా కూడా భావిస్తారు.

ఈమె కొంతకాలం పిఠాపురం లోని కుమారస్వామి చెరువులో జలధివాసం చేసి మరల బయల్పడి కొత్తపేట కుమారస్వామి ఆలయ ప్రాంగణంలోనూ ఉన్నట్లుగా చెప్తారు.

ఇక కుంతీమాధవ క్షేత్రంగా పిఠాపురం ఎలా ప్రసిద్ధి చెందిందో తెల్సుకుందాం. పిఠాపురం లోని పాదగయా క్షేత్రానికి క్షేత్రపాలకుడు శ్రీకుంతీమాధవస్వామి. ఈ ఆలయం కూడా పరమ ప్రాచీనమైన దివ్యక్షేత్రం. మేనత్త అయిన కుంతీదేవి చేత పూజింపబడిన స్వామి కుంతీమాధవస్వామి.

పూర్వకాలంలో వృత్రాసురుడు అనే రాక్షసుడిని ఇంద్రుడు సంహరించాడు. ఫలితంగా బ్రహ్మహత్యాదోషం ఇంద్రునికి కలిగింది. ఈ దోష నివృత్తికి ఇంద్రుడు 5 విష్ణుప్రతిష్ఠలు చేశాడు. ఇవే పంచమాధవ క్షేత్రాలుగా ప్రసిద్ధి పొందాయి. ఇవి వరుసగా వారణాసిలోని బిందుమాధవుడు, ప్రయాగలోని వేణీమాధవుడు, పిఠాపురంలోని కుంతీమాధవుడు, రామేశ్వరంలోని సేతుమాధవుడు, కేరళరాష్ట్రంలోని అనంతపద్మనాభంలో సుందరమాధవుడు. కుంతీమాధవుడు కృతయుగంలో దేవేంద్రుని చేత ప్రతిష్ఠించబడ్డాడు. త్రేతాయుగంలో శ్రీసీతారామలక్ష్మణుల పూజలు అందుకొన్నాడు. ద్వాపరయుగంలో కుంతీదేవి ప్రార్థనలు మన్నించి పాండవులను అనుగ్రహించాడు. కుంతం హస్తమందు ధరించిన కుంతీమాధవుడు కుంతీదేవి పూజలందుకొని ఆమె ప్రార్థన మేరకు కుంతీమాధవుడయ్యాడు. వేణీ మాధవునకు – సేతు మాధవునకు సరిగ్గా మధ్యగా కుంతీమాధవుడు ఉన్నాడు. భూతాత్మ, ఇంద్రియాత్మ, ప్రధానాత్మ, ఆత్మ, పరమాత్మ రూపాలకు ప్రతిరూపాలుగా పంచ ఆత్మ స్వరూపాలకు ప్రతిబింబాలుగా ఈ పంచమాధవ క్షేత్రాలను భావిస్తారు. కుంతీమాధవస్వామి దేవాలయం పిఠాపురానికి దక్షిణంగా ఉంది.

ఏలానదీ తీరంలోని ప్రోల్నాడలో పిఠాపురానికి సమీపంగా వైష్ణవ క్షేత్రాలు ఉన్నాయి. పిఠాపురానికి నాలుగు క్రోసుల దూరంలో ఏలేటి నదీ శాఖలలో ఒక శాఖ ఒడ్డున సర్పవరం క్షేత్రంలో భావనారాయణస్వామి దేవాలయం ఉంది. పిఠాపురానికి దక్షిణంగా ఇంకొక శాఖ వద్ద కుమారారామంలో రాజనారాయణస్వామి దేవాలయం ఉంది. పిఠాపురానికి నైఋతి దిక్కున గల చదలవాడ తిరుపతిలో శ్రీశృంగార వల్లభస్వామి దేవాలయం ఉంది. ఏలానది సాగరసంగమం పొందే మూలపేటలో పొన్నవాడ సమీపంలో పూరీలోవలె సుభద్రా సమేతుడైన జగన్నాథస్వామి దేవాలయం ఉంది.

శ్రీకుంతీమాధవునకు సంవత్సరం పొడుగునా ఎన్నో ఉత్సవాలు జరుగుతాయి. ఉగాది వేడుకలు, శ్రీరామనవరాత్రులు, తొలి ఏకాదశి, వ్యాసపూర్ణిమ ఉత్సవాలు, వరలక్ష్మీ పూజలు, శ్రీకృష్ణ జయంతి, విజయదశమి వేడుకలు, దీపావళికి మహాలక్ష్మీ జయంతి ఉత్సవాలు, క్షీరాబ్ధిద్వాదశికి మాధవ పుష్కరిణిలో తెప్పతిరునాళ్ళు, ధనుర్మాసోత్సవాలు, ముక్కోటి ఏకాదశికి ఉత్తరద్వార ప్రవేశపు సందడులు, మాఘమాసంలో భీష్మ ఏకాదశికి కళ్యాణోత్సవం – ఇవీ కుంతీమాధవునకు పిఠాపురంలో జరిగే ఉత్సవాలు.

దత్తక్షేత్రంగా పిఠాపురం ఎలా విరాజిల్లుతోందో తెల్సుకుందాం. పిఠాపురంలో పూర్వం ఆపస్తంభ శాఖీయులైన సుమతీ–రాజశర్మ అను బ్రాహ్మణ దంపతులు నివసించేవారు. వారికి పాద నేత్రములు లేని ఇద్దరు కుమారులు ఉండేవారు. అంగవైకల్యము గల వారికి ఆ కాలంలో వివాహం చేసేవారు కాదు. అందుచేత అట్టి సంతానం వలన వంశాభివృద్ధి కాదు. ఉత్తమ సంతానము – వంశాభివృద్ధి కోరుకుంటూ వారు పాదగయాక్షేత్రంలో దత్తాత్రేయ స్వామిని సేవించేవారు. ఒకరోజు వారి ఇంట పితృకార్యము వచ్చినది. పితృ కార్యమునకు కావలసిన వంటలు సిద్ధము చేసుకున్నది సుమతి. స్నానాదికములు నిర్వర్తించుటకు పాదగయకి వెళ్ళాడు రాజశర్మ. ఆ సమయంలో దత్తభగవానుడు సన్యాసి రూపంలో వారి ఇంటికి వచ్చి భిక్ష కోరాడు. సాధారణంగా పితృకార్యం రోజున భోక్తలు భుజించకుండా ఎవరికీ ఏమీ పెట్టరు. కానీ సుమతి నిశ్శంకగా దత్త భగవానునికి భిక్ష పెట్టింది. ఆమె భక్తికి – అతిథి పట్ల ఆదరణకు సంతోషించిన దత్తభగవానుడు ''అమ్మా నీకు ఏమి వరము కావాలో కోరుకో'' అన్నాడు. ''స్వామీ మీరు నన్ను అమ్మా అని పిలిచారు. ఆ పిలుపు నాయందు సార్థకత చెందునట్లుగా మీరే నా కుమారునిగా జన్మించే వరాన్ని అనుగ్రహించండి'' అని కోరింది. ''నీకు వరాన్ని అనుగ్రహిస్తున్నాను. కానీ నీ కుమారుడు ఏది కోరినా కాదనకూడదు'' అని షరతు విధించి అంతర్ధానమయ్యాడు. సుమతి గర్భవతి అయ్యింది. భాద్రపద శుద్ధ చతుర్థి నాడు బాలుడు జన్మించాడు. జన్మోత్సవం వైభవంగా జరుపుకొన్న ఆ దంపతులు, నామకరణం చేయ సంకల్పించి, పండితులకు బాలుని చూపగా, వారు ''ఈ బాలుడు సామాన్యుడు కాదు. మహాయోగి, సర్వవిద్యా పారంగతుడు, జగద్గురువు అవుతాడు. ఇతనివల్ల మీకు – మీ కుటుంబానికి మంచి కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఈ బాలుని పాదములలో శ్రీరేఖ ఉన్నది. కావున ఈ బాలునికి శ్రీపాదుడు అని నామకరణం చేయండి'' అని చెప్పారు. బాల్యము నుండే శ్రీపాదుడు ఎన్నో లీలా విశేషములు చూపించాడు. ఎనిమిదవ సంవత్సరమున ఉపనయనము చేయగా ఉపదేశ మాత్రముననే వేదవేదాంగాది సమస్త విద్యలయందు ప్రతిభా పాటవాలు ప్రదర్శించాడు. విద్యార్థులకి వేద పాఠములు బోధించేవాడు. శ్రీపాదునికి 16 సంవత్సరముల వయస్సు వచ్చేటప్పటికి తల్లితండ్రులు వివాహ ప్రయత్నం తలపెట్టగా ''వద్దు'' అని వారిని వారించాడు. అంతట తల్లి ''నాయనా! జ్యేష్ఠులైన నీ సోదరులిద్దరూ పాదనేత్రములు లేని అంగవికలురు. వారి వలన వంశాభివృద్ధి సాధ్యము కాదు. కనుక నీవు వివాహము చేసికొని మన వంశమును వృద్ధి చేసి మాకు

ఉత్తర గతులు కలుగజేయమ''ని కోరింది.

''నేను సామాన్య మానవ కాంతను వివాహమాడను. ముక్తికాంతను మాత్రమే పరిగ్రహిస్తాను. నా సోదరులు పరిపూర్ణ ఆరోగ్యవంతులైతే నేను సన్యాసం స్వీకరించడానికి మీకు అభ్యంతరం ఉండదు కదా! నాకంటె పెద్దవారయిన వారి వలన వంశాభివృద్ధి కలిగితే మీకు సంతోషమే కదా!'' అని చెప్పి సుమతికి పూర్వము వలె నిజరూప దర్శనము ఇచ్చి తాను పెట్టిన షరతును గుర్తు చేశాడు. ''నా పెద్ద కుమారులు ఆరోగ్యవంతులైతే నీవు సన్యసించుటకు నాకు అభ్యంతరము లేదు'' అని సుమతి చెప్పింది. అప్పుడు శ్రీపాదుడు తన కరస్పర్శతోను, అమృతమయమైన కృపాదృష్టి చేతనూ తన సోదరుల వైకల్యాలు తొలగించి పరిపూర్ణ ఆరోగ్యవంతులను చేశాడు. సుమతీదేవిని దుఃఖించవద్దని వారించి, మీ వంశము ఆచంద్ర తారార్కము వర్ధిల్లునని, మీ వంశమందు వేదవిద్యలు పెంపొందుతాయి అని, తరగని సంపదలు మీ ఇంట ఉంటాయి అనీ అనేక వరములు ఇచ్చి, ఈ క్షేత్రముననే సుమతీదేవికి దర్శనమిచ్చిన రూపమున స్వయంభువుగా వెలసి భక్తకోటిని అనుగ్రహిస్తానని చెప్పి, తనను స్మరించిన వారికి, అర్చించిన వారికి, మ్రొక్కిన వారికి సమస్త సంపదలు, సర్వాభీష్టములూ ప్రసాదిస్తానని అభయమిచ్చి సన్యసించి దత్తభక్తి మార్గమును ప్రచారము చేయుటకు వెళ్ళిపోయెను. ఇలా 17 సంవత్సరములు దత్తాత్రేయుడు శ్రీపాద శ్రీవల్లభునిగా పిఠాపురంలో సంచరించి మహిమలు చూపాడు. నేటికి సుమారు 650 సంవత్సరాల క్రితం పిఠాపురంలో సుమతికి దత్తాత్రేయుడు ఏ రూపంలో ప్రత్యక్షమయ్యాడో ఆనాటి నుండి నేటివరకూ అదే స్వరూపంలో విగ్రహరూపం ధరించి శ్రీకుక్కుటేశ్వర దేవాలయ ప్రాంగణంలో నైఋతి భాగమందలి శ్రీక్షేత్రంలోని దత్తమందిరంలో నెలకొన్నాడు. శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన కారణంగా పిఠాపురం శ్రీక్షేత్రంగా ప్రఖ్యాతమయింది.

దత్తాత్రేయస్వామి విగ్రహరూపంలో దర్శనమిచ్చే ఏకైక దత్తక్షేత్రం పిఠాపురం మాత్రమే. మిగిలిన దత్త క్షేత్రాలలో స్వామి పాదుకల రూపంలోనే దర్శనమిస్తారు. దత్తుని ఆలయానికి ప్రక్కనే ఉన్న మూడు కొమ్మలు గల ఔదుంబర వృక్షం అంటే మేడి వృక్షం చాలా మహిమ కలది. ఈ వృక్షం పూవులు పూయకుండానే కాయలు కాస్తుంది. ఈ చెట్టు మూలంలో ఉన్న పాదుకలు శ్రీపాద శ్రీవల్లభుని నిజపాదుకలు. ఇక్కడే శ్రీపాద శ్రీవల్లభులు జపం చేసుకుంటున్న భంగిమలోని చిన్న విగ్రహం మనకు దర్శనమిస్తుంది. ఈ విగ్రహాన్ని చూడగానే –

**"కృతే జనార్దనో దేవః త్రేతాయాం రఘునందనః**
**ద్వాపరే రామకృష్ణాచ కలౌ శ్రీపాద శ్రీవల్లభః"**

అనే శ్లోకం మన మదిలో మెదులుతుంది.

ఔదుంబర వృక్షానికి ఉన్న మూడు కొమ్మలు త్రిమూర్తి స్వరూపానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఔదుంబర ప్రదక్షిణం దత్త ప్రదక్షిణ ఫలాన్ని ప్రసాదిస్తుంది. ప్రత్యక్ష దత్తక్షేత్రమైన పిఠాపురంలోని దత్తాత్రేయుని సన్నిధానంలో దత్తమంత్ర జపం, దత్త ప్రదక్షిణం, దత్త చరిత్ర పారాయణం ఆదిగా గల దత్తసేవలు చేసుకుంటూ మనోభీష్టాలు నెరవేర్చుకుని భక్తులు సంతృప్తి చెందుతున్నారు. ముఖ్యంగా ''దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా'' అనే అష్ట దశాక్షర మంత్ర జపం మిక్కిలి ఫలవంతమైనది. ''దత్తాత్రేయ'' అనే నామమే చతరక్షర మహామంత్రం.

**"దత్త దత్త ఇదం వాక్యం**
**తారకం సర్వ దేహినాం**
**శ్రద్ధాయుక్తో జపేన్నిత్యం**
**దత్త ఇత్యక్షర ద్వయం"**

–ఇవీ దత్తక్షేత్ర విశేషాలు.

ఇక హుంకారిణీ శక్తి కేంద్రంగా భాసిల్లుతున్న పిఠాపురం గురించి తెల్సుకుందాం.

**"పీఠాంబికా సఖీం దుర్గాం దైత్య సేనా విదారిణీం హుంకారిణీ మహాశక్తి"**

అంటూ వ్యాసుడు వర్ణించిన హుంకారిణీ దేవి సువర్ణ విగ్రహం భూస్థాపితమైపోయిందనీ, ఆ విగ్రహాన్ని భూమిలోంచి తవ్వించి తీసి 1793–1828 సంవత్సరాల మధ్య పిఠాపురం సంస్థాన పాలకులుగా వ్యవహరించిన శ్రీరావు నీలాద్రి రాయణం గారు పూజించుటకు ప్రయత్నించగా పురుహూతికాదేవి స్వప్నంలో దర్శనమిచ్చి ఆ ప్రయత్నం విరమించమని ఆదేశించినట్లు గానూ, ఆ పైన వారు ఆ ప్రయత్నం విరమించినట్లు గానూ తెలుస్తోంది. ఈ సువర్ణ విగ్రహం పిఠాపురం రైల్వేస్టేషనుకు ఎదురుగా ఉన్న ఎత్తయిన మట్టిదిబ్బలో భూస్థాపితమై ఉందని జనశృతి. పురుహూతికా శక్తి పృథివీశక్తియై, హుంకారిణీదేవి భూదేవియై జనతనూ, జగతినీ అనుగ్రహిస్తూ కాపాడుతున్నారని విజ్ఞుల అభిప్రాయం. హుంకారిణీదేవి ఈ దృశ్య ప్రపంచాన్ని అదృశ్యశక్తిగా ధరణీగర్భంలో నిలిచి రక్షిస్తోంది.

**"కరుణింపుమమ్మ మమ్ము హుంకారిణీ**
**మిమ్ము స్మరియింతునమ్మ రమ్ము హుంకారిణీ**
**కరుణాంబురాశివే హుంకారిణీ**
**దివ్య కదంబవాసినివే హుంకారిణీ**

అంటూ ఏకాంత సేవా విలాసంలో మద్దిరాల వేంకటరాయకవి స్తుతించినట్లుగా, మనం కూడా హుంకారిణీ దేవి స్తుతిలో గొంతు కలుపుదాం.

ఇట్టి వైభవోపేతమైన పీఠికాపుర క్షేత్రాన్ని గురించి తన భీమేశ్వర పురాణంలో శ్రీనాథుడు ఇలా వ్యాఖ్యానించాడు.

**కోణార్క క్షేత్రము వారణాసీ**
**కేదార తీర్థ రాజంబు కుంభకోణ కుక్కుటేశ**
**స్థాణుస్థానంబు మోక్షధామంబు లెందును!**

# అక్షయలక్ష్మీ పూజ

– డా|| మరుదాడు అహల్యాదేవి

సామాజిక వ్యవస్థలో సమతౌల్యం పాటించడానికి పూర్వీకులు ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలను నిర్ణయించారు. ఈ నాలుగూ ప్రతి వ్యక్తి జీవితంలో అవసరమైనవి. ఇవి ఒకదాని ప్రయోజనాన్ని మరొకటి పూర్తిచేసే విధానాలు. కాని ప్రాచీనకాలం ధర్మప్రధాన కాలమైతే, ఆధునికకాలం అర్థప్రధానమైంది. పూర్వం ధనం అవసరంతో పాటు ధర్మం కూడా ప్రథమ స్థానంలో ఉండేది. కాలం మారడంతో అవసరాలు మారి, ధర్మం స్థానంలో అర్థం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడు తక్కిన మూడు పురుషార్థాలూ అర్థంపైనే ఆధారపడి ఉన్నాయి. ధనం లేకపోవడం అంటే సుఖజీవనానికి స్వస్తి చెప్పడమే అనే భావం స్థిరపడింది ఇప్పుడు.

లక్ష్మీదేవి కృపను చిరస్థాయిగా మన ఇంట్లో స్థాపించుకోవడం కోసం అక్షయ తృతీయ నాడు లక్ష్మీదేవిని పూజించాలి. వైశాఖ శుక్ల తదియ అక్షయ తృతీయ. ధన సంపదలకు అధిష్ఠాత్రి లక్ష్మీదేవి.

లక్ష్మీ తంత్రం ప్రకారం సాక్షాత్తు కుబేరుడు కూడా లక్ష్మి సాధన చేసి సంపదను అనుకూలం చేసుకున్నాడు. విశ్వామిత్ర మహర్షి అక్షయ తృతీయ నాడు సాధన చేసి లక్ష్మీదేవి సంపూర్ణ కటాక్షం సిద్ధింప చేసుకోగలిగాడు. ఆయన జీవన పర్యంతం ఏనాడూ ఆశ్రమంలో అవసరాలకు బాహ్య రాజ్యాల నుండి సహాయం అర్థించవలసిన అవసరం కలగలేదు.

లక్ష్మీదేవి, విష్ణుమూర్తుల ఆరాధనకు విశేషమైన అక్షయ తృతీయ పర్వదినాన ముందుగానే శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ఠ చేసిన పాదరస లక్ష్మీదేవి ప్రతిమను తెచ్చి ఉంచుకోవాలి.

## అక్షయ లక్ష్మీపూజ

అక్షయ తృతీయ నాడు ఉదయం వేళ పూజాస్థలాన్ని చక్కగా శుభ్రం చేసి, స్నానాదులు కానిచ్చి శుచిగా కొత్త వస్త్రాలు లేదా గులాబీరంగువి ధరించాలి. ఎదురుగా పీటపై గులాబీరంగు వస్త్రం పరచి దానిపై పసుపు రాసిన బియ్యం (అక్షతలు) తో స్వస్తిక్ గుర్తు నిర్మించాలి. దానిపై రాగి లేక వెండి పళ్ళెం ఉంచి 'శ్రీ' అనే మంత్రం ఉచ్చరిస్తూ పళ్ళెంలో పూలు ఉంచాలి. ఆ పూలపై పాదరస ప్రతిమను స్థాపించాలి. లక్ష్మీదేవి చంచల. స్థిరంగా ఒక స్థానంలో ఉండడం కష్టం. కాని మహాపతివ్రత కావడం చేత విష్ణుమూర్తిని వదిలి వుండదు. అందుచేత లక్ష్మీదేవిని స్థిరంగా ఉంచడానికి విష్ణుమూర్తిని ఆరాధించాలి. పాదరస లక్ష్మీదేవితో పాటు పాదరస విష్ణుమూర్తి ప్రతిమను కూడా ప్రతిష్ఠించడం చేత




ఉపాసనా ప్రభావం ఎన్నోరెట్లు అధికమౌతుంది. ఆ తరువాత ప్రతిమలకు పంచోపచార పూజ చేయాలి. (స్నానం, చందనం, కుంకుమ, పుష్పం, ధూప, దీప, నైవేద్య, హారతులు). పూజ పూర్తి చేశాక ఈ క్రింది మంత్రం మూడు మాలా జపాలు (3 X 108 సార్లు) చేయాలి. జపానికి తామర గింజల మాల లేదా స్ఫటిక

మాల లేదా శంఖమాల ఉపయోగించాలి. జపం చేసేటప్పుడు కొంచెం కొంచెం అక్షతలు, పుష్పాలు సమర్పిస్తూ ఉండాలి.

**మంత్రం**

"ఓం ఐం ఐం శ్రీం శ్రీం హ్రీం హ్రీం పాందేశ్వరి
సిద్ధం హ్రీం హ్రీం శ్రీం శ్రీం ఐం ఐం ఓం"

మంత్ర జపం పూర్తయ్యాక గులాబీ పూలమాల పాదరస లక్ష్మీదేవి ప్రతిమకు సమర్పించాలి. తర్వాత తమ ఇంట్లో స్థాయీ నివాసం చేయమని లక్ష్మీదేవిని ప్రార్థించాలి. సర్వతోముఖ సమృద్ధిని కలిగించమని వేడుకోవాలి. ఎంతటి నిర్ధనుడు, దరిద్రుడైనా పాదరస లక్ష్మి సాధన చేస్తే సంపన్నుడవుతాడని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. పాదరస నిర్మిత లక్ష్మీదేవి ప్రతిమ ఇంద్రుడు, కుబేరుడు ఇతర దేవగణాల చేత ప్రశంసించబడిందని శాస్త్రాలు వివరిస్తున్నాయి.

## లక్ష్మీదేవికి ప్రతీక గవ్వ

ప్రజలు గవ్వలను నాణాలుగా ఉపయోగించేవారని తవ్వకాల్లో లభించిన ఆధారాలు చెబుతున్నాయి. నాణెంగా ఉపయోగపడిన గవ్వను కాలాంతరంలో ధనానికి ప్రతీకగా భావించారు. లక్ష్మి చిహ్నంగా, ఆభరణాలుగా, శిరోభూషణంగా వినియోగించేవారు. తర్వాతకాలంలో పూజాదులు, సామాజిక ఉత్సవాల్లో గవ్వకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. గవ్వను భస్మం చేసి ఔషధాల్లో వాడడం ప్రారంభించారు. కాలక్రమంలో ధాతు మిశ్రిత నాణాలు ఏర్పడడంతో గవ్వకు ప్రాశస్త్యం తగ్గింది. చివరికి వినిమయ మాధ్యమంగా దీనిస్థానం పూర్తిగా మాయమైంది. ఇవాళ మనదేశంలో గవ్వకు నాణెంగా గుర్తింపు లేదు. కాని జన మానసంలో గవ్వ లక్ష్మికి ప్రతీకగా స్థిరపడింది. లక్ష్మీపూజ, వివాహాది శుభకార్యాలు, మంత్ర తంత్రాలు, క్రీడలు, అలంకార వేడుకల్లో గవ్వలను వాడుతుంటారు. బెంగాల్ లో లక్ష్మీపూజ సందర్భంగా ఒక గంపలో గవ్వలు నింపి దానిని చక్కగా అలంకరించి పూజిస్తారు. దీనిని వారు 'లోఖిఝాపాయీ' అంటారు. అర్థం లక్ష్మీదేవి గంప అని అర్థం.

ఉత్తర్ ప్రదేశ్ లో కన్యలు దసరా పండుగ సందర్భంగా ఇంటి గడపపై పేడతో దేవి ప్రతిమను రూపొందించి దానిని గవ్వలతో అలంకరిస్తారు. గోవర్ధన పూజకి కూడా పేడతో ప్రతిమలు చేసి గవ్వలతో అలంకరించే ఆచారం ఉంది.

మధ్యప్రదేశ్ లో ఒక దీపపు ప్రమిదలో నెయ్యి పోసి, ఆ నేతిలో గవ్వను ముంచి, దీపం వత్తి వెలిగిస్తారు. ఆ దీపం రాత్రంతా వెలుగుతూ ఉంటుంది. మరుసటిరోజు ప్రమిద లోంచి గవ్వను తీసి పూజించి జేబులో పెట్టుకొని జూదం ఆడటానికి వెళ్తే తప్పక జయం కలుగుతుందని అక్కడి ప్రజల విశ్వాసం. గవ్వలను సుఖ సౌభాగ్యాలకు ప్రతీకగా భావించే సంప్రదాయం ఉంది. వివాహ వేడుకలో వధువుకు తొడిగే గాజులలో గవ్వలను గుచ్చి కడతారు.

మన తెలుగునాట వధువును అత్తవారింటికి పంపేటప్పుడు తండ్రి ఆమెకు ఒక గంపను బహూకరిస్తాడు. అందులో అనేక వస్తువులతో పాటు 11 గవ్వలను ఉంచుతారు. అత్తవారింట్లో వధువు సుఖ సౌభాగ్యాలను అవి రక్షిస్తాయని విశ్వాసం. ఒరిస్సాలోనూ తండ్రి ద్వారా వధువుకు గవ్వలు బహూకరించే ఆచారం ఉంది. అస్సాం లోని కొన్ని జాతుల్లో వరుడు స్వయంగా వధువుకు ఒక పెద్ద గవ్వ బహుమతిగా ఇస్తాడు. అందులో సిందూరం నింపుతారు. పండుగలు, పూజల్లో వధువు గవ్వలోని సిందూరం ధరిస్తుంది.

రాజస్థాన్ లో దీపంలో మహిళలు ఒక గవ్వ వేసి దానిని పూజిస్తారు. తర్వాత సంవత్సరమంతా దానిని జాగ్రత్తగా దాచుకుంటారు. దీనివల్ల తమ సుఖ సౌభాగ్యాలు వృద్ధి చెందుతాయని వారి విశ్వాసం. రాజస్థాన్ లోని కొన్ని ప్రాంతాల్లో వివాహ మంటపాన్ని గవ్వలతో అలంకరించడం. వధువు జడలో గవ్వలు గుచ్చడం సంప్రదాయం.

పంజాబ్ లో వధువు మణికట్టుకు గవ్వను కడతారు.

అస్సాం లోని అహోమ్ అనే జాతికి చెందిన వృద్ధులు వివాహమైన వధూవరుల చెవి దగ్గర గవ్వలు గలగల లాడించే పద్ధతి ఉంది.

భాస్కరాచార్యుని గణిత శాస్త్రం 'లీలావతి'లో గవ్వను నాణెంగా పేర్కొన్నారు. ఆ కాలంలో బ్రాహ్మణులకు దక్షిణలుగా గవ్వలు ఇచ్చేవారు. ప్రపంచంలోని అనేక ఇతర దేశాల్లోనూ చాలాకాలం గవ్వను నాణెంగా వాడారు. 13వ శతాబ్దంలో చైనాలో గవ్వ ధన వినిమయానికి వాడటం మార్కోపోలో చూశాడు. గ్రీస్ దేశంలో వెనిస్ దేవతకు కానుకగా గవ్వలు సమర్పించేవారు. వెస్ట్ ఇండీస్ లో చర్చి నిర్మాణానికి పని చేసిన కూలీలకు 360 లక్షల గవ్వలు కూలీ క్రింద చెల్లించిన వివరణ ఉంది. అక్కడ వెయ్యి గవ్వలను 1 షిల్లింగ్ కింద లెక్క కట్టేవారు. ఆఫ్రికాలో 2 వేల గవ్వలను 1 డాలర్ కింద లెక్కించేవారు. సయాంలో 3500 గవ్వల విలువ 1 టెక్కల్. యుగాండాలో 1000 గవ్వల విలువ ఒక రూపాయి.

మన దేశంలో 20 వ శతాబ్దం ప్రారంభం వరకు గవ్వను నాణెంగా ఉపయోగించేవారు. ఆ రోజుల్లో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో ఒక పైస 16 గవ్వలకు సమానమని, ఆగ్రాలో ఒక పైసకు 50 గవ్వలు సమానంగా లెక్కించేవారు. ఈవిధంగా అప్పట్లో గవ్వను నాణాల లెక్కల్లో పరిగణించినా తదనంతర కాలంలో లక్ష్మీదేవికి ప్రతీకగా గవ్వను భావించేవారు. పాత వెండినాణాలు, రూపాయలతో పాటు గవ్వలు కూడా ఉంచుతారు. లక్ష్మి స్వరూపమైన గవ్వలను అక్షయ తృతీయ నాడు పూజలో ఉంచుకుని పూజిస్తారు. అక్షయ తృతీయ నాడు లక్ష్మీదేవిని పూజించడంతో పాటు బంగారం కొనడం ఆనవాయితీగా వస్తోంది. ఇది శుభకరం. ఐశ్వర్యదాయకం.

★ ★ ★

ధారావాహికం



# ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు
# అర్జునుడు

– కౌతా నిర్మల

**గత సంచిక తరువాయి**

"అశ్వత్థామా శ్రీకృష్ణుడు నారాయణుని అవతారము. అర్జునుడు నరుని అవతారము. శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రుడు, ఇష్టసఖుడు, వారు ఇరువురూ నర నారాయణులు. వారు ధర్మజ్ఞులు, సద్గుణవంతులు. నీ శరం వారిని ఏమీ చేయలేకపోయింది" అని చెప్పి అశ్వత్థామ సందేహాన్ని తీర్చాడు వ్యాసమహర్షి.

అర్థరాత్రి సమయంలో అందరూ ఆదమరచి నిద్రిస్తున్నప్పుడు అశ్వత్థామ పాండవుల గుడారంలోకి ప్రవేశించి, నిద్రిస్తున్న పాండవుల బిడ్డలను హతమార్చి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. అతడు చేసిన ఘాతుకాన్ని గురించి తెలుసుకున్న భీమార్జునులు అశ్వత్థామ మీద ప్రతీకారం తీర్చుకోవటానికి అతనిని వెదుకుతూ బయల్దేరారు. తనవైపే వస్తున్న వారిద్దరినీ చూసిన అశ్వత్థామ భయకంపితుడై వారినుంచి తప్పించుకోవటానికి ప్రాణరక్షణకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. వెంటనే అగ్నులు ఉద్భవించి, ఆ జ్వాలలు అన్నివైపులా ఆవరించసాగాయి. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వల్ల చెలరేగిన ప్రళయజ్వాలను శాంతింప చేయటానికి అర్జునుడు తప్పనిసరిగా బ్రహ్మాస్త్రాన్ని వదలవలసి వచ్చింది. రెండు అస్త్రాలు ఒకదానికి మరొకటి ఢీ కొనడంతో ఉల్కలు పడసాగాయి. ప్రజలందరూ భయంతో వణికిపోయారు.

అప్పుడు దేవర్షి నారదుడు, వ్యాసమహర్షి వారిద్దరికీ నచ్చచెప్పి బ్రహ్మాస్త్రాలను ఉపసంహరించమని చెప్పారు. తన బ్రహ్మాస్త్రాన్ని అర్జునుడు ఉపసంహరించాడు. కాని అశ్వత్థామ ఆ అస్త్రాన్ని ఉపసంహరించలేకపోయాడు. అతని ప్రయత్నం విఫలమైంది. అశ్వత్థామ వదిలిన బ్రహ్మాస్త్రం ఉత్తర గర్భంలోకి ప్రవేశించి ఆమె గర్భంలోని శిశువును మృతుడయ్యేలా చేసింది. అయితే శ్రీకృష్ణుడు ఆ గర్భస్థ శిశువును పునర్జీవితునిగా చేశాడు.

కురుక్షేత్ర సంగ్రామంలో కర్ణుడు, అర్జునుడి మధ్య భీకర యుద్ధం జరగసాగింది. ధైర్య సాహసాలలో ఒకరికొకరు తీసిపోని వారిద్దరి మధ్యా యుద్ధపు తీవ్రత పెరగసాగింది. శల్య, కర్ణ సంవాదన విన్న అర్జునుడు శ్రీకృష్ణునితో "ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారో, ఎవరు ఓటమి పొందుతారన్నదీ చెప్పడం చాలా కష్టం. కృష్ణా! కర్ణుని చేత ఈ యుద్ధంలో నేను వధింపబడితే? అన్నాడు. అర్జునుని సంశయాన్ని విన్న శ్రీకృష్ణుడు, "అర్జునా! వ్యర్థపు మాటలను నీ నోటి వెంట రానివ్వకు. నీ మనస్సులోని సంశయాన్ని, వ్యతిరేకపు ఆలోచనలనూ విడనాడు. సముద్రాలు జలం లేకుండా ఇంకి పోవచ్చు. అగ్నిలో చల్లదనం ఏర్పడవచ్చు. సూర్యుడు నేలమీదకు జారిపడవచ్చు. ఇటువంటి అరిష్టాలు జరిగినా కూడా కర్ణుడు నిన్ను చంపడం అసాధ్యం. నేను చెప్పినవన్నీ ఎలా జరగవో, నిన్ను కర్ణుడు హతమార్చడం కూడా జరగనిపని. కర్ణుడి చేత నువ్వు చంపబడితే లోకమే అస్తవ్యస్తమవుతుంది. అప్పుడు నేనే స్వయంగా శల్యుడిని, కర్ణుడిని హతమారుస్తాను" అని చెప్పాడు.

కర్ణుడు అర్జునునిపై ప్రయోగించటానికి నాగాస్త్రాన్ని పదిల పరచుకున్నాడు. ఆ అస్త్రం అతి భయంకరమైనది. అది శత్రువు మేనిని తాకగానే వారిని భస్మం చేసేస్తుంది. ఆ నాగాస్త్రాన్ని అర్జునుని మీద సంధించి, అతనిని హతమార్చటానికి సిద్ధపడ్డాడు కర్ణుడు. ఆ అస్త్రం ముందుకు దూసుకు వస్తుంటే అన్ని దిక్కుల నుంచి మంటలు చెలరేగాయి. ఆకాశం నుంచి వందలాది నక్షత్రాలు నేలమీద పగటిపూటే రాలిపడ్డాయి. భూమి కంపించింది. ప్రజలందరూ భయభ్రాంతులయ్యారు. ఇంద్రునితో సహా దేవతలందరూ పైనుంచి హాహా కారాలు చేశారు. ఖాండవ దహనం జరిగినప్పుడు అశ్వసేనుడనే భయంకరమైన విషసర్పం, అర్జునుని మీద పగ పెంచుకుంది. అది నాగాస్త్రం లోకి ప్రవేశించింది.

అది చూసిన శ్రీకృష్ణుడు అర్జునుడిని ఆ అస్త్రం నుంచి కాపాడాలని క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా, ఆ అస్త్రం అర్జునుని చేరకమునుపే ఎంతో నేర్పుతో, అర్జునుని రథాన్ని తన పాదంతో గట్టిగా కిందకు తొక్కేశాడు. అశ్వాలు మోకాళ్ళమీదకు వంగిపోయాయి. అర్జునుని శిరస్సుకు తగలవలసిన బాణం రథం క్రుంగటంతో అతనికి కిరీటానికి తగిలింది. ఆ కిరీటం నేలమీద పడి భగ్గున మండిపోయింది. అర్జునుడు చేష్టలుడిగి, నిశ్చేష్టునిలాగా రెప్పవేయడమే మరచిపోయాడు. ఆ బాణం



లోంచి బయటపడిన అశ్వసేనుడనే విషసర్పాన్ని చంపించేశాడు శ్రీకృష్ణుడు. ఈవిధంగా శ్రీకృష్ణుని అనుగ్రహంతో ప్రాణాపాయ పరిస్థితి నుంచి అర్జునుడు బయటపడ్డాడు.

భీష్మాచార్యుల వారికి స్వచ్ఛంద మరణం అనే వరం ఉంది. అందువల్ల ఆయన అంపశయ్యపై పరుండి ఉత్తరాయణ పుణ్యకాలం వరకు జీవించి ఉండటానికి తన మరణాన్ని వాయిదా వేశారు. శ్రీకృష్ణునితో కలిసి పంచపాండవులు భీష్మాచార్యుల వద్దకు వచ్చారు. అంపశయ్యపై నిశ్చలంగా పరుండిన ఆయనను చూసి వారు దుఃఖితులయ్యారు. ధైర్యాన్ని కూడదీసుకుంటూ ఆయనకు నమస్కరించారు. ఆయన ప్రశాంత చిత్తంతో వారిని ఆశీర్వదించారు. అప్పుడు భీష్మాచార్యులు తనకు దాహంగా ఉందనీ నీరు కావాలని కోరారు. అక్కడ ఆ రణభూమిలో నీరు లభించకపోవడంతో అర్జునుడు తన శరాన్ని భూమిలోపలకు ఎక్కు పెట్టాడు. ఆ బాణం భూమిలోపలకు దిగడంతో భూమి అడుగునుంచి ఉవ్వెత్తున జలధారలు ఉబికాయి. ఆ జలంతో భీష్ముని దప్పిక తీరిపోయింది. అంతటి ధనుర్విద్యా ప్రవీణుడు అర్జునుడు.

కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు యుద్ధం సాధించారు. శ్రీకృష్ణార్జునులు రథం మీద ఆసీనులై రాజప్రాసాదాన్ని సమీపించారు. పట్టణంలోని పౌరులందరూ ఆనందాతిశయంతో పాండవులకు జయ జయ ధ్వానాలు చేశారు. కృష్ణుడు అర్జునునితో ''అర్జునా! నీ గాండీవాన్నీ, అంబుల పొదినీ తీసుకుని నువ్వు ముందుగా రథం దిగు. నేను నీ తర్వాత రథం దిగుతాను. అలా చేయడం నీకు శుభకరం'' అన్నాడు. శ్రీకృష్ణుడు తనను ముందుగా రథం ఎందుకు దిగమన్నాడో తెలియలేదు అర్జునునికి. అయినప్పటికీ కృష్ణభగవానుని ఆదేశం ప్రకారం అర్జునుడు రథం దిగాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు రథం నుండి క్రిందకు దిగాడు. శ్రీకృష్ణుడు రథాన్ని దిగగానే రథ ధ్వజం మీద ఉన్న హనుమంతుడు అంతర్ధానమయ్యాడు. ఆ వెనువెంటనే రథము గుర్రాలతో సహా తగలబడిపోయి బూడిద మిగిలింది. ఆ సంఘటనను చూసినవారంతా భయభ్రాంతులై చేష్టలుడిగి నిలబడిపోయారు.

అర్జునుడు శ్రీకృష్ణుని ఎదుట నిలబడి ఆయనకు చేతులు జోడించి నమస్కరించి ''రథం ఆ విధంగా తగలబడి పోవడానికి కారణమేమిటి?'' అని ప్రశ్నించాడు. ''అర్జునా! నిజానికి రథం యుద్ధం సమయంలోనే వివిధ రకాలైన శస్త్రాస్త్రాలతో ఇదివరకే దగ్ధమయింది. అయితే ఈ రథంపై నేను ఆసీనుడనై, రథసారథినై రథాన్ని ఆపడం వల్ల యుద్ధ క్షేత్రంలో ఇది బూడిదగా మారలేదు. నీ పని ముగియగానే నేను ఈ రథాన్ని వదిలేశాను. నేను దిగిపోగానే ఈ రథం భస్మమైపోయింది. యద్ధభూమిలో నేను దీన్ని ఆపకపోయినా, ఇప్పుడు నీకంటే ముందే నేను రథం నుంచి దిగిపోయినా, ఇది తక్షణమే బూడిదయ్యేది కౌంతేయా'' అని చెప్పాడు కృష్ణుడు. శ్రీకృష్ణభగవానుని లీలలను, మహిమలను కన్నులారా కాంచిన పాండవులు మహా ఆనంద భరితులయ్యారు. అర్జునునికి, శ్రీకృష్ణుని పొగడటానికి అతని మహిమను వర్ణించటానికి నోటమాట రాక, దివ్యతేజంతో ప్రకాశిస్తున్న శ్రీకృష్ణభగవానుని చూస్తూ ఉండిపోయాడు. అర్జునునిలో సుగుణాలు మెండుగా ఉన్నాయి. అందుకు కారణం అర్జునుడు శ్రీకృష్ణునికి అమిత భక్తుడు కావటమే నని చెప్పవచ్చు. శ్రీకృష్ణునికీ, అర్జునునికీ మధ్య మైత్రీభావం అమితంగా ఉంది.

# పంచ ప్రయాగలు

ప్రయాగ అంటే సంగమం. నదులు సంగమించే పవిత్రస్థలం. అంటే నదులు లేక నీటిప్రవాహాలు, ఒకదానితో మరొకటి కలిసిపోయే ప్రదేశం అని అర్థం. కేదార్ నాథ్, బదరీ నాథ్ వెళ్ళే మార్గంలో పంచ ప్రయాగలు అని చెప్పబడే అయిదు పవిత్ర ప్రదేశాలు ఉన్నాయి. అవి విష్ణు ప్రయాగ, నంద ప్రయాగ, కర్ణ ప్రయాగ, రుద్ర ప్రయాగ, దేవ ప్రయాగ. ఈ ఐదింటిని కలిపి పంచ ప్రయాగలు అని పిలుస్తారు. ఈ క్షేత్రాలు మోక్ష ప్రదాలని నమ్మకం.

## విష్ణుప్రయాగ

బదరీనాథ్ నుండి దక్షిణంగా 38 కిలోమీటర్ల దూరంలో విష్ణు ప్రయాగ ఉన్నది. విష్ణు ప్రయాగకు దూరంగా కొంత దూరంలో 'నితి' అనే లోయ ప్రదేశం ఉంది. ఆ లోయలో ఉన్న కొండ శిఖరాల మీద నుండి వాలుగా జాలువారే నీరు, ఒక నదీ ప్రవాహంలా మారి దౌలి గంగ (ధవళ గంగ) అనే పేరుతో పడమటి దిక్కుగా ప్రవహిస్తూ వచ్చి విష్ణు ప్రయాగ దగ్గర



అలకనంద నదిలో కలిసిపోతుంది. విష్ణుమూర్తి వీర నారాయణ రూపం ధరించి, తపస్సు చేయడానికి బదరికావనం వెళుతూ, ఈ సంగమం దగ్గర కొంతకాలం ఉండి తపస్సు చేశాడట. అందువల్ల ఈ పవిత్ర ప్రదేశానికి విష్ణు ప్రయాగ అనే పేరు వచ్చింది. ఇక్కడ ఒక పురాతన ఆలయం ఉంది. అందులోని దైవం శ్రీమహావిష్ణువు.

## నంద ప్రయాగ


బదరీనాథ్ నుండి సుమారు 106 కిలోమీటర్లు దక్షిణ భాగాన నందప్రయాగ ఉన్నది. ఇక్కడకు ఈశాన్యంగా సుమారు 75 కిలోమీటర్ల దూరంలో నందాదేవి పర్వతశిఖరం ఉంది. ఆ శిఖరం చుట్టూ ఉన్న పర్వతాల మధ్య ఒక మంచులోయ ఉన్నది. ఆ లోయలో నుండి నందాకిని అనే చిన్న నది పడమటి దిక్కుగా ప్రవహిస్తూ వచ్చి అలకనంద నదిలో కలుస్తుంది. నందాదేవి శిఖర ప్రాంతంలో జన్మించిన కారణంగా దీని పేరు నందాకిని అని



పిలువబడుతోంది. ఈ నది పేరు మీద ఈ సంగమ ప్రదేశం నంద ప్రయాగగా ప్రసిద్ధి చెందింది. పూర్వం నందుడు అనే ఒక చక్రవర్తి ఈ పవిత్ర సంగమం దగ్గర గొప్ప యజ్ఞాన్ని నిర్వహింప చేశాడట. అందుచేత ఆయనే పేరు మీద ఈ ప్రదేశానికి నంద ప్రయాగ అనే పేరు వచ్చిందని మరొక ఐతిహ్యం ద్వారా తెలుస్తుంది.

## కర్ణ ప్రయాగ


నంద ప్రయాగ తర్వాత అలకనంద నది యొక్క దిశ కొంత నైఋతి దిక్కుగా మారుతుంది. నంద ప్రయాగ తర్వాత సుమారు 22 కిలోమీటర్ల దూరంలో, అంటే బదరీనాథ్ నుండి



128 కిలోమీటర్ల దూరంలో కర్ణప్రయాగ ఉన్నది. ఇక్కడ నుండి తూర్పుగా సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక మంచు లోయలో నుండి 'పిడరగంగ' అనే నది ప్రవహిస్తూ వచ్చి ఆ అలకనంద నదిలో కలుస్తుంది. ఈ రెండు నదుల సంగమం వద్ద మహాభారత కథలోని కర్ణుడు సూర్యభగవానుని గూర్చి తపస్సు చేసి, ఆయన నుండి కవచ కుండలాలను పొందాడని స్థల పురాణం. ఆ కారణంగా ఈ సంగమానికి కర్ణప్రయాగ అనే పేరు వచ్చింది అంటారు. ఇచ్చటనే ఉమాదేవి అనే చక్కని ఆలయం ఉన్నది. భక్తులు ఈ ఆలయాన్ని దర్శిస్తారు.

## రుద్ర ప్రయాగ

కర్ణ ప్రయగా నుండి సుమారు 31 కిలోమీటర్లు నైఋతి దిశగా అంటే బదరీనాథ్ నుండి 159 కిలోమీటర్ల దూరంలో రుద్ర ప్రయాగ ఉన్నది. హరిద్వార్ – ఋషీకేష్ ల నుండి వచ్చిన మార్గం రుద్రప్రయాగ దగ్గర రెండుగా చీలి, ఒక మార్గం కేదార్ నాథ్ వైపు, మరొకటి బదరీనాథ్ వైపుకు సాగిపోతాయి. కేదార్ నాథ్ వద్ద ఉన్న కొండలలో జన్మించిన మందాకినీ నది, దక్షిణంగా ప్రవహిస్తూ వచ్చి ఈ రుద్ర ప్రయాగ దగ్గర అలకనంద నదిలో కలుస్తుంది. రుద్ర ప్రయాగ తర్వాత మందాకిని నది ఉనికి ఉండదు అనే చెప్పాలి. కేవలం మందాకినీ నదితో కలిసిన అలకనంద మాత్రమే ముందుకు సాగిపోతుంది. ఈ రుద్ర ప్రయాగలో నారద మహర్షి కొంతకాలం తపస్సు చేశాడని స్థలపురాణం చెబుతుంది. ఈ ఊరిలో చాలా పురాతన కాలం నాటి జగదాంబ దేవి అనే అమ్మవారి ఆలయమూ, రుద్రనాథ్ శివాలయం ఉన్నాయి. ఈ



స్వామిపేరున ఈ ఊరు రుద్రయాగ అని ప్రసిద్ధి చెందింది.

## దేవ ప్రయాగ

ఉత్తరాఖండ్ లో టేహ్రీగర్వాల్ జిల్లాలో సముద్ర మట్టానికి 2723 అడుగుల ఎత్తులో ఉన్న ఒక ప్రసిద్ధ పట్టణం దేవప్రయాగ. ఉత్తరాంచల్ రాష్ట్రంలోని హృషీకేష్ నుండి 70 కిలోమీటర్ల దూరంలో బదరీనాథ్ వెళ్ళు దారిలో ఈ క్షేత్రం ఉంది. ఈ



పట్టణానికి ఇక్కడ నివసించిన ఒక ప్రఖ్యాత హిందూ యోగి దేవ్ శర్మ పేరు పెట్టారు. 108 దివ్య తిరుపతులలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో కేదార్ నాథ్ లో పుట్టిన మందాకినీ నది, బదరీనాథ్, కొండల్లో పుట్టిన అలకనందా నది, గంగోత్రిలో పుట్టిన గంగానది మూడు నదులు ఇక్కడ కలుసుకుంటాయి. త్రివేణీ సంగమంగా పవిత్రమైన ఈ పుణ్యక్షేత్రం శ్రాద్ధకర్మలకు ప్రసిద్ధి చెందినది. బ్రహ్మచర్య వ్రతంతో నాలుగు నెలల కాలం ఇక్కడ అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తే మోక్షప్రాప్తి కలుగుతుందని శివుడు నారదునితో చెప్పినట్లు స్కాందపురాణం వివరిస్తుంది. ఈ దేవప్రయాగ దగ్గర, గంగోత్రి నుండి వచ్చిన భాగీరథి నది గంగానదిలో కలిసిపోతుంది. దేవప్రయాగ తర్వాత ఉండే ప్రవాహం గంగానది అనే పేరుతో పిలువబడుతుంది. అటు భాగీరథి, ఇటు అలకనంద నదులు ఈ రెండు తమ ఉనికిని ఈ దేవప్రయాగతో కోల్పోతాయి. దేవప్రయాగ ఊరు కొండ ఏటవాలులో, వరుసలుగా మెట్లు మెట్లుగా ఉంటుంది. పురాణాల ప్రకారం ఇక్కడ శ్రీరాముడు మరియు అతని తండ్రియైన దశరథ మహారాజు ఇక్కడే తపస్సు చేశారు. పాండవులు కూడా ఈ క్షేత్రాన్ని దర్శించి, ఈ నదిలో స్నానం చేసి స్వామివారిని దర్శించారని ప్రతీతి. ఇచ్చట సీతారాముల ఆలయం ఉంది. భక్తులు స్వామిని 'రఘునాథ్ జీ'గా కొలుస్తారు. ఈ ఆలయానికి వెనకవైపున హనుమాన్ ఆలయం కూడా ఉన్నది. ప్రధాన దేవాలయంలోని 'నీలమేఘ పెరుమాళ్ ఆనాడు భరద్వాజ మహర్షికి ప్రత్యక్షమైనట్లు, స్వామిని పెరియాళ్వార్, తిరుమంగై ఆళ్వార్ కీర్తించినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తుంది.

★ ★ ★



# భీష్ముడు

– పి.ఎల్.ఎన్.మూర్తి

శంతన మహారాజు వలన గంగాదేవికి భీష్ముడు జన్మించెను. అతని మొదటిపేరు దేవవ్రతుడు. ''ద్యో'' అనే పేరుగల ఎనిమిదవ వసువు యొక్క అవతారము. తన తండ్రి శంతన మహారాజుకు, సత్యవతితో పెండ్లి జరిపించుటకు ఆమె తండ్రి దాశరాజు అభిమతానుసారము జీవితాంతము బ్రహ్మచారిగా నుందుననియు, రాజ్యపదవిని ఆశించననియు, రాజ్యమును తృణప్రాయముగా త్యజింతుననియు భీషణ ప్రతిజ్ఞ చేసెను. అట్టి భీషణ ప్రతిజ్ఞ చేసినందున నాటినుండి దేవవ్రతుడు భీష్ముడను పేర సార్థక నామధేయుడయ్యెను. తన తండ్రి సుఖ సంతోషములకై మానవులకు అత్యంత మోహకారకమగు స్త్రీ సుఖమును, భోగభాగ్యములకు ఆలవాలమైన రాజ్యసౌఖ్యములను జీవితాంతం శాశ్వతంగా త్యజించినాడు. ఈ కారణంతో తండ్రి భీష్ముని యెడ మిగుల ప్రసన్నుడాయెను. ''పుత్రకా! నీ ఇచ్ఛ లేక మృత్యువు కూడా నిన్ను కబళింప జాలదు. కనుక నీకు ఇచ్ఛా మరణమును ప్రసాదించుచున్నాను'' అని అనుగ్రహించెను.

భీష్ముడు ఆజన్మ బ్రహ్మచారి. మహాతేజస్వి. శస్త్రాస్త్రములందు పరిపూర్ణ పాండిత్య ప్రతిభ కలవాడు. అపార అనుభవజ్ఞుడు. మహాజ్ఞాని. గొప్ప వీరుడు. దృఢ నిశ్చయ సంపన్నుడు. మహాపురుషుడు. ఈ మహనీయుని యందు శౌర్యము, వీర్యము, త్యాగము, క్షమ, దయ, శమము, దమము, సత్యము, అహింస, సంతోషము, శాంతి, బలము, తేజస్సు, న్యాయమందు విశ్వాసము, నమ్రత, ఉదారత, లోకప్రియత్వము, స్పష్టమైన వాద, ప్రతివాద పటిమలు గలవు. కారణజన్ముడు. ఎట్లనగా?

**కం. ముదమున బ్రభాసుడనునెని**
**మిదియవ వసునంశమునను మేదిని భీష్మం**
**దుదయించె సర్వవిద్యా**
**విదుడపజిత పరశురామ వీర్యుండు బలిమిన్**

**-భారతము – ఆనుశాసనిక పర్వము – తృతీయాశ్వాసము – 77వ పద్యం**

పూర్వజన్మమందు భీష్ముడు ప్రభాసుడను అష్టమవసువు. అతడు శాపవశమున శంతన మహారాజుకు దేవవ్రతుడను పేర జన్మించెను. అతడే భీష్ముడు. దేవవ్రతునకు గాంగేయుడని పేరు గలదు. అతడు మహావీరుడు. అమిత బలసంపన్నుడు.

ప్రతివాదపటిమ, సాహసము, బ్రహ్మచర్యము, జ్ఞానవిజ్ఞానములు మాతాపితరుల యందును, గురువుల యెడను మిక్కలి భక్తిభావము మున్నగు సద్గుణములన్నియు పరిపూర్ణముగా వికసించి ప్రకాశించుచుండెను. ఇతని జీవితము భగవద్భక్తికి అంకితము. శ్రీకృష్ణభగవానుని చక్కగ అధ్యయనము చేసిన మహనీయుడు. పరమ నిష్ఠాగరిష్ఠుడు. సేవయందు శ్రద్ధాసంపన్నుడు. శ్రీకృష్ణ భగవానునికి ప్రీతిపాత్రుడు.

దుర్యోధనుని కొలువునందున్నను, ఎవరియందును పక్షపాత వైఖరిని ప్రదర్శించలేదు. ముమ్మూర్తులా ధర్మపక్షపాతి. కౌరవ సభామధ్యమున, నిర్భయముగా రారాజునకు హితముపదేశించిన హితైభిలాషి, శ్రీకృష్ణ భగవానుని విశ్వరూపమును సందర్శించిన పరమభాగవతోత్తముడు. రాజనీతి, ధర్మరక్షణము, క్షాత్రధర్మము నిలుపుటకుగాను కురుక్షేత్ర సంగ్రామములో అతిరథుడై నిలచి పోరొనరిన వీరాగ్రేసరుడు. ఆహవరంగమున భీష్మునితో సమానుడైన వీరుడెవ్వడును కానరాడు.

ఈ మహావీరుడు దుర్యోధనునితో, ''నను పంచపాండవులను యెన్నడును వధించను. కాని ప్రతిదినము పదివేలమంది యోధులను సంహరితును'' అని ప్రతిన చేసెను.

ఆచార్య స్థాన మలంకరించిన భీష్మపితామహుడు కురుక్షేత్ర సంగ్రామమున, కౌరవ పక్షమునకు సర్వసైన్యాధ్యక్షుడై పది దినములు భయంకరమగు సంగ్రామమొనర్చి తదుపరి క్షతగాత్రుడై అంపశయ్యపై చేరెను. ఆ సమయమున ఆ మహావీరుని దరిచేరి ధర్మరాజాదులు సేవించుచుండిరి. అట్టి యెడ సర్వమానవాళిని ఉద్ధరించవలెననెడి తలంపుతో ''శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము''ను భీష్మపితామహుడు గానమొనర్చి జ్ఞానోపదేశ మొనర్చెను. అటుల ఆ మహనీయుడు, ఉత్తరాయణ పుణ్యకాలము వచ్చిన తదుపరి, తన ఇచ్ఛతో దేహమును త్యజించెను. అనంతరము పరమ భాగవతోత్తముడైన భీష్మాచార్యుడు విష్ణు సాయుజ్యము చేరి సుఖించెను. మహాభారత చరిత్రలో భీష్ముని వంటి భగవద్భక్తుని అనునిత్యము స్మరించి నివాళులర్పించుట ప్రతి భారతీయుని పవిత్ర ధర్మము.

భీష్ముని ధనుంజయుడు తన వాడి బాణములచే గాయపరచగా శరతల్పముపై పవళించెను. ధర్మనందనుడు విషాదవదనుడై భీష్ముని సమీపించి, వర్ణాశ్రమ ధర్మములను,



రాజధర్మములను, ధర్మార్థ కామ మోక్షములకు సంబంధించిన ధర్మములను నానావిధ ఉపాఖ్యానేతిహాసములను కురువృద్ధుని వలన నెరిగెను. అంత ఉత్తరాయణము సమీపించ స్వచ్ఛంద మరణమును పొందు సమయమున భీష్ముడు లౌకిక మోహములు విసర్జించి శ్రీహరిని నుతించెను.

మ॥ త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింప బ్రాభాతనీ
రజబంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజ సంయుక్త ముఖారంవిద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయం జేరెడు వన్నెలాడు మది నావేశించు నెల్లప్పుడున్

మ॥ హయరింఖాముఖ ధూళిధూసర, పరిన్యస్తాలకోపేతమై
రయజాత శ్రమతోయ బిందుయుతమై రాజిల్లు నమ్మోముతో
జయముం బార్థున కిచ్చువేడ్క నని నాశస్త్రాహతింజాల నొ
చ్చియు బోరించు మహానుభావు మదిలో జింతింతు నశ్రాంతమున్

మ॥ నరుమాటల్విని నవ్వుతో నుభయ సేనా మధ్యమక్షోణిలోఁ
బరు వీక్షింప రథంబునిల్పి పర భూపాలావళిం జూపుచుం
బర భూపాయవు లెల్ల జూపులన కుంభత్కేళి వంచించు నీ
పరమేశుండు వెలుంగుచుండెడు మనఃపద్మాసనాసీనుడై

క॥ తనవారి జంపజాలక, వెనుకకు బోనిచ్చగించు విజయున్ శంకన్
ఘనయోగ విద్యబాపిన మునివంద్యుని పాదభక్తి మొనయున్ నాకున్

సీ॥ కుప్పించి యెగసిన గుండలంబులకాంతి గగన భాగంబెల్లగప్పికొనగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న జగములవ్రేగున జగతి గదల
జక్రంబు జేపట్టి చనుదెంచు రయమున బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయక మన్నింపుమని క్రీడి మరల దిగువ

తే॥ గరికి లంఘించు సింహంబు కరణి మెఱసి
నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువుమర్జున! యనుచు మద్విశిఖవృష్టి,
దెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు

మ॥ తనకున్ భృత్యుండు వీనిగాచుట మహాధర్మంబు వొమ్మంచున
ర్జున సారథ్యంబు పూని పగ్గములుచే జోద్యంబుగా బట్టుచున్
మునికోలన్వడి జూపి ఘోటకముల న్మోదించి తాటింపుచున్
జనులన్మోహము నొందజేయు పరమోత్సాహుం బ్రశంసించెదన్

క॥ పలుకుల నగవు నడపుల,
నలుకల నవలోకనముల నాభీరవధూ
కులముల మనములతాలిమి,
కొలుకులు వదలించు ఘనుని గొలిచెద మదిలోన్

అ. మునులు నృపులుసూడ మును ధర్మజునిసభా, మందిరమున
యాగమండపమున జిత్ర మహిమతోడజెలువొందు
జగదాది దేవుడమరు నాదు దృష్టియందు

మ. ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కొక్కడై తోచు పో
లికనేదేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ
న్యకదంబుల హృత్సరోరుహములన్ నానావిధానూన రూ
పకుడై యొప్పుచు నుండునట్టి హరినే బ్రార్థింతు శుద్ధుండనై

అని యిట్లు భీష్ముడు శ్రీహరిని హృదయ కమలమున నిలుపుకొని కీర్తించుచు వాసుదేవునియందు లీనమయ్యెను. ఆ మహనీయుని గాంచి జనులెల్లరు చలనములుడిగిరి. దేవతా గణములు దుందుభిలు మ్రోగించిరి. సాధుజనులు కీర్తించిరి. దివినుండి పుష్పములు నెడతెరిపి లేక కురిసెను. మృతుండైన భీష్ముని గాంచి క్షణకాలము ధర్మరాజు దుఃఖించి పరలోక క్రియలు నిర్వహించెను. అనంతరము శ్రీకృష్ణునితో గూడి హస్తినాపురమునకు చేరి, గాంధారి ధృతరాష్ట్రుల నూరడించి, రాజ్యాభిషిక్తుడై ధర్మమార్గమున రాజ్యపాలనము గావించుచుండెను.

# విష్ణు సహస్రనామం

– సంపత్ కుమార్

మనకు విష్ణు సహస్రనామం ఎలా వచ్చింది? భీష్మపితామహుడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు అందరూ శ్రద్ధగా విన్నారు కృష్ణుడు, ధర్మరాజుతో సహా. కాని ఎవరూ రాసుకోలేదు. మరి మనకెలా అందింది ఈ అద్భుతమైన విష్ణు సహస్రనామం.

అది 1940వ సంవత్సరం. శ్రీశ్రీశ్రీ మహా పెరియవా కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారిని ఒక వ్యక్తి ఇంటర్వ్యూ చేయడానికి టేప్ రికార్డర్ తో వచ్చాడు. ఆ టేప్ రికార్డర్ చూసి స్వామివారు అక్కడున వారందరినీ ఉద్దేశించి ''ప్రపంచంలో అతి పురాతనమైన టేప్ రికార్డర్ ఏది'' అని అడిగారు.

ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు. మళ్ళీ స్వామివారు విష్ణుసహస్రనామం మనకెలా వచ్చింది? అని అడిగారు.

భీష్ముడందించారని ఒకరన్నారు.

''భీష్ముడు విష్ణు సహస్రనామం పలుకుతున్నప్పుడు ఎవరు వ్రాసుకున్నారు?'' అని ప్రశ్నించారు స్వామివారు.

మళ్ళీ నిశ్శబ్దం.

స్వామివారు మళ్ళీ చెప్పటం మొదలుపెట్టారు. భీష్ముడు సహస్ర నామాలతో కృష్ణుడిని స్తుతిస్తున్నప్పుడు అందరూ కృష్ణుడు, పాండవులు, వ్యాస మహర్షితో సహా అత్యంత శ్రద్ధగా వినడం మొదలుపెట్టారు. ఎవరూ వ్రాసుకోలేదు. అప్పుడు యుధిష్ఠిరుడు ''ఈ వేయి నామాలని మనమంతా విన్నాము కాని మనమెవరం వ్రాసుకోలేదు. ఇపుడెలా కృష్ణా?'' అని అడిగాడు.

''అవును కృష్ణా ఇపుడెలా? ఆ సహస్రనామాలు మాకందరికీ కావాలి'' అని అందరూ కృష్ణుడిని వేడుకున్నారు.

''అది కేవలం సహదేవుడు, వ్యాసుడి వల్లనే అవుతుంది'' అని చెప్పాడు శ్రీకృష్ణుడు.

''అదెలా?'' అని అందరూ అడిగారు.

''మనందరిలో సహదేవుడొక్కడే సూత స్ఫటికం వేసుకున్నాడు. ఈ స్ఫటికం మహేశ్వర స్వరూపం. దీని ప్రత్యేకతేంటంటే వాతావరణంలోని శబ్ద తరంగాలని గ్రహించి తనలో దాచుకుంటుంది. సహదేవుడు శివుడిని ధ్యానించి ప్రార్థిస్తే ఈ స్ఫటికంలోని సహస్రనామ శబ్ద తరంగాలని వెనక్కి రప్పించి (రీప్లే) వ్యాసమహర్షితో వ్రాయించమని కృష్ణుడు సలహా ఇచ్చాడు.

శ్రీకృష్ణుడి ఆజ్ఞ మేరకు ఆ సహస్రనామ శబ్ద తరంగాలు వచ్చిన చోట అనగా భీష్ముడికి అతి సమీపంలో సహదేవుడు, వ్యాసమహర్షి కూర్చుని ఆ సహస్రనామ శబ్ద తరంగాలు రీప్లే అవుతుంటే వ్యాస మహర్షి వ్రాసిపెట్టాడు.

ఆ విధంగా మనకు మొట్టమొదటి టేప్ రికార్డర్ శివస్వరూప స్ఫటికం ద్వారా విష్ణు సహస్రనామం అందిందని మహాస్వామి వారు సెలవిచ్చారు.

జయ జయ శంకర ! హర హర శంకర !! గురుభ్యో నమః

## ఆచారము అంటే ఏమిటి?

ఆచరణీయమైన దానిని ఆచారము అంటారు. బుద్ధిమంతులు, మేధావులు, పండితులు, ధర్మవేత్తలు, కులపెద్దలు, ఆగమ కోవిదులు ఎందరెందరో ఆలోచించి, తర్కించి మనిషిని మహోన్నతుని చేయటానికి దురాచారం నుండి దూరం చేయటానికి ప్రవేశపెట్టిన ఆలోచనే ఆచారం అనవచ్చు. చాలా ఆచారాలు కట్టుబాట్ల కోసమే సృష్టింపబడ్డాయి. కాలగమనంలో ఆచారాలు కొన్ని వికృతరూపం దాల్చాయి. ఆచారాల పేరుతో దురాచారాలు చోటు చేసుకున్నాయి. ఇది దురదృష్టం. ఆచారాలు, ఆనవాయితీలు, సంప్రదాయాలు, కులధర్మాలు మొదలైనవన్నీ ద్వాపరయుగం నుండే ఎక్కువగా మనకు సంక్రమించాయి అంటారు కొందరు.

శ్రీరాముని కాలంలో ధర్మం ఉంది. ఆచారాలింతగా లేవు. మనుష్యుల వృత్తిని బట్టి, ప్రవృత్తిని బట్టి వర్ణ విభజన జరుగుతూ ఉన్న త్రేతాయుగ సమయంలో హిందూ సమాజంలో నాలుగే కులాలు ఉండేవి. ఇప్పుడు ఉన్న ఇన్ని తెగలు లేవు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అన్న నాలుగు వర్ణాలు మాత్రమే ఉండేవి. ఒక్కొక్క వర్ణం వారికి ఒక్కొక్క ఆచారం ఉండేది. కాలక్రమంలో శూద్రవర్ణం వివిధ రకాల మార్పులకు, వివిధమైన విభాగాలకు లోనైపోయింది. ఫలితంగా నూరారు తెగలుగా విడిపోయి ఎవరికి ఇష్టమైన ఆచారాలను వారు స్థిరపరచుకున్నారు. ఒక్కొక్క తెగకు ఒక్కొక్క గురువు (కులపెద్ద) ఉండటం వలనే రకరకాల ఆచారాలను నెలకొల్పటం జరిగింది. గమనించవలసిన విషయమేమిటంటే ఒక్కటే వివిధ కులాలుగా విడిపోవడం జరిగింది. కారణమేమిటంటే ఆనాటి శూద్రులు విద్యావంతులు కారు. సమిష్టి జీవనానికి ఉండే బలం విలువ వారికి విద్యావంతులు కాకపోవటం వలన తెలియదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ఎక్కువ తక్కువగా ఒకే రకమైన ఆచారాలు నియమాలు పాటించారు. అతిజన సంఖ్యాబలం ఉన్న శూద్ర వర్ణం వారందరూ వివిధ కులాలుగా మార్పు చెంది రకరకాల ఆచారాలను, సంప్రదాయాలను కట్టడి చేసుకున్నారు. అయితే కొన్ని ఆచారాలు అన్ని వర్ణాలకూ ఒక్కటిగానే ఉండేవి.

# కోటి దీవెనల గుప్పెడు గోవిందుడు

- బండారు పురుషోత్తం

వసుధ దివ్యగీత చెప్పినవాడు
వరలు విశ్వరూపం విప్పినవాడు
చాణూరుని చావగొట్టినవాడు
వేణువు వినిపించి, శాంతిని నింపినవాడు
దుష్టకంసుని ధూళి కలిపినవాడు
శిష్ట పరిరక్షణ చేపట్టినవాడు
నీతిలేని శిశుపాల, జరాసంధుల నిర్మూలించి,
జగతి పీడిత జనుల కాపాడినవాడు
పాంచాలి మానం కాచినవాడు
పాండవ విజయం కూర్చినవాడు
దుశ్శాసన, దుర్యోధనుల సమయింపచేసి,
దుర్వార దుష్టత్వము దూరం చేసినవాడు
అధర్మం అమితమై విజృంభించిననాడు
అనివార్యంగా అవతరించు ఆదిదేవుడు
సాధుజనుల రక్షించ, దుష్టవర్తనుల శిక్షింప
వేదవిభుడు, యుగయుగమున పూని
ధరణి ప్రభవించు ద్వారకా కృష్ణుడు
ద్వాపరమున నున్నట్టి దేవదేవుడు
దాగక కలియుగమున ధరణి జనుల
తరింపజేయ, దివ్యశేషనగమున
నిట్టే నిల్చియున్నాడు వేంకటవిభుడై
పట్టు వదలక భక్తుల బ్రోచువాడు
స్మరించినంతనే సంకటముల హరించి
సకల జనుల మ్రొక్కులు దీర్చువాడు
కోరిన వరములిచ్చు కోనేటిరాయడు
కోటి దీవెనల గుప్పెడు గోవిందుడేవాడు

వివరణము : ద్వాపర యుగమున ఉండిన శ్రీకృష్ణుడే కలియుగమున శ్రీవేంకటేశ్వరుడై అవతరించినాడని పురాణములు చెప్పుచున్నవి. ద్వాపర యుగాంతమున శ్రీకృష్ణుడు తన నిర్యాణానంతరము శిలారూపము దాల్చి, దివ్యశేషాచలమున నిలచినాడని తెలియుచున్నది. ఆ సంఘటననే శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారు తన కీర్తనమున కూడా వివరించి యున్నాడు.

"ఇందుగలడిందు లేడనెంచి చూపదానివాడు
అందమైన రేపల్లెవాడ, నాడీనట్టె
అంది కృష్ణావతారామైనట్టి దేవుడే
యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలచెనట్టె"

# మీ ప్రశ్న - మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1.** తవ స్పర్శాదీశం స్పృశతి కమలే మంగళప్రదం
తవేదం నోపాధే రుపనిపతితం శ్రీరసియత
ప్రసూనం పుష్యతీమపి పరిమళర్ధిం జగదిషు
న చైవంత్వా దేవం స్వదత ఇతి కశ్చిత్కవయతే

ఇది చాలా విశిష్టమైన శ్లోకమని పెద్దలు చెప్పగా విన్నాను. ఇది దేనిలో ఉన్నదో, దీనిలోని గొప్పతనమేమిటో దయచేసి వివరించండి.

-కె.రమ, కె.సీతారాం – జూబిలీహిల్స్, హైదరాబాద్.

జవాబు – ఇది చాలా చాలా విశేషమైన శ్లోకం. ఇది శ్రీగుణ రత్నకోశము అనే శ్రీ పరాశర భట్టరు వారనుగ్రహించిన గొప్ప గ్రంథము లోని 29వ శ్లోకం.

శ్రీమన్నారాయణుడికి 'శ్రీ' కారణంగానే గొప్పదనం కలిగింది. అమ్మ స్పర్శతోనే ఆయన మంగళప్రదుడైనాడు. ఆమెకు మంగళత్వము మరికొకరివల్ల ఏర్పడినది కాదు. ఆమెలో స్వతస్సిద్ధముగా ఉన్నది. ఆమె స్వయంగా మంగళదేవత. పుష్పమునకు సుగంధము వలె లక్ష్మీదేవికి మంగళత్వము సహజము. ఆమె శ్రీమన్నారాయణునికి నిత్యానపాయిని. అనగా ఎప్పుడు విడవకుండా ఉంటుంది కాబట్టే ఆయనకు మంగళత్వము అంతగా లభించింది.

**2.** A, B, C, D, E, F, G అనేవి ఇంగ్లీషు వర్ణమాలలో ఉన్న ఇంగ్లీషు అక్షరాలని, వాటితో ఏర్పడే మాటలు ఏ పిల్లవాడిని అడిగినా Apple, Book ఇలా చెప్తాడు. కాని ఆధ్యాత్మిక పరంగా, జీవితపరంగా కూడా చక్కని సందేశం ఇచ్చే మాటలున్నాయని విన్నాను. అవేమిటో తెలియచేస్తే ధన్యుణ్ణి.

- ధృవ – అపర్ణ సరోవర్, నల్గొండ

జవాబు – వీటికి రకరకాలుగా చెప్తారు అనుభవజ్ఞులు. ముఖ్యంగా వినబడే మాటలు చాలా ఆసక్తికరంగా ఉండేవి చెప్తా. శ్రద్ధగా విను.

A – ఆల్వేస్ Always (ఎల్లప్పుడూ)
B – Be – ఉండు
C – Cheerful / Careful – ఆనందంగా, జాగ్రత్తగా
D – Don't – దైవాన్ని, గురువును
E – Ever – ఎప్పటికీ మరువకు
F – Forget
G – God, Guru

జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు పంతాలు పట్టింపులకు వెళ్ళరాదు. బంధుమిత్రులతో చాలా జాగ్రత్తగా క్లుప్తంగా మాట్లాడగలరు. చిన్నాపెద్ద విషయములలో ఓర్పుతో మాట్లాడగలరు. పంతాలు, పట్టింపులకు సమయము కాదు. ఆర్థిక లోటుపాట్లు ఉన్నవి. కనకధార స్తోత్రం, ఓం నమోనారాయణాయ జపం చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలముగా ఉంటుంది. ఆదాయమునకు మించిన ఖర్చులు బంధుమిత్రుల కలయిక ఆకస్మిక ధనాదాయము. పెండింగ్ పనులు రాజీచేసుకొనుటకు సరైన సమయము. ఆదాయమునకు అనేక విధములుగా బ్రేకులు పడును. గాయత్రీదేవి ఆరాధన చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆదాయ వనరులు కలిగి ఉండగలరు. అధిక ఖర్చులు ఉండగలవు. ఓర్పు నేర్పుతో ముందుకు సాగండి. అనారోగ్య సూచనలు ఉండగలవు. చాలా బాగా ఉంటుంది. విందువినోదములు, బంధుమిత్రుల కలయిక. విష్ణు సహస్ర నామ పారాయణ చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు ఆదాయ వనరులు బాగుండగలవు. గతంలో ఉన్న బాకీలు తీర్చుకొనుటకు సరైన సమయం చాలా జాగ్రత్తగా ఉండి, శని దేవునికి పూజలు జపాలు చేయుట వలన ప్రతి విషయంలో అనుకూలత ఉంటుంది.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు నిరుత్సాహంతో అనేక విధములు అనారోగ్య సమస్యలు వెంటాడగలవు. తెలియని ఆర్థిక సమస్యలు. పరిస్థితులు అర్థం కావు. భయము వదిలి నిర్లక్ష్యము వదిలి చాకచక్యంగా ఉండాలి అనుకుంటే నవగ్రహ ప్రదక్షిణలు, జపదానములు ఆచరించండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు వ్యాపార వ్యవహార నైపుణ్యం కలిగి ఆదాయ వ్యయములు బ్యాలన్స్ చేయగలరు. ఎంత ధనం వచ్చిన బ్యాలన్స్‌గా ఉండగలరు. విలాసంగా గడుపుటకు మనసు ఉత్సాహం చూపగలదు. దుర్గాదేవి దర్శనం పూజలు వలన ఉత్సాహంగా ఉంటారు.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషుల కు కుటుంబంలో పెద్దవారి అనారోగ్యము. స్వస్థానం వద లవలసి ఉంటుంది. కలహాలు, బంధుమిత్రులకు అంతా దూరంగా ఉండగలరు. ఉన్నతంగా మాట్లాడి గౌరవమును పెంచుకొ నగలరు. ఆర్థికంగా అవసరానికి ధనం సమకూరగలదు. దుర్గాదేవి పూజలు ఓర్పును ఇవ్వగలవు.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో వ్యతిరేకత, అనారోగ్యం. దూర ప్రాంతములో ఉండవలసి రావచ్చును. చెడు స్నేహితుల వలన అజ్ఞాతవాసం ఉన్నది. చెడుకు దూరంగా ఉండండి. విద్యార్థులు సరస్వతి ద్వాదశ నామజపం చేయండి. శని తైలాభిషేకం ఎరుపు నువ్వులు కడిగి ఎండపోసినవి దానం ఇవ్వండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలము. ఆర్థిక వెసులుబాటు ఉన్నది. శ్రమకు తగిన ఆదాయం ఉన్నది. ఏ విధంగా ఆలోచన చేసినా అన్ని రంగాల్లో అభివృద్ధి ఉన్నది. స్థిరాస్తులు పెంచగలరు. అధిక వనరులు సమకూరగలవు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి. కోపం చికాకులు తొలగిపోగలవు.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. నూతన రంగాలలో ముందుకు సాగుటకు అవకాశములు కలిగి ఉన్నారు. వ్యక్తిగతమునకు అవకాశము ఇవ్వరాదు. కలుపుగోలుగా మాట్లాడగలరు. ఆనందంగా ఉంటుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, దుర్గాదేవికి పూజలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. తొందరపాటు లేకుండా అందరితో అనుకూలంగా ఉండగలిగినప్పుడు మీ సమస్యలకు పరిష్కారము ఉంటుంది. పని కాలేదని భ్రమలతో ఎవరిని నిందించరాదు. అదృష్టం కూడా ఉండాలి కదా. దుర్గాదేవికి పూజలు చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలత కొరకు గురువును పట్టుకొనిన సౌకర్యవంతమైన ఆదాయ వనరులు, దూర ప్రయాణములు కలిసి రాగలవు. సంతృప్తిని పొందగలరు. మీ మనసులో ముఖములో కాంతికి కారణం గురువును ఆరాధించండి. శనగలు దానం ఇవ్వండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. శత్రుఘ్నుని భార్య ఎవరు?
2. పరమశివుని కూడా మోహింపచేసింది ఎవరు?
3. సక్తువు – అంటే ఏమిటి?
4. విభీషణుడి కూతురు పేరేమిటి?
5. విప్రనారాయణుని మోహితునిగా చేసిందెవరు?
6. సక్తుప్రస్థుని కథ చెప్పిందెవరు?
7. వేంకటాద్రి ఎవరి పుత్రుడు?
8. ఏడు కొండల మహత్తును ఎవరు ఎవరికి చెప్పారు?
9. సరస్వతీదేవిని శపించిందెవరు?
10. కులశేఖరాళ్వారులు ఎవరి అంశ?
11. గోరా వ్రాసిన రచనలను ఏమంటారు?
12. వేంకటాచలంలో ఎన్ని తీర్థాలున్నాయి?
13. జయద్రథుని మరో పేరేమిటి?
14. కర్ణుని శక్తిబాణం ఎవరిని చంపింది?
15. పురుహూతికాదేవి ఎక్కడ వెలసింది?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. బూరుగు చెట్టు, 2. చిన్నగుండవెల్లి, 3. శ్రీహరి, 4. ప్రావార కర్ణుడు, 5. హోళీ, 6. రుమ, 7. నత్కీరుడు, 8. కేతకి, 9. రత్నావళి, 10. అకూపారుడనే తాబేలు, 11. కుమారస్వామి 12. చోఖామేళుని, 13. ఊర్వశి, 14. ఉపబర్హణుడు, 15. సుదర్శన చక్రం

### సరైన సమాధానాలు రాసినవారు

1. వేలూరి భానుమతి, 2. వి. వసుంధర, 3. రమాదేవి, 4. పి.విష్ణుమూర్తి, 5. వెంకటరమణ

పేరు: ______

చిరునామా: ______

______

______

______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**రమాదేవి**



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122




**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq

